# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 19-3-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 200 | పేజీలు: 8 | వెల: రూ.1/-


## ఆర్టీసీ కండక్టర్లు శానిటైజర్లు ఉపయోగించాలి

### టీఎస్ సర్కార్ మరో కీలక ఆదేశం

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య ఆరుకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే స్కూళ్లు, కాలేజీలు, థియేటర్లు, షాపింగ్ మాల్స్‌ను నెలాఖరు దాకా మూసివేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక ఇదే కోవలో తాజాగా ఆర్టీసీ కండక్టర్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆదేశాలిచ్చింది. ఇకపై కండక్టర్లు తప్పనిసరిగా తమ దగ్గర హ్యాండ్ శానిటైజర్లను ఉంచుకోవాలని తెలిపింది. బస్సులో ప్రయాణించే ప్రయాణీకులకు రెండు చుక్కలు వాళ్ల చేతులో వేసి రాసుకోమని సూచించాలని చెప్పింది. కండక్టర్లకు హ్యాండ్ శానిటైజర్లను ఆర్టీసీ యాజమాన్యమే

సమకూర్చుతుంది. తద్వారా కరోనా వ్యాప్తిని కట్టడి చేసేందుకు సాధ్యమవుతుందని ప్రభుత్వం చెబుతోంది. కాగా, దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 150కు చేరుకుంటోంది.

# ఎమ్మెల్సీ ఎన్నిక.. నామినేషన్ దాఖలు చేసిన కవిత

### వెంటవచ్చిన మంత్రి వేముల, ఎమ్మెల్యేలు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

నిజామాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు టీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత నామినేషన్ దాఖలు చేశారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కవిత తన నామినేషన్‌ను రిటర్నింగ్ ఆఫీసర్,కలెక్టర్ నారాయణ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కవిత పేరును సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. దీంతో ఉదయం మర్యాదపూర్వకంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని కవిత కలిశారు. ఆ తర్వాత కవితను పార్టీ కార్యకర్తలు, ఆమె అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ స్థానం కోసం కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల బరిలో నిలిచినప్పటికీ.. టీఆర్ఎస్ అభ్యర్థిగా కవిత సునాయాసంగా గెలుస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఎన్నిక అనివార్యమైతే ఏప్రిల్ 7న పోలింగ్ నిర్వహించి 9న ఓట్ల లెక్కింపు చేపడతారు. 2015లో టీఆర్ఎస్ పార్టీ నుంచి నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరిన భూపతిరెడ్డిపై అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. ఖాళీ అయిన ఈ ఎమ్మెల్సీ స్థానం పదవీ కాలం 2022, జనవరి 4 వరకు ఉండటంతో ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రక్రియ చేపట్టింది.

కవితకు మంత్రి సత్యవతి శుభాకాంక్షలు

రాష్ట్ర శాసనమండలి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన కవితకు మంత్రి సత్యవతి రాథోడ్ శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేయడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా బతుకమ్మ పండుగకు ప్రపంచ వ్యాప్తంగా కవిత గుర్తింపు తెచ్చారన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న మానవీయ నేత కవిత అన్నారు. కవితను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు సీఎం కేసీఆర్కు ధన్యవాదాలన్నారు. సీఎం నిర్ణయం మహిళలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తెలుపుతుందన్నారు. మండలిలో మహిళా సాధికారతకు సీఎం కేసీఆర్ ఇచ్చే ప్రాముఖ్యతకు నిదర్శనమని కొనియాడారు.

### టిఆర్ఎస్ శ్రేణుల హర్షం

మాజీ ఎంపీ కవితకు నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం హర్షణీయమని ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీలో కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్లు బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. కవిత అభ్యర్థిత్వం విషయంలో రెండో మాటలేదు. ఆమె అభ్యర్థిత్వాన్ని పార్టీలో అందరం స్వాగతిస్తున్నట్లు తెలిపారు. మంచి నిర్ణయం తీసుకున్న టీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు అన్నారు. తెలంగాణ జాగృతి స్థాపించి తెలంగాణ ఉద్యమంలో కవిత కీలకపాత్ర పోషించారన్నారు. తెలంగాణ ఉద్యమకారిణిగానే ఆమె 2014లో నిజామాబాద్ ఎంపీ టికెట్ సాధించి గెలిచారన్నారు. ఎంపీగా గెలుపొంది నిజామాబాద్‌కు అనేక సేవలందించారన్నారు. గడిచిన సారత్రిక ఎన్నికల్లో కవిత ఓటమి పట్ల ప్రజలు, తమ పార్టీ నేతలు చాలా బాధపడ్డారన్నారు.

## కవిత రాకతో మహిళా శక్తి పెరుగుతుంది : మంత్రి సత్యవతి

హైదరాబాద్, మార్చి 18: రాష్ట్ర శాసనమండలి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన కవితకు మంత్రి సత్యవతి రాథోడ్ శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేయడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా బతుకమ్మ పండుగకు ప్రపంచ వ్యాప్తంగా కవిత గుర్తింపు తెచ్చారన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న మానవీయ నేత కవిత అన్నారు. కవితను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు సీఎం కేసీఆర్కు ధన్యవాదాలన్నారు. సీఎం నిర్ణయం మహిళలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తెలుపుతుందన్నారు. మండలిలో మహిళా సాధికారతకు సీఎం కేసీఆర్ ఇచ్చే ప్రాముఖ్యతకు నిదర్శనమని కొనియాడారు.

# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

### భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు నిముషం నిబంధన వెనక్కి

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): తెలంగాణలో నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు జరుగనున్నాయి. కరోనా

నేపథ్యంలో నిమిషం నిబంధన ఎత్తివేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కరోనా కష్టాలు ఉన్న విషయం తెలిసిందే. కానీ ఇదే సమయంలో విద్యార్థులకు పరీక్ష సమయం. ఇప్పటికే ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తి కాగా.. నేటితో సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ కూడా పూర్తయ్యాయి. గురువారం నుంచి పదవ తరగతి పరీక్షలు మొదలు అవుతున్నాయి. పదోతరగతి పరీక్షలు ప్రారంభమయి ఏప్రిల్ 6వ తేదీన ముగియనున్నాయి. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. విద్యార్థులు కాపీ కొట్టకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందని ఆమె అన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని, విద్యార్థులు 8.30 గంటల వరకు పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో కరోనా వైరస్ ప్రబలి పోతుందని కొంత మంది కావాలని భయపెడుతున్నారని.. అలాంటి రూమర్లకు భయపడాల్సిన అవసరం లేదని.. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ప్రభుత్వం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారని అన్నారు. అంతే కాదు ప్రస్తుతం ఎండ తీవ్రత పెరిగిపోతుందని ఇందుకుగాను ప్రతి పరీక్ష కేంద్రంలో ఇద్దరు వైద్యసిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు అందించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుతామని తెలిపారు.

పరీక్షల సమయంలో ఎవైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించడానికి కంట్రోల్‌రూం నంబర్ 040-23230942ను డీ ఈఓ కార్యాలయంలో ఏర్పాటుచేసామని తెలిపారు. ఇప్పటి వరకు హాల్ టికెట్లు అందని విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుగుకోవడానికి పరీక్ష కేంద్రంలో లిక్విడ్, శానిటైజర్లు, సబ్బులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

# విదేశీ విమానాలు రద్దు చేయాల్సిందిగా కేంద్రానికి మంత్రి ఈటల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 18: హైదరాబాద్ నగరానికి వచ్చే విదేశీ విమానాలను పూర్తిగా రద్దు చేయాల్సిందిగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్ష వర్ధన్‌కు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారానే కోవిడ్-19 వ్యాప్తి చెందుతున్నట్లు స్పష్టమైన సమాచారం ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్థానికంగా కరోనా వైరస్ లేదన్నారు. కావునా కరోనా వ్యాప్తి నివారణకు విదేశాల నుంచి ప్రయాణీకులను నిలువరించాల్సిందిగా పేర్కొన్నారు.

గత కొన్ని వారాలుగా కోవిడ్-19 బాధిత దేశాల నుం చి హైదరాబాద్‌కు వచ్చే విదేశీ ప్రయా ణికుల సంఖ్య పెరిగిందన్నారు. కరోనా వ్యాప్తి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. సచివాలయం సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సందర్శకులను నిలిపివేసింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో కరోనా వ్యాప్తి నివారణ, చికిత్సపై మంత్రి ఈటల అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది.

భేటీకి సీఎస్, డీజీపీ, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ అధికారులు హాజరయ్యారు. విదేశాలనుంచి వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని వారందరినీ క్వారంటైన్‌లో ఉంచే ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. క్వారంటైన్లలో అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను మంత్రి ఆదేశించారు. ఎంత మంది బాధితులు వచ్చినా చికిత్సకు సిద్ధంగా ఉండాలన్నారు.

## గవర్నర్‌తో బిజెపి నేతల భేటీ

### అసెంబ్లీ తీర్మానం రాజ్యాంగ వ్యతిరేకమంటూ ఫిర్యాదు

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ గవర్నర్ తమిళిసైకి బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్.. పాకిస్థాన్ ముస్లింలకు వత్తాసు పలుకుతున్నారా? అని తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. ఎంఐఎం మెప్పు కోసమే సీఏఏ వ్యతిరేక తీర్మానం చేశారన్నారు.

ఎన్ఆర్సీపై ఇంకా ఎలాంటి చర్చ జరగలేదు అయినా.. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ అబద్దాలు చెప్పారని విమర్శించారు. ప్రజలెవరూ ఎలాంటి పత్రాలు చూపించాల్సిన అవసరం లేదని ఉద్ఘాటించారు.

ఈ తీర్మానం రాజ్యాంగ వ్యతిరేకమని దీనిని రద్దు చేయాలన్నారు. కెసిఆర్ తీరు దేశాన్ని అవమానించేదిగా ఉందన్నారు. గవర్నర్‌ని కలిసిన వారిలో మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ రామచందర్ రావు తదితరులు ఉన్నారు.

## చరిత్రలో నేటినిజం

కం॥ పదునగు ధైర్యములతో
పదునగు నటనమ్ములతో నాతర్నలతో
పిదుడ్డి తెరపై వెలుగగ
మదమొందుచుచు పలచు చుంటి "మోహను బాబు"నే!!

(మార్చి 19 మోహన్‌బాబు జన్మదినం)

-రాధశ్రీ

సెల్: 9494481210

## కరోనా పేషెంట్లకు ప్రత్యేక మెనూ

### ఆస్పత్రుల్లో వేర్వేరుగా ఆహార పదార్థాలు కేరళలో దేశవిదేశీ పేషంట్లకు అమలు

తిరువనంతపురం,మార్చి18 (ఆంఎన్ఎ): కేరళలో మొత్తం 24 కేసులు నమోదు అయ్యాయి. 268 మంది పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే వీరికి కేరళ ప్రభుత్వం ప్రత్యేక మెనూ ఏర్పాటు చేసింది. ఎర్నాకులం జిల్లా కలెక్టర్ ఎస్. సుహాస్ వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు రకాల మెనూలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఒక మెనూ మన దేశస్తులకు, మరో మెనూను విదేశీయులకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కేరళ ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఐసోలేషన్ వార్డుల్లో చికిత్స పొందుతున్న కరోనా పేషెంట్లకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నారు. కరోనా సోకిన వారి కోసం దేశంలో తొలిసారిగా కేరళలోనే ఐసోలేషన్ వార్డులను ప్రారంభించారు. ఈ వార్డుల్లో కరోనా పాజిటివ్ వచ్చిన వారు, అనుమానితులు చికిత్స పొందుతున్నారు. మన దేశస్తుల మెనూను చూస్తే.. బ్రేక్‌ఫాస్ట్ కోసం దోశ, సాంబార్, రెండు గుడ్లు, ఆరెంజ్ పండ్లు, టీ అందజేస్తున్నారు. ఉదయం 10:30 గంటల సమయంలో పండ్ల రసం ఇస్తున్నారు. లంచ్‌కు చపాతీలు, కేరళ మిల్స్‌తో పాటు చేపల ఫ్రై, మినరల్ వాటర్ ఇస్తున్నారు. మూడు గంటల సమయంలో టీతో పాటు బిస్కెట్లు, ఇక డిన్నర్‌లో అన్నంతో పాటు రెండు అరటి పండ్లు అందజేస్తున్నారు. విదేశీయుల మెనూ.. బ్రేక్‌ఫాస్ట్‌లో పండ్లతో పాటు సూప్, రెండు గుడ్లు ఇస్తున్నారు. లంచ్‌కు టోస్టెడ్ బ్రెడ్, చీజ్, పండ్లు, మూడు గంటల సమయంలో టీకి బదులుగా పండ్ల రసం, డిన్నర్‌లో టోస్టెడ్ బ్రెడ్, గుడ్లు, పండ్లు అందజేస్తున్నారు. ఇక ఐసోలేషన్ వార్డుల్లో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరికి న్యూస్ పేపర్ అందుబాటులో ఉంచుతున్నారు.

## కరోనాపై అతిగా భయపడకండి

### మరణం మన చేతుల్లో లేదు చెచన్యా నేత ఆసక్తికర వ్యాఖ్య

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్‌పై చెచన్యా నేత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డెడ్లీ వైరస్ గురించి అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మనిషి ఏదో ఒకరోజు మరణించాల్సిందేనని ఆ దేశ నేత రందాన్ కదిరోవ్ అన్నారు. ప్రజలు తమ చేతుల్లో లేని దాని గురించి బాధపడరాదని, సంప్రదాయ వైద్య చిట్కాలను విడిచిపెట్టరాదని సూచించారు. చైనా నుంచి వ్యాప్తి చెందిన వైరస్‌పై ఆందోళనతో ప్రజలకు కంటిమీద కునుకు లేదని, అది తమకు సోకి తాము మరణిస్తామని ప్రజలు ఆందోళన చెందుతున్నారని స్థానికంగా జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన పేర్కొన్నారు.వ్యాధి గురించి భయపడాల్సిన పనిలేదని..మీరు ఎప్పుడైనా మరణిసారు..మీ సమయం రాకముందే మరణించాలని ప్రయత్నించడం మానండని హితవు పలికారు. ముస్లిం మెజారిటీ రిపబ్లిక్ చెచెన్యా అధినేతగా దీర్ఘకాలం వ్యవహరించిన కదిరోవ్... కరోనాపై అతిగా ఆలోచించి అనవసర భయాలకు లోనుకావద్దని సూచించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలన్నారు. నీటిలో నిమ్మరసం, తేనె కలుపుకుని తాగాలని, వెల్లుల్లి అధికంగా వాడాలని చెప్పుకొచ్చారు. ఇక 13 లక్షల జనాభా కలిగిన చెచెన్యాలో డెడ్లీ వైరస్‌కు సంబంధించి ఇప్పటివరకూ ఒక్క కేసూ నమోదు కాలేదు.

## భారత జవాన్‌కు కరోనా పాజిటివ్

### విదేశం నుంచి వచ్చిన తండ్రిద్వారా సంక్రమణ తక్షణ పరీక్షలకు సిద్ధమయిన అధికారులు

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఇప్పటి వరకు భారత్‌లో కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య 147కు చేరింది. ఓ భారత జవాన్‌కు కూడా కరోనా పాజిటివ్ అని వైద్య పరీక్షల్లో తేలింది. బాధిత జవాను తండ్రి ఫిబ్రవరి 27న ఇరాన్ నుంచి లధఖ్‌కు తిరిగి వచ్చాడు. కరోనా లక్షణాలు కనిపించడంతో అతనికి వైద్య పరీక్షలు నిర్వహించగా కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో జవాన్ తండ్రిని ఫిబ్రవరి 29 నుంచి మార్చి 6వ తేదీ వరకు లధఖ్ హార్ట్ ఫౌండేషన్‌లోని ఐసోలేషన్ వార్డులో ఉంచారు. అయితే జవాన్ సాధారణ సెలవు మీద ఇంటికెళ్లిన సమయంలోనే ఇరాన్ నుంచి ఆయన తండ్రి వచ్చాడు. దీంతో జవాన్‌కు కూడా కరోనా సోకింది. మార్చి 2న తిరిగి ఆర్మీ విధుల్లో చేరాడు. కరోనా లక్షణాలతో బాధపడుతున్న జవాన్‌కు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించగా, కరోనా పాజిటివ్ వచ్చింది. జవాన్‌తో పాటు అతని భార్య, సోదరి, ఇద్దరు పిల్లలను ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. పుణెలోని మిలటరీ ఇనిస్టిట్యూట్ ఆఫీసర్ కూడా కరోనా లక్షణాలతో బాధపడుతున్నాడు. అయితే ఈ ఉద్యోగికి ఇంకా వైద్య పరీక్షలు నిర్వహించలేదు.

వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో పర్యటించి కరోనాపై ప్రజలను అప్రమత్తం చేసిన మంత్రి ఎర్రబెల్లి దయకర్ రావు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,మార్చి18(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ విస్తరిస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు. తెలంగాణలో కరోనా వైరస్ లేదని.. విదేశాల నుంచి భారత్‌కు వస్తున్న వాళ్ల ద్వారా ఈ వైరస్ మనదేశంతో పాటు రాష్ట్రంలోకి ప్రవేశించిందని తెలిపారు.

వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరిలో మంత్రి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైరస్ విజృంభించకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. వైరస్ సోకిన వారితో పాటు వ్యాధి సోకకుండా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మనం శుభ్రంగా ఉండటంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దగ్గు, జలుబు, జ్వరం వచ్చిన వాళ్లు మిగతా వాళ్లకు దూరంగా ఉండాలి. ప్రజలు భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజలు కొంతకాలం పాటు కొన్ని పనులను వాయిదా వేసుకోవాలని మంత్రి సూచించారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల వాయిదాకు సమర్థన

### ఎన్నికలు ఎప్పుడు పెట్టాలన్నది ఇసి నిర్ణయమే ఎన్నికల వాయిదా నేపథ్యంలో కోడ్ ఎత్తేయాలని సూచన కొత్త పథకాలు తేవొద్దని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హితవు

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): ఎపిలో స్థానిక ఎన్నికల వాయిదాను సుప్రీం కోర్టు సమర్థించింది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఇసి తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఎపి సర్కార్ సుప్రీంలో సవాల్ చేసింది. దీంతో సుప్రీం కోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయంపై జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఎన్నికల వాయిదాను సమర్థించింది. ఎన్నికల నిర్వహణ ఎప్పుడనేది ఈసీదే నిర్ణయాధికారం అని స్పష్టం చేసింది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలను 6 వారాల పాటు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై బుధవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. ఏపీ ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చింది. ఈసీ నిర్ణయాన్ని సమర్థించింది. అయితే ఎన్నికల కోడ్‌ను తక్షణమే ఎత్తివేయాలని ఈసీకి సుప్రీంకోర్టు సూచించింది. ఓటర్లను ప్రలోభపెట్టేలా కొత్త పథకాలు ప్రవేశపెట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకవేళ ప్రభుత్వం ఏవైనా కొత్త ప్రాజెక్టులు, పథకాలు చేపట్టాలంటే ఈసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించింది. అయితే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించవచ్చునని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకు కొత్త తేదీలు ప్రకటించాక 4 వారాల ముందు నుంచి కోడ్ అమల్లోకి వస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో ఎన్నికల కోడ్‌ను తక్షణం ఎత్తివేయాలని బుధవారం ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల పక్రియను వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎన్నికల వాయిదా నేపథ్యంలో రాష్ట్రంలో కోడ్ కొనసాగింపును ప్రభుత్వం ప్రశ్నించింది. కోడ్ అమల్లో ఉందని చెప్తూ సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని కోర్టు దృష్టికి తెచ్చింది. దీంతో ఎన్నికల కమిషనర్ తీరును తప్పుబట్టిన సుప్రీం కోర్టు.. ఎన్నికల వాయిదాపై రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకపోవడాన్ని ఆక్షేపించింది. ఎన్నికల నిర్వహణపై ఈసీ కచ్చితంగా రాష్ట్రప్రభుత్వాన్ని సంప్రదించాల్సిందేనని వెల్లడించింది. ఎన్నికల కోడ్ ఎత్తివేయాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని చెప్పింది. సుప్రీం ఆదేశాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అడ్డంకులు తొలగినట్టయింది.

# టెలికాం సంస్థలకు సుప్రీం మొట్టికాయలు

### ఎజిఆర్ ఛార్జీలు చెల్లించాల్సిందేనని స్పష్టీకరణ ప్రభుత్వ తీరుపైనా మండిపాటు

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): టెలికాం సంస్థలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సవరించిన స్థూల ఆదాయం(ఏజీర్) ఛార్జీల చెల్లింపు విషయంలో ఎలాంటి పునఃసమీక్ష ఉండదని తేల్చి చెప్పింది. ఈ విషయంలో స్వీయ సమీక్ష చేసుకున్న కంపెనీలపై కోర్టు మొట్టికాయలు వేసింది.అసలు ఎవరు సమీక్షించమన్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. బకాయిలు వసూలు చేయడంలో ప్రభుత్వ తీరుపై కూడా కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఛార్జీల పునఃసమీక్షకు గడువు ఇవ్వాలన్న కేంద్రం వాదనను తోసిపుచ్చింది. కోర్టును ప్రభావితం చేయడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారని.. కానీ, అది సాధ్యం కాదని వ్యాఖ్యానించింది. జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసం బుధవారం ఈ అంశంపై విచారణ జరిపింది. ఒకవేళ పునఃసమీక్షని అంగీకరిస్తే కోర్టు గతంలో తప్పుచేసినట్లవుతుందని.. ఎట్టి పరిస్థితుల్లో దానికి ఒప్పుకునేది లేదని స్పష్టం చేసింది. బకాయిల చెల్లింపుల పునఃసమీక్షకు అనుమతించిన అధికారుల్ని సహించేది లేదని హెచ్చరించింది. ఏజీఆర్ బకాయిలు చెల్లించాల్సిందేనని గత అక్టోబర్‌లోనే సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు వెలువరించింది. అయినా, సంస్థలు బకాయిలను పునఃసమీక్షించాలంటూ అనేకసార్లు కోర్టు తలుపులు తట్టాయి. ఈ క్రమంలో ప్రభుత్వాన్ని సైతం ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గత నెలలోనూ ఇదే తరహాలో కోర్టు సంస్థలకు, ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. దీంతో దిగొచ్చిన కొన్ని సంస్థలు బకాయిల్లో కొంత మొత్తాన్ని చెల్లించాయి. కోర్టు పునఃసమీక్షకు అనుమతిస్తే మిగతా మొత్తానికి మినహాయింపు లభించే అవకాశం ఉందన్న ఉద్దేశంతో వేచి చూస్తున్నాయి. కానీ, తాజాగా ఆ విషయం లోనూ చుక్కెదురైంది. మరోవైపు ఏజీఆర్ బకాయిల చెల్లింపులను 20 ఏళ్ల పాటు వాయిదాల రూపంలో చెల్లించేందుకు సంస్థలకు వెసులుబాటు కల్పిస్

# బాల వికాసం

నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలో గల గొట్టిగుండాల బి.సి.కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కవితలు ఇవి. త్వరలోనే విద్యార్థులు రాసిన కథలతో పుస్తకం వెలువడుతోందని ఉపాధ్యాయులు వెలుగోటి నరేశ్ తెలిపారు.

## రామచిలుక

అందాల పచ్చపచ్చని రామచిలుక
తోటలోన తిరిగేను రామచిలుక
చెట్టు మీద ఉండెను రామచిలుక
ఎర్రనైన ముక్కు ఉన్న రామచిలుక
తాటి చెట్టు తొర్రలోని రామచిలుక
తొర్రలోన తొంగి చూసే రామచిలుక
అందరికీ నచ్చే రామచిలుక
పంజరమే వద్దన్న రామచిలుక
పండ్లెన్నో రుచి చూసే రామచిలుక
గూటిలోన గుటుక్కున మింగే రామచిలుక
అందాల పచ్చపచ్చని రామచిలుక
తోటలోన తిరిగేను రామచిలుక

-టి.శ్రీనాద్,
2వ తరగతి

## రైతు

భూమిని దున్నేను
గింజలు చల్లేను
పంటలకు మందులేసి
పురుగులను తోలేసి
పొలానికి నీళ్ళు పట్టి
కష్టపడి వ్యవసాయం చేసి
పంటలను జాగ్రత్తగా కాపాడి
పంటలను పండించేను
రైతు లేనిదే తిండే లేదు
బ్రతుకునిచ్చేది రైతేను
రైతు లేనిదే మనమేలేము

- పి .ప్రకాష్,
2వ తరగతి

## వాన

చిటపట చినుకుల వాన
చిరుజల్లుల సవ్వడి వాన
మబ్బుల చాటున వాన
ఉరుముల మెరుపుల వాన
జలజల జారే వాన
గజగజ వణికించే వాన
పడవలు వదిలే వాన
దాహం తీర్చే వాన

-టి.నరేష్,
2వ తరగతి

## కొంగ

కొంగ కొంగ పాలుపోయ్
నిమ్మచెట్టుకు నీళ్ళుపోయ్
కాకరచెట్టుకు కాయలుకోయ్
చింత చెట్టుపై చిందులేయ్
పనస చెట్టుకు పాదులు చేయ్
ఉల్లిపాయకు ఊయలేయ్
అబ్బాయికి అప్పలుతే
చెరువులోన చేపలుతే
నీనోట్లో చక్కెరేస్తా
నా నోట్లో చేపలేయ్



-పి.ప్రకాష్, 2వ తరగతి

## చెట్టు

చెట్టు మనకు నీడ ఇచ్చేను
చల్లటి గాలి మనకు ఇచ్చేను
పూలు,పండ్లు మనకు ఇచ్చే చెట్టు
ఆకులు,కలపను ఇచ్చే చెట్టు
ఎండా,వాన నుంచి కాపాడే చెట్టు
చచ్చి కూడా చీల్చి ఇచ్చు తనువు
చెట్లు లేనిదే బతుకేలేదు.

-టి.శ్రీనాద్,
2వ తరగతి

## పిల్లలు

అందమైన పిల్లలు
చక్కగా బడికి వచ్చే పిల్లలు
చేయి చేయి కలిపారు.
ఆటలు ఆడే పిల్లలు
అందరు ఒకటిగా కలిశారు.
ఆటలు బాగా ఆడారు.
చక్కగా చదివే పిల్లలు
సంతోషంగా ఉన్నారు.

-టి.నరేష్, 2వ తరగతి

# బడిగంటలతో బాల వికాసం..





మాట, ఆట. పాట అంటే మక్కువ చూపే చిన్నారులకు తమ 'బడిగంటలు' గేయ సంపుటితో బాలల సర్వాంగీణ వికాసం కోసం ఉడుతా భక్తిగా కవి గంగశ్రీ-గంగాపురం శ్రీనివాస్ పాటుపడటం విశేషం. తెలుగు భాషా ద్విశతితో సాహితీ లోకానికి పరిచయమైన గంగశ్రీ. ఇప్పుడు ప్రకటించిన 'బడిగంటలు" "బాల గేయాలు" పుస్తకాన్ని వెలురించడం ముదావహం. చిట్టి, పొట్టి గేయాలతో పిల్లల్లో చక్కని వ్యక్తిత్వాన్ని.. నైతిక విలువలు.. సదాచారాన్ని.. సామాన్య విజ్ఞానంపై పరిసరాల విజ్ఞానంపై ఓ అవగాహన పెంపొందించ యత్నించడం అభినందనీయం. మన దేశం పట్ల, ధర్మం పట్ల, మన తితుల పట్ల, పండుగల పట్ల, భూమాత పట్ల, గోమాత పట్ల చిన్నారులకు శ్రద్ధాభక్తులు కలిగించే విధంగా గంగశ్రీ ఇందులోని గేయాలను తీర్చిదిద్దారు. ఆయన బంగారు బాతు గురించి చెప్పినా.. బడిబాట గురించి చెప్పినా.. బాల బాలికలకు ఇట్టే అర్థమయ్యే రీతిలో సరళమైన పద బంధాలను ప్రయోగించారు. చెట్ల గురించి, పువ్వుల గురించి, పండ్లు రంగులు మువ్వలు.. గువ్వలు.. కవి యొక్క గేయాలకు కవితా వస్తువులైనాయి.

పిల్లల స్థాయిననుసరించి రాయబడిన ఇందలి గేయాలు కొన్ని చిన్నారులు లయబద్ధంగా గానం చేసుకోవడానికి మరియు అభినయం చేయడానికి యోగ్యంగా ఉన్నాయి.

గంగా ప్రవాహంలా సాగిన గంగశ్రీ గేయలహరి లోని గేయాలు చిన్నారులకు అనేక అంశాలపై ఓ ఆలోచనను.. అవగాహనను కలిగిస్తాయి.

'బడిగంటలు' శీర్షికతో రాసిన మొదటి గేయంలో పిల్లలు లయబద్ధంగా గానం చేయడానికి వీలుగా పదబంధాలు కొలువుదీరాయి. పిల్లల్లో అంశంపట్ల ఆసక్తిని పెంపొందించడానికి ప్రశ్నలు.. సమాధానాలు పొందుపరిచి కొన్ని గేయాలకు బలం చేకూర్చారు. ప్రగతి బాటలో సాగడానికి పరీక్షలంటే భయాన్ని వీడి.. ఇష్టము తోడ చదువుమని పి ల్లలకు ఓ గేయం ద్వారా హితవు పలికారు.

విద్యార్థినీ, విద్యార్థుల్లో దేశభక్తిని నిర్మాణం చేయడానికి.. "భావి భారత పౌరుల్లార" శీర్షికతో ఓ గేయం రాశారు.

**"భావిభారత పౌరుల్లారా**
**భారతదేశపు భవితల్లార**
**ఉడుతల్లార బుడతల్లారా**
**ఉదయపు భానుని కాంతుల్లార"** అంటూ గేయాన్ని కొనసాగించారు.

భరతకీర్తిని చాటుమంటూ మరో గేయాన్ని రాశారు.

'దేశసేవ చేసెదం" అంటూ ఇంకో గేయం రాశారు. ఈ గేయాన్ని చక్కని సందేశంతో ముగించారు.

**"జాతి కీర్తి పెంచెదం**
**ఖ్యాతినెంతో పొందెదం**
**దేహం అర్పించెదం**
**దేశ సేవ చేసెదం"** అంటూ ముగించారు. 'రెక్కల ఏనుగు"ను టక్కరి నక్కను.. హంసను. .కాకిని.. కోతి.. మొసలిని.. సెలయేరును.. జాతరను.. తెలుగు నెలలను.. అల్లంను.. బెల్లంను.. కవి గంగశ్రీ పిల్లలకు అర్థమయ్యేలా తమ గేయాల్లో సృజనాత్మకంగా ఆవిష్కరించారు.

యం.డి. మస్తుంగారు గీసిన అందమైన ముఖచిత్రం.. గేయ సంపుటికి నిండు శోభను కూర్చింది. ఆయా గేయాలకు అనుగుణంగా ఛాయా చిత్రాలను జోడించి.. మరింత పుస్తకాన్ని ఆకర్షణీయంగా మలిచారు.

ప్రతులకు: గంగాపురం శ్రీనివాస్
ఇ.నెం. 11-4-87/3/ఏ
భారత్‌నగర్
సిద్దిపేట-502 103
సెల్: 9676305949

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544





## నిజాయితీ

నా పేరు నిజాయితి
నేను చాలా ధైర్యంగా ఉంటాను
కాని
నేను చాలామందికి నచ్చను
నాకు బాధగా ఉంది
నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు
నన్ను కనుమరుగు చేయాలని చూస్తున్నారు
కాని ఒకటి గుర్తుంచుకోండి
నన్ను మరచిన వారికి కన్నీరు తప్పదు
నన్ను నమ్మండి
నిర్భయంగా బతుకండి.

- ఎస్. తులసి
9 వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
వేములమూసాపేట (మం),
మహబూబ్ నగర్ జిల్లా

## కవితలు

కల వచ్చింది
నిజం
కళ్లు తెరిస్తే
అబద్ధం

బొమ్మలు
నా పిల్లలు
ఎత్తుకో ఎత్తుకో
అని ఏడుస్తున్నాయి..

సబ్బు బిళ్ళ
దొంగపిల్ల
పట్టుకుంటుంటే
పారిపోతోంది.

- ధీమంత్ చెన్నాప్రగడ
యు.కె.జి, హైదరాబాద్

## అమ్మ

అమ్మంటే అనురాగం ఆత్మీయత కలబోత
అమ్మంటే అందరిని ఆత్మబంధువు
కమ్మనైన జోలలకు చిరునామా అమ్మ
బుడి బుడి అడుగులు వేసే చిన్నతనంలో కూడా
నా బిడ్డ గొప్ప అని అనుకునే
నా ఘన విజయం అమ్మ
ఆనందమనే ఆహారాన్ని పంచి
బాధ అనే బండరాయిని నీలోనే దాచావు
నవమాసాలు నను మోసి నాకు జన్మనిచ్చి
నీవు మరుజన్మ పొందావని ఆనందపడ్డావు
చేనేత చీరను నీవు కట్టి
నాకు పట్టు వస్త్రాలపబ్బాలు గడపమన్నావు
కలతలన్నీ కళ్లలో దాచి ఆనంద అశ్రువులను రాల్చావు
భూతల్లి లాంటి నీ ఓర్పుని
ఆకాశమంత నీ అండనీ నాకు పంచి
అందరాని ఎత్తులో నన్నుంచిన
నీ రుణం ఈ జన్మకు తీర్చగలనా అమ్మ

## నాన్న

నాన్న నన్ను గుండెలమీద ఆడించిన ఆత్మీయ దైవం
నాన్న నన్ను నడిపిన నా మార్గదర్శి
జీవితానుభవాల్లో క్రిందపడినా నీవే లేవాలని
నేర్పిన గురు పూజ్యుడు
అమ్మ ప్రేమను కళ్ళముందు ప్రదర్శించినా
నన్ను చూసి గుండెల్లో మురిసిన
నిరాడంబరుడు నాన్న
తన శక్తినంతా కూడగట్టి నన్ను బ్రతికించిన
నా ఆది దేవుడు
అమ్మ మనకు జీవితంలో ఎలా ఉండాలి అని నేర్పితే
నాన్న మనకు ధైర్యాన్ని నేర్పుతారు.

- కృష్ణవేణి
ఇంటర్ ఫస్ట్ఇయర్, మెదక్ జిల్లా

## కవిత్వం విలువ

వ్యక్తి ఆరాధన వదులాలి
భుక్తి మార్గాలు వెదుకాలి
చెట్టు పేరు జెప్పుకోని
కాయలు అమ్ముకోవద్దు
పెద్దల సందేశాలు చదువాలి
బుద్ధిగా నడువ నేర్చుకోవాలి
ప్రభుత్వము ఆలోచించాలి
పని పాటలు కల్పించాలి
దరిద్ర్యాన్ని తరిమివేయాలి
పేదలు యభివృద్ధి జెందాలి
సుఖంగా నిద్రపోవాలి
ధరణి స్వర్గం కావాలి
రామ రాజ్యం రావాలి
వైరాలు విడనాడాలి
శాంతి పావురం నెగురాలి
పాత దుమ్మును దులుపాలి
నూతనత్వము తేవాలి
జాతి ఐక్యముగా నిలువాలి
జయశంఖం వూదాలి
కవిగా సందేశమివ్వాలి
చక్కని మార్గము తెలుపాలి
అదే కవిత్వం విలువ
అందరి సుఖాల కలువ.



- సామలేటి లింగమూర్తి
సెల్: 9492912155

## నేటి నిజాలు




## నా అక్షరాలు

నా అక్షరాలు ...
ఉద్యానవనంలో ఊయలూగే
అందమైన ఆడపిల్లల
మెరిసే ముక్కు పుల్లలు !

నా అక్షరాలు ...
పల్లెటూర్లలో
బాల్యంలో గంతులేస్తూ
భేదభావాల్లేక గడిపే
చిన్నారి చిట్టి తల్లులు
కేరింతలతో ఆటలాడుకునే
తొక్కుడు బిల్లలు !

నా అక్షరాలు ...
సత్ సాంప్రదాయాలను
ముందుతరాలకు అందిస్తూ
నిత్య సుమంగళులై శోభిల్లే
సంతోష సౌందర్యరాసుల
ఆరాధ్యమైన బొట్టుబిళ్ళలు !

నా అక్షరాలు ...
గత స్మృతుల అజ్ఞాత
తిమిరాలను తరిమేసి
మనలో స్వాంతన చేకూర్చి
మనసులో వెలుగునింపే
అగ్గిపుల్లలు !

నా అక్షరాలు ...
పాపాయిలకు లాలపోసి
లాలించి జోకొడుతున్నప్పుడు
నిద్రమైకంలో స్వర్గలోక విహారియై
మౌనమునులుగా దరహాసించే
అమాయక చిరునవ్వులు !

నా అక్షరాలు ...
మనసెరిగి మసలుకుని
కవితా మధువాస్వాధించే
సాహిత్య శోధకులందరికి
వసంతంలో ఊహించని
వర్షానికి తన్మయత్వం చెందించే
కవితా చిరుజల్లులు !

నా అక్షరాలు ...
ఎండావానలేకమైన నృత్యహేళికి
నిశబ్ద నీలాకాశంలో వెలసిన
ఇంద్రధనుస్సు అందాలను
అందుకోవాలని విరగబూసిన
పారిజాతం చెట్టుపై పక్షులెగురుతూ
చేసే కిలకిల రావాల చప్పుళ్ళు !!

నా అక్షరాలు ...
గోదారి ఒడ్డున ఇసుక తిన్నెల్లో
తెలిసీ తెలియని వయసులో
ఉల్లాసంతో ఉత్సాహంతో
చిట్టిపొట్టి పాదాలతో సంబరపడుతూ
కట్టుకునే పిచ్చుకగూళ్ళు !

నాఅక్షరాలు ...
అమ్మమ్మ ఇంటికి సంక్రాంతికి
వెళ్ళినప్పుడు కట్టిచ్చిన
రంగురంగుల పరికిణీలతో
రంగవల్లులపై గొబ్బెమ్మలు
పెట్టేటపుడు మరీ వెంటబడి
వాలే సీతాకోకచిలకలు !

నా అక్షరాలు ...
నను నడిపిస్తూ పలికించే
తల్లి సరస్వతీమాతను
అలంకరించి ఆరాధించే
కలువ పూలమాలలో
నిగూఢంగా దాగిఉన్న
పుప్పొడి రేణువులు !!

- రాజేశ్
9440460490

## అనుబంధ సుగంధం

సరిహద్దు పోరాటాలు
స్వేచ్ఛను హరించి వేస్తుంటే
పచ్చని గోధుమ చేల నడుమ
కోకిల గానం మూగపోయింది
స్వార్థంతో అన్నదమ్ముల బంధం
రక్తం ఓడుతుంది కర్కశంగా
నా వారే పొరుగువారై నా తల్లిని
భాగం పంచ మంటున్నారు బంధాలు మరిచి
స్వేచ్ఛ కపోతాల రెపరెపలు
తుపాకీ గుళ్లకు సమాధి పాలవుతున్నాయి
కుంకుమ పూల పరిమళాలు
మతం ముసుగులో మాడిపోతున్నాయి
ఖర్జూర చెట్లు గాలి కరడుగట్టిన
తీవ్రవాదం స్వార్థపూరిత మంటూ
మానవత్వపు మదిని తడుతున్నాయి
ఎర్రని సూర్యుడు రక్త ధారలు
ఆపమంటూ శోకంతో పడమటింటి
పయనంలో వెన్నెల చిరునవ్వులు
ఆవ పూల పసిపాపలా విరియాలని
నింగి నేల పచ్చని పరిమళం లాంటి
నా త్రివర్ణ పతాకంలో పచ్చదనం నీకిస్తే
మాతృ శోకం నాకు ప్రతిఫలమా
ఆ నల్లని మబ్బు జారి చినుకులా మారి
నా దేశపు మట్టి పరిమళాన్ని గుర్తుచేస్తూ
ఇంద్రధనస్సు వీర తిలకం దిద్ది
పదపదమంటూ గుండె ధైర్యం
మా చిరునామా అంటూ
వెన్ను తట్టి దండి గా నిలిచే.

-కవిత రాయల
8886066444

## అదే మరి ..!!

పుహన్లో పుడుతూనే సుడిగాలివై
ప్రళయాలను పొంగిస్తూ...
చూస్తుండగానే ఖండాంతరాల ఏలుకుంటూ...
భూగోళాన్ని చిగురుటాకుల వణికిస్తున్నావే....
భీకర మరణ మృదంగం మోగిస్తూ...
జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ...

ప్రపంచం పాలిట బ్రహ్మరాక్షసివై గజ గజలాడిస్తూ...
రహదారులకు మౌనవ్రతం నేర్పి..
ఆర్థిక వ్యవస్థలన్ని అతలాకుతలం చేస్తూ..
కోట్ల సంపదని ఆవిరి చేసావే మహమ్మారివై...
ఇక నువ్వు విర్రవీగకు
ఉన్నఫలంగా నిన్ను తరిమేస్తాం
పదునైన ఆయుర్వేద శాస్త్రఆయుధాలు ఉన్న
భారతీయులం

అప్పుడెప్పుడో మా సంస్కారపు పెరడులో
మొలకెత్తిన నమస్కారాన్ని అటకెక్కించి
శుచి శుభ్రతకు పీటేసే మడివంటను మోటంటూ
కంచెక్కి కూస్తూ కచ్చీర్లెక్కినం మొన్నటిదాకా!
పొరుగోళ్లకంచెలలో చుంబనాల
పరికి కంప పెరట్లో నాటినం
నీ గాలి సోకగానే సోయి కొచ్చినం
ఇదే మరి లోకం తీరంటే..!!
దూప కాగానే బావికోసం వెతుక్కుంటూ..
తులసమ్మ మా ఇంట్లో కొలువుండగా....
మా వేపపూత ముందు నీ పొగరెంత?
మా మావి వగరు నిన్ను తరమదా?
మా ఆయుర్వేద తీర్థమైన
ఉగాది పచ్చడి చాలేమో...
నీ ఆట కట్టించేందుకు
అదిగదిగో మా వైద్యులు కోయిలలై కూస్తున్నారు
సంప్రదాయ అస్త్రాల అమ్ములపొది పట్టుకొమ్మని...!!

-అరుణ కీర్తి పతాక.కరాదుల
9395147443

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 19-3-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

**నమ్మలేని నిజాలు**

సూక్తి ముక్తకం
సర్వజన ఆమోదం
అక్కున చేర్చు
స్త్రీల వేదిక
తిమిరంతో సమరం
వెలుగు బాట
విశ్వాస ద్రోహం
చరిత్ర కళ్లముందు
పుట్టిముంచకు
తలకిందులు
కాలం చెల్లిన మందు
మానవ లౌక్యం
రెండు వర్గాలు
భావ జలంలో చేప
లోలక స్థితి

- రేడియమ్
9291527757

**శ్రీనిజాయి**

మాస్కు వేసి మూయండోయ్
సదా ముక్కు నోరు !
చేతుల్నీ కడగండోయ్
తరచు సబ్బు నీరు !
కలం పోటుతో చస్తే
రాయొచ్చు గీతం !
ఎక్కడుందో కనపడదు
కరోనా భూతం !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# అక్షరాన్ని సృష్టిస్తూ బాలలు అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలి

## 'మధుర పద్మాలు' పుస్తకావిష్కరణ సమావేశంలో నేటినిజం సంపాదకులు బైస దేవదాస్

జక్కాపూర్ బడిపిల్లల 'మధుర పద్మాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేటినిజం సంపాదకులు బైస దేవదాసు . వేదికపై శ్రీమతి వీణాదాస్, ప్రధానోపాధ్యాయులు ఆర్. పద్మయ్య, ఉపాధ్యాయులు కె. శ్రీనివాస్, టి. మధుసూధన్, శ్రీమతి కె. పద్మ, ఎల్. రాజు, ఆర్. రాజేందర్, ఎ. లక్ష్మీనారాయణ, ఎం. మల్లారెడ్డి, సిహెచ్. గోపీనాథ్, సిహెచ్. ఆనంద్ శ్రీనివాస్, ఎ. చెన్నకేశవులు, బి. దయానంద సరస్వతి, బైతి దుర్గయ్య.

హైదరాబాద్, మార్చి 18 (నేటినిజం ప్రతినిధి):ఆనందమే గొప్పగా ఎదగడానికి దోహదపడుతుందని, అక్షరాన్ని సృష్టిస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. సిద్దిపేట జిల్లాలోని జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మార్చ్ గురువారం రోజున విద్యార్థులు రచించిన 74 కవితల సంకలనం "మధుర పద్మాలు" పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సతీ సమేతంగా ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ "మధుర పద్మాలు పుస్తకం యొక్క పేరులోనే గొప్పదనం దాగి ఉందని

మొదటి ప్రతిని ఉపాధ్యాయులు టి. మధుసూధన్‌కు అందజేస్తున్న బైస దేవదాసు.

జక్కాపూర్ బడి పిల్లలు, ఉపాధ్యాయులతో ముఖ్య అతిథి బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాస్

అందు లోని ఒక్కో కవిత ఇంకా మధురంగా ఉన్నాయని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. విద్యార్థుల చెడు ఆలోచనలను తరిమి వేసేది బాల సాహిత్యం అని అన్నారు. ఎక్కడైతే అక్షరం ప్రేమించబడుతుందో అక్కడ ఆనందం వెల్లివిరుస్తుంది అని అన్నారు. ప్రతివారికి రెండు అవసరాలు ఉంటాయని, అవి అక్షరం, ఆర్థికమని, అక్షరాన్ని సృష్టించి, అభివృద్ధి సాధించినపుడు ఆర్థిక సమస్యలు ఉండవని చెప్పారు. తెలుగు రాష్ట్రాల నుంచి బహు భాషా కోవిదుడుగా పేరుగాంచిన ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన పీవీ నరసింహారావు లాగా బహు భాషల్లో ప్రావీణ్యం సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతము నుండి బహు భాషల్లో ప్రావీణ్యం పొందిన డా॥ నలిమెల భాస్కర్ గారిలా విద్యార్థులు చాలా భాషలు నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రిని సైతం పేరుతో సంభోధించిన డా॥సినారె గొప్పతనానికి కారణం అక్షరం,విలువైన సాహిత్యమే అని అన్నారు. నానమ్మ తాతయ్యల దగ్గర నుండి నీతి కథలు వినాలని తద్వారా సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు.

ఆలోచనల్లో నిజాయితీ ప్రతిబింబించాలని మంచితో సావాసం చేయాలని చెడు ప్రవర్తన లేని జీవితాన్ని గడపాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. అక్షరాన్ని ప్రేమిస్తూ అక్షరాన్ని సృష్టిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. రెండు రాష్ట్రాల్లో అనేక పాఠశాలలు సందర్శించానని, ఇక్కడి పాఠశాల లో విద్యార్థులు మంచి క్రమశిక్షణ కలిగి యున్నారని,అందుకు కారణమైన ఉపాధ్యాయులను ప్రశంసించారు. ప్రపంచం లో "అమ్మ ప్రేమ"ని మించింది ఏమి లేదని,అమ్మ గురించి వ్రాసిన విద్యార్థిని పూజితని అభినందించి కవిత ని ఉదహరించారు. ఇక్కడి విద్యార్థుల గౌరవ స్వాగతం తమ బాల్యాన్ని గుర్తుకు తెచ్చిందని" పేర్కొన్నారు. పుస్తక వధాన్యులు తోట మధుసూదన్ గారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పుస్తక ఆవిష్కరణ గావించి తొలి ప్రతిని తోట మధుసూదన్‌ను అందించారు.

ప్రెస్ అకాడమీ సభ్యులు కొమరవెల్లి అంజయ్య మాట్లాడుతూ "సాహిత్యం నూతన ఆలోచనలకు నాంది పలుకుతుందని అన్నారు. జిల్లాలో బాల సాహిత్యం పట్ల పోటీ వాతావరణం ఏర్పడడం అభినందనీయమని అన్నారు మంచి సామాజిక వాతావరణ జీవనంలో పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీస్తున్న బైతి దుర్గయ్యలాంటి ఉపాధ్యాయులు అభినందనీయులని అన్నారు.

మరొక ముఖ్య అతిథి నారాయణరావు పేట ఎంపీడీవో మాడుగుల మురళీధర శర్మ మాట్లాడుతూ "పిల్లలు కవితలను కథలు గేయాలను రాసే విధంగా ప్రోత్సహిస్తున్న నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసులాం టివాళ్ళు అభినందనీయులని సాహిత్యం భాషల ద్వారా మూర్తిమత్వ వికాసం జరుగుతుంది అన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతారు" అని అన్నారు. తాను వ్రాసిన పద్యాలను చదివి వినిపించారు.

బైస వీణా దేవదాసు విద్యార్థులకు శుభాకాంక్షలు చెబుతూ "ఈ పాఠశాల వాతావరణం బాగుందని, బాల సాహిత్యంను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు రేపటి భావితరాన్ని తయారు చేస్తారని" అన్నారు.

పుస్తక సంపాదకులు బైతి దుర్గయ్య పుస్తక పరిచయం చేస్తూ గత సంవత్సరం ఈ పాఠశాల విద్యార్థులు వ్రాసిన "జక్కాపూర్ బడిపిల్లల కథలు" పుస్తకానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికాలో సైతం ఆదరణ లభించింది, ఆ స్ఫూర్తితో ఈ పుస్తకం రూపొందించబడిందని, అందుకు కారణం నేటి నిజం పత్రికనే అని అన్నారు. ఈ పుస్తకం లోని 74 కవితలలోని 53 కవితలు నేటి నిజం పత్రికలో ఇప్పటికే ప్రచురించబడినవి. పత్రికలో తమ రచనలు చూసి విద్యార్థులు పొందిన ఆనందం మాటల్లో వర్ణించలేనన్నారు.

నేటినిజం సంపాదకులే ముఖ్య అతిథిగా వచ్చి పుస్తకావిష్కరణ చేయడం విద్యార్థుల జీవితంలో తీయని అనుభూతి అని సంతోషం వ్యక్త పరిచారు. ఇదే పాఠశాల నుండి ఉపాధ్యాయుల సహ కారంతో మరిన్ని పుస్తకాలు రూపొంది స్తామని, అందుకు పెద్దల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాళ్లబండి పద్మయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమములో మధుర పద్మాలు పుస్తకంలో కవితలు రాసిన విద్యార్థుల ందరికీ పుస్తక ప్రతులను అందజేశారు. అనంతరం బైస దేవదాస్ దంపతులను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానిం చారు. ఈ పుస్తకం ఆవిష్కరణకు కృషిచేసిన మూలకర్త బైతి దుర్గయ్య పుస్తక వదాన్యులు తోట మధుసూదన్‌లను ఈ సందర్భంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యిని ఉపాధ్యాయులు పద్మ, రాజు, రాజేం దర్ లక్ష్మీనర్సయ్య, మల్లారెడ్డి గోపీనాథ్, ఆనంద్ శ్రీనివాస్, చెన్నకేశవులు దయానంద సరస్వతి జైపాల్ రెడ్డి, అఖిల, బద్దిపడగ గణిత ఉపాధ్యాయులు రవిందర్ రెడ్డి, ప్రస్తుతం సైన్యంలో పనిచేస్తున్న అనాజిపూర్ పాఠశాల పూర్వ విద్యార్థి చంద్రంలు , సత్యం బాల సాహిత్య కవులు పాల్గొన్నారు.

# ఆమె ఆత్మగౌరవమే అంతర్జాతీయ పతాక..!

జీవన సౌందర్యం ఇనుమడిస్తుంది
నవ్యత, నైపుణ్యత సముజ్వలమవుతున్నాయి
ఆ వానలో రంగుల వలయాలు
ప్రతి కదలికలో ప్రకృతి శృతి
నృత్యం పాతది.. పలుకులు కొత్తవి..
ఆ ఉదయకాలపు లేత సూర్యుడు
జొన్నచేలో పరుచుకొన్నాడు
రంగురంగుల కుంచెలతో
కిరణాలు కొండలను అలంకరిస్తున్నాయి
గడ్డిపూల నవ్వుల పరిమళాలు
ఆ కొమ్మల సందుల్లో నుండి పక్షికూతలు
మనస్సును ఉత్తేజం చేస్తున్నాయి
నీటి చరియల్లో వెలుగుపూలు పూస్తున్నాయి
ఆ చెట్టు కొమ్మల నుండి జారిబడుతున్న కిరణాలు
నేల పొరల్లోకి చొచ్చుకుపోతున్నాయి
తమను తాము తెలుసుకునేకొలది
వారిలో వెయ్యి వెలుగుల పందిళ్ళు
ఆ కళ్ళల్లో వేయి కంకుల పూత
అవును! వారు సంభాషణా చతురులే
వారి వాక్కులు నూత్న యుగానికి ఆయువులు
ఆ భాషలో సాధికారిత వెల్లివిరుస్తుంది
ఆ చూపులో గమ్య నిర్దేశం ఉంది
ఆమె శరీర మాత్రయే కాదని రుజువు చేసింది.
తోడుకు ఆమె అర్థం చెబుతూనే ఉంది
తనను బంధించిన అన్ని తాళ్ళు తెంచుతూనే ఉంది
అనేకసార్లు అదే తాళ్ళకు బంది అవుతూనే ఉంది
ఆమె ఓ పాలపుంత, వెన్నెల దిన్నె
ఆమె నిజానికి ఓ తల్లి
తల్లితనానికి ఆమె ప్రతీక, ప్రతిజ్ఞ
నిజమే! ఆమెలో తల్లే కాదు, ప్రియురాలే కాదు
ఒక నిర్మాణ కర్త ఉంది..
ఇప్పుడు అందరూ తన పాదాల వేపు చూస్తున్నారు
ఆమె కళ్ళల్లో సౌందర్య కాంతులే కాదు
యుద్ధ కౌశలమూ వుంది
ఆమె జంటగానే కాదు, ఒంటరిగానూ ఉండగలదు.
ఒంటరితనంలోను తోడును సృష్టించగలదు
అవును! ఆమె జీవన వర్తనే ప్రభాతం
ఎన్నో చట్టాలు ఆమె కోసం ఆవిర్భవించాయి
ఎన్నో చట్టాలను ఆమె అధిగమిస్తూ నడిచింది
ఇప్పుడు ఆమె ఒక మనిషి కాదు
ఒక సమూహం, ఒక సమాజం
ఆమెను నిర్భంధించాలనుకున్న
ధర్మశాస్త్రాలన్నీ బద్దలయ్యాయి
ఆమె బాహ్య సౌందర్యాన్ని చూసి
ఎన్నో కావ్యాలు రాశారు
ఆమె అంతరంగం వారికి అందలేదు
ఆమె పెన్ను పట్టుకున్నాక
ఆమె అంతరంగాన్ని ఆమే దృశ్యీకృతం చేసింది!
ఆమె స్వేచ్ఛకు గుర్తు, ప్రేమకు సంకేతం,
త్యాగానికి శిఖరం
ఆమే ప్రకృతి, ప్రకృతే ఆమె
మరోప్రక్క ఈనాటి యువతలో ఏదో నైరాశ్యత!
తమ ముఖ వర్చస్సుపై తనకే అపనమ్మకం
ఎవరి పొగడ్త కోసమో ఎదురుచూపు!
మైపూలతపై మోజు
మానసిక శక్తి నుండి, ప్రతిభ నుండి కాక
బాహ్య సౌందర్యమే గొప్పదనే అపోహ!
మానసిక అస్థిరత, అసహనం ఆమెను ఆవహిస్తున్నాయి
ఆడంబరాల్లో అనుభూతి లేదు సుమా!
నిజానికి, అన్నింటిని అధిగమించే శక్తి ఆమెది
ఇప్పటికీ ఆమే కర్త!
ఆమె చుట్టే వస్తు ప్రపంచ సమూహాన్ని పరిచినా,
తన ఇంటి పెరటిలో ఉన్న గోరింటాకే ఆమెకు స్ఫూర్తి
తన కనురెప్పల్లో ఉన్నశక్తిని ఆమె మరుస్తుందా..!
ఆమె నడకను, చిందును, ఆమె బిగువును, బింకాన్ని
దర్శకుడు ఆంగిక దృశ్యాలుగా మలచాడు
నిర్మాత వ్యాపారం చేసుకున్నాడు
అయినా! ఆమే విజేత!
ఆమె వ్యాపార వస్తువును అవుతున్నానని
అర్థం చేసుకొంటుంది.
ఆమె మానసిక శక్తి, మేధోశక్తికి సమస్వయం అవుతోంది!
శ్వాస ఎందుకు కల్మషమైందో!
కరచాలనం ఎందుకు నిషేధించబడిందో!
ఆమెకు అర్థమవుతోంది!
రాజ్యం ఆలోచనల్లో వైరస్ ఉంది!
అయినా! ఇది మహిళా యుగం
ఆమె అంతర్జాతీయంగా విస్తరిస్తుంది!
ఆత్మగౌరవానిదే అంతిమ విజయం
ఆమె ఆత్మ గౌరవమే అంతర్జాతీయ పతాక..!
*(మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం కోసం)*

- కత్తి పద్మారావు
సెల్:9849741695

## మధురవాణి!!

మితాహారం మాని అతిగా తిని
అజీర్తికి లోనగుట మంచిది కాదన్న
మితాహారము తినుట ఆరోగ్యానికి మంచిదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

పరుషముల కన్నా సరళములు మిన్న
పరుష పలుకులు పగను పెంచునన్న
సరళ పాలకులు స్నేహము పెంచునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

ఇంటికి నడిచి వచ్చిన అతిథికి
ఆహ్వానించి అతిథి సత్కారాలు చేయాలన్న
అతిథిని దేవునితో సమానంగా భావించాలని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.

-జాధవ్ పుండలిక్ రావు
9441333315

## ఆనందసాగరంలో ఈదేద్దాం...

మార్కెట్‌లో దొరకని అమూల్య సంపదలు
కొలమానమే లేని అసలైన ఆస్తిపాస్తులు
అందరూ వెంటబడే అదృశ్య మనోనిధి
కొందరినే వరించే అద్భుత భావబాండాగారం
జీవసాఫల్యతలోంచి జనించే సంకేత సూచిక
ఆత్మసౌందర్య దీపాన్ని వెలిగించే ఇంధనం
సాగరమంత ఆనందం కాక మరేమి?

సకల సౌకర్యాలన్నీ సుఖ కేంద్రాలే కదా..
తీరని వాంఛల మె?గ్లలు, సశేష ఆశల ఊసులు
నెరవేరని ఆశయాలూ సమస్యల తోరణాలే సుమా
సమస్యలతో సమరగుణమేగా సుఖహేతువు
విజయం తోడ్కొని వచ్చు సంతోషాల మూటలు
ఆత్మసంతృప్తే కదా అపార ఆనందాల కోవెల
మది మురవాలి సంతోషాల సంతలో ఆదమరచి !

నలుగురితో నవ్వుల పంట పంచుకోవడం
పరుల కన్నీటిని తుడిచే సహృదయ హితనేస్తం
చిల్లిగవ్వ లేకున్నా చింతలేని చిరునవ్వులేగా
అసలుసిసలైన అమితానంద ఐశ్వర్య కేంద్రాలు
ఆరోగ్య, ఆదాయ, స్వేచ్ఛ, దాతృత్వాలే కాదు
నైతిక విలువలు, సామాజిక భద్రతలు కూడా
సంసారాల్లో సంతోషాలను వర్షించే మేఘాలే కదా !

- డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి
9949700037

# సాహితీ మాతృమూర్తులకు "మాతృదేవోభవ" పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 18 (నేటినిజం ప్రతినిధి): సాధారణంగా కొడుకు తల్లితండ్రుల కు ఎంతో కొంత చేస్తాడు. కానీ కూతురు కూడా తన ఆత్మీయతను పంచుతూ ప్రేమను పంచుతుంది. మరి కూతురి ప్రేమ బయటపడే మార్గం లేదా అనే ప్రశ్నకు సమాధానం మార్చి 12న లేఖిని 15వ వార్షికోత్సవం, రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది... లేఖిని మహిళా చైతన్య సాహితీ సాంస్కృతిక సంస్థ 15వ వార్షికోత్సవ సందర్భంగా 'మాతృ దేవోభవ' పురస్కారాలు అందజేసారు... ప్రముఖ రచయిత్రులు వారి వారి తల్లుల పేరు మీద వివిధ రంగాలలోని ప్రతిభా మూర్తులకు ఈ పురస్కారం అందించారు. ప్రముఖ కవయిత్రి డా॥ వాసాప్రభావతి గారు ప్రారంభించిన ఈ సంస్థ, నేడు ఆమె వారు రచయిత్రుల మధ్య లేకున్నా వారి కుమార్తె ముందుండి నడిపించడం చాలా సంతోషంగా అనిపించింది.

ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రఖ్యాత సినీనటి రోజారమణి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి మాట్లాడుతూ 50 సంవత్సరాల తరువాత కూడా 'భక్త ప్రహ్లాద' గుర్తుంచుకొని తనను ఈ సభకు ఆహ్వానించడం తన పూర్వ జన్మ సుకృతమని అన్నారు... ఇంత మంది రచయిత్రుల మధ్య మాట్లాడటం తనకు ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు... కథ రాయాలంటే ప్రేమ, కుటుంబం, పగ, హాస్యం లాంటి అంశాలను ఎన్నుకోవాలని అన్నారు.. ఈ అంశాలపై ఎన్నో లక్షల కథలు వ్రాసిన రచయిత్రులను అభినందించారు. తన బాల్యంలో ప్రముఖ రచయిత్రుల నవలలు, కథలు ఎన్నో చదివానని అన్నారు. తన చిన్నతనంలో యద్దనపూడి, వాసిరెడ్డి సీతాదేవి, లత, రంగనాయకమ్మ గారి రచనలు చదువుతూ తాను కూడా ఏదయినా రాయాలని అనిపించేదని, కానీ అంత సులభం కాదని తెలిసిందని తన అభిప్రాయాన్ని సరదాగా వ్యక్తీకరించారు. నేడు ఇంత మంది రచయిత్రుల మధ్య తనకు ఇలా ముఖ్య అతిథిగా పిలవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. స్త్రీ అంటే నేడు అన్ని రంగాలలో తమదైన ముద్రను వేసుకుంటున్నారు అనడానికి ఇంతకంటే ప్రత్యేక ఉదాహరణ ఏమి కావాలి అంటూ వారి అభిమానాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ హాస్య కథా రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మిగారు అధ్యక్షత వహించి మాట్లాడుతూ..ఈ సంస్థ వ్యవస్థాపకులు యద్దనపూడి సులోచనారాణిగారు, వాసాప్రభావతిగారు ఇన్ని సంవత్సరాలు సంస్థను బహు చక్కగా నిర్వహించారని అన్నారు... వారు, తమ దత్తపుత్రిక లేఖినిని, తమ (ప్రస్తుత కార్యవర్గం) చేతులలో పెట్టి వెళ్ళిపోయారు. మరణం ఒక పరిణామం. తప్పించలేము ఎవరము. మేము ఆరోగ్య రీత్యా కొంత వెనక పడ్డాము. అత్తలూరి విజయలక్ష్మిగారు ఒక అడుగు ముందుకేసి ఈ సంస్థను నడిపిస్తున్నందుకు ఆవిడను అభినందించారు... గత 15 సంవత్సరాలలో ఇప్పటివరకు 150 మందికి ఈ పురస్కారాలు ఇచ్చామని అన్నారు. ఈ రోజు 8 మందికి ఇస్తున్నామని అన్నారు. లేఖిని సభ్యులు, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి తమ తల్లి పేరు మీద పురస్కారం ప్రదానం చేస్తున్నామని అన్నారు.. ముఖ్యంగా సీనియర్ రచయిత్రి, డా॥ కృష్ణకుమారికి ఇవ్వటం ఈ వేదికకే ఒక అలంకారం అని అన్నారు.

అలాగే వ్యయ ప్రయాసలకోర్చి, దూర ప్రాంతల నుంచి వచ్చినవారిని అభినందించారు. ఉపాధ్యక్షురాలు మంథా భానుమతిగారు మాట్లాడుతూ లేఖిని సంస్థలోని అందరిని ఒక్క త్రాటిపైకి తీసుకొచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అత్తలూరి విజయలక్ష్మిగారిని అభినందించారు. పురస్కార గ్రహీతలు, డా.కె వి కృష్ణకుమారి, హైమా భార్గవ, జంధ్యాల ఉమాప్రసాద్, నందిరాజు పద్మలత, పుట్టి నాగలక్ష్మి, మణి వడ్లమాని, తటవర్తి జ్ఞాన ప్రసూనాంబ, లక్ష్మీ రాఘవలు తమ తమ స్పందనను తెలియజేస్తూ తమను ఇలా సత్కరించినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత్రులు, డి. కామేశ్వరి, శైలజామిత్ర, తమిరిశ జానకి, వారణాసి నాగలక్ష్మి, గంటి భానుమతి, కుసుమ కుమారి, జ్యోతి వల్లభోజు, తదితరులు పాల్గొన్నారు. సభా కార్యక్రమానికి ముందు భూదేవి తన చక్కటి స్వరంతో కొన్ని లలిత, దేశభక్తి గీతాలను ఆలపించి సభికుల ఆనందాన్ని అందించారు. ముఖ్యంగా దాశరథి గారు రచించిన "ఆ చల్లని సముద్ర గర్భం.. దాచిన బడబానల మెంతో" భూదేవిగారు, ఈ పాట పాడుతుంటే, నిజమే.. ఆ సముద్ర గర్భంలో ఇలాంటి గాయకులు ఎందరో ఉన్నారు, వీరు మనకు కనిపించని భాస్కరులు అని అనిపించింది...

పురస్కార గ్రహితలతో సినీనటి రోజారమణి.



సభలో ప్రసంగిస్తున్న రోజారమణి

సినీనటి రోజారమణి, గాయని భూదేవితో లేఖిని సంస్థ సభ్యులు

స్వర్గ, నరకాలు...
భౌగోళిక ప్రాంతాలు, ప్రదేశాలు కాదు.
అవి మనసు నిర్మాణం మీద జరిగే
మరణానంతర స్వప్నాలు.

-మునిమడుగుల ఫిలాసఫీ.

## ఖతర్నాక్ కరోనా..

కాలమేఘంలా ప్రపంచాన్ని కమ్మి..
కాటేసేందుకు కాచుకుంది కరోనా !
అతివేగంతో కదంతొక్కుతూ...
విశ్వానికే వణుకు పుట్టిస్తు వైరస్ !

కంటికి కనిపించిని శత్రువు..
జర భద్రం ఎటువైపున దాడిచేయునో మరి !

అవగాహనతో ఆయుధంగా మలిచి..
భయాన్ని వీడి, జాగ్రత్తలతో జీవిద్దాం !

ఔషదమే లేని అహంకార వైరస్..
అగ్రరాజ్యాల్ని సైతం హడలెత్తిస్తోంది !
చేయి ఇయ్యవద్దంటూ...
నమస్కార బాణంతో చేయూతనిద్దాం !

దగ్గులు, తుమ్ములను తెరవెనక దాచి..,
జ్వర భాదితుల్ని ఏకాంతవాసానికి పంపిద్దాం !

రాక్షసి విషకోరల్లో చిక్కక...
కోరోనాపే కరేంగే జంగ్, మిటాయేంగే కోవిడ్ కో !



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## కరోనాతో కడు జాగ్రత్త.. !

కరచాలనమే వివాదం
నమస్సులేను ప్రమోదం
చేతులే కల్పుట మనకు
కరోన వ్యాధి ప్రమాదం!

ముక్కులోననీరుకారు
శరీరమంతబేజారు..
వదలని దగ్గు జ్వరాలు
కరోనా రోగము తీరు!

చేతులు బాగా కడుకో
మాస్క్ ముఖాని కేసుకో
జనం గుంపులో ఉండకు
కరోనానిల వదులుకో !

సమతుల్యపుభోజనము
సహజ వాతావరణము
చేసి తిరిగె ప్రజలకిలను
కరోనా కడు దూరము.. !!!

తినే పద్ధతి మార్చుకో
శుభ్రతనిసదా పెంచుకో
దగ్గు తుమ్ములొస్తే బహుగ
దస్తి నడ్డము పెట్టుకో!

బాగ త్రాగు మంచినీరు
గొంతులున్న క్రిమి జారు
కడుపులోన చచ్చిపోయి
కరోనా బాధిక తీరు!!

–డా. గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493

## కరోనా కనుమరుగైపో

కరోనా ఏ నోట విన్నా నీ మాటే
పత్రికలలో, ఛానళ్లలో నీ ఊసే
నీ దెబ్బకు దేశాలే బొబ్బలు పెడుతున్నాయి
నిన్ను నిర్మూలించడానికి వేల కోట్లు వెచ్చిస్తున్నాయి
నీకు తరతమ భేదం లేదు
అన్ని దేశాలకు ఎగబాకుతున్నావు
నీకు పాస్పోర్టు వీసాలు అక్కర్లేదు
నువ్వు దేశాధినేతల్ని వదలట్లేదు
నీ ప్రభావంతో వీధుల్లో
జన సంచారం తక్కువవుతున్నది
స్కూళ్ళు, థియేటర్లు, పబ్బులు, క్లబ్బులు
మూతపడుతున్నాయి
ఐపీఎల్ మ్యాచ్ లు వాయిదా పడుతున్నాయి
దేశాల మధ్య రాకపోకలు తగ్గుతున్నాయి
సభలు సమావేశాలు రద్దవుతున్నాయి
సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఇంటి నుండే పనిచేస్తున్నారు
సుప్రీంకోర్టు న్యాయమూర్తులు
అత్యవసర కేసులనే విచారిస్తున్నారు
ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నది
పర్యాటక రంగం కుదేలవుతున్నది
అనారోగ్యానికి గురవుతున్నా
ఇన్నాళ్ళు దుమ్ము పీల్చుకున్న వాళ్ళు
ఇప్పుడు మాత్రం నీకు జడిసి
మాస్కులు ధరిస్తున్నారు
ఒకరినొకరు గుర్తుపట్టలేనంతగా
తొడుగులు తొడుక్కుంటున్నారు .

ఇలా ఎన్నాళ్ళు కూపస్థ మండూకాల్లాగా
ఇళ్ళల్లోనే గడిపేది
మాకు బుద్ధొచ్చింది
సంపూర్ణంగా పరిశుభ్రత పాటిస్తాం
పరిసరాలను అందంగా ఉంచుకుంటాం
ప్రతి మనిషి బాగుండాలని కోరుకుంటాం

ఇప్పటికే మా లో మార్పు మొదలైంది
బజారులో ఫాస్ట్ ఫుడ్కు అలవాటు పడిన వాళ్ళు
ఇంటి భోజనానికి మళ్లుతున్నారు
వారానికోసారి స్నానం చేసే వాళ్ళు కూడా
రోజు స్నానం చేస్తున్నారు
ద్వేషించడం మాత్రమే తెలిసిన వాళ్ళు సైతం
ఇతరులను ప్రేమించడం నేర్చుకుంటున్నారు
అందరూ బాగుంటేనే ఆ అందరిలో
మనముంటామని గుర్తిస్తున్నారు

అనవసరంగా అరచుకోవడం మాని
ఎక్కువగా మౌనంగా ఉంటున్నాం
పశువుల మాంసాలను ఆరగించడం మానుకుంటున్నాం

కరచాలనాలు, కౌగిలింతలు, ముద్దులు మానేసి
చేతులు జోడించి నమస్కరిస్తున్నాం
మరచిపోయిన భారతీయ సంస్కృతిని
మళ్లీ అలవరచుకుంటున్నాం

భారతదేశాన్ని ప్రేమిస్తాం
విదేశాలకు వెళ్లి రోగాలను తెచ్చుకోమ్
భారతీయతను గౌరవిస్తాం
మితిమీరిన భోగాలను పరిత్యజిస్తాం

కరోనా !
మాపై కరుణ చూపించు
మా ప్రార్థన ఆలకించు
మా నుండి తొలగిపో
పూర్తిగా కనుమరుగై పో ...

–అన్నాడి గజేందర్ రెడ్డి
98488 94086

## 'కరో"(నా)చాలనం

మేడిన్ చైనా అంటే చీప్ గా వస్తుందని
మురిసిపోయేవాళ్ళం ఇన్నాళ్ళూ
కొంపలుముంచే కరోనాను
చైనా తయారు చేసిందో లేదో కానీ
అది మాత్రం సునామీలా ప్రపంచాన్ని ముంచేస్తోంది
ప్రపంచాన్నే ఖైదు చేసి పరిహాసమాడుతోంది...

ఫ్లైటెక్కాలంటే బెంగ
రైలెక్కాలంటే లబలబ
బస్సెక్కాలన్నా కస్సుబుస్సుముంటుందేమానని భయం
చివారఖరికి గుండె కూడా
లబ్ డబ్ లు మానేసి కరోనా జపంచేస్తోంది
కుచ్ కరోనా అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది...

నమస్తే' 'ఆదాబ్'లను నువు
గుర్తుచేస్తున్నావని ముచ్చటపడే
వాట్సప్ మెసేజ్‌లు..
మర్చిపోయిన నవ్వును గుర్తుచేసినా కరోనా..
గురిచూసి ఊపిరి తీసేస్తున్నావన్న
వాస్తవాన్ని విస్మరిస్తామా...

ప్రపంచమో విస్తృత శకలంగా మారబోతోందా
సైన్స్ కథలలో సెన్స్ లేదని
వాదించినవారిని చూసి జాలిపడినట్టు
మూతబిగించిన జాడీలో దాచిపెట్టిన
ఆవకాయలా మనుషులిప్పుడు దాక్కున్నారని ఏడవాలా
ఏదైతేనేం సెల్ఫోన్లు కంప్యూటర్లు కలిసి
మనిషిని ఏమార్చినట్టు కయ్యమాడుతూ కరోనా
ఇది నెయ్యం మిత్రమా అంటోంది
ఇది నీమంచికోసమే అన్నట్టు...

ఏ బలుసాకు తిందామన్నా దొరకని
కాలం నీడలో కరెన్సీ చెట్లను పెంచిన మనిషీ
నీకిది కనువిప్పు సమయం
అభివృద్ధి నిప్పుల కుంపటిని రాజేసి
చలికాచుకున్నాననుకున్నావు
ఇప్పుడది కరోనా సెగతో
నిను దగ్ధం చేస్తోంది.

–సి.యస్.రాంబాబు
9490401005

## కరోనా కో .. మి తా దో

కంటికి కనిపించని
సూక్ష్మజీవులే
మారణాయుధాలై
మట్టు పెడుతుంటే ..
పొడి దగ్గు శబ్దాలే
దడ పుట్టిస్తూ
దాడి చేస్తుంటే ..
తల్లీబిడ్డలు ఒకరినొకరు
ముట్టుకోలేక తల్లడిల్లే
పరిస్థితి ఎదురవుతుంటే ..
ఆడుకుంటున్న పసిపాపలు
అక్కడికక్కడే శ్వాస విడిచి
కుప్పకూలి పోతుంటే ..
మాట్లాడుకుంటున్న
మనుషుల మాటలు
శాశ్వతంగా మూగ పోతుంటే ..
మాయదారి 'కరోనా వైరస్'
మాయ చేసి మరణ మృదంగాలు
వాయిస్తూ ఉంటే ..
పాపం 'చైనా ప్రజలు'.. అంటూ
ఎవరికివారే ఊరుకుంటే ఎలా ?
బతకాలి బతికించాలి
అనే తపనతో
మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శిస్తూ
తన బిడ్డల్ని.. దేశాన్ని
రక్షించుకుంటున్న చైనా స్ఫూర్తి కి..
కరోనా కకావికలం కావాలని
ప్రార్థిస్తూ.. సాయమందించండి
మనిషి ప్రాణాలకు శత్రువై
భీకర పోరు సాగిస్తూ
మరణ శాసనాలు చేస్తున్న
కరోనాకు కుల మత జాతి దేశ
భేదాలు ఉండవని గ్రహించండి
మన వరకు వచ్చే వరకు
విగ్రహంగా ఉండకుండా
నిగ్రహంగా సహాయం అందిస్తూ
కరోనాను.. సమూలంగా
నిర్మూలించడానికి తోడ్పడండి

–బి చంచల రవి కుమార్
8500330700

## కరోన మొగ్గలు

సంస్కారాన్ని మనం మరిచిపోతే
కరోనతో కరచాలనం జేసినట్లే
నమస్కారమే సమస్త రోగనివారిణి

విదేశాల్లో ఇప్పుడు విహారమంటేనే
కరోనతో కరచాలనమ్ జేసినట్టే
పరదేశాలొద్దు పంచారామాలే ముద్దు

కరోన మాట విన్నప్పుడల్లా
కర్మసిద్ధాంతమే దర్శనమిస్తుంది
జన్మజన్మల కర్మఫలం కరోన

కాలుష్యకోరల్లో చిక్కుకుంటేనే
కరోన పెనుభూతమై కాటేస్తుంది
కరోనను
అంతమొందించే ఆయుధం పరిశుభ్రత

– ఉప్పరితిరుమలేష్
9618961384

## మణిపూసలు

అతి దగ్గర కెళ్లొద్దు
చేయి చేయి కలుపొద్దు
కరోనా మహమ్మారికి
స్వాగతంబు పలుకొద్దు

గుంపులోన గలువొద్దు
సినిమాలను చూడొద్దు
కరోనా కోవిడుకు
స్వాగతంబు పలుకొద్దు.

పరిశుభ్రత వీడొద్దు
పట్టణాలు తిరుగొద్దు
కరోనా రోగానికి
స్వాగతంబు పలుకొద్దు.

చల్లనీళ్ళు తాగొద్దు
సర్కికి తావివ్వొద్దు
కరోనా చెడుగాలికి
స్వాగతంబు పలుకొద్దు.

కొన్ని రోజులన్నా
మటన్ చికెన్ తినవద్దు
మందుగిందు దాగొద్దు
కరోనా వైరసుకు
స్వాగతంబు పలుకొద్దు.

మూతి మూతి రాయొద్దు
ముక్కు చెవులు గెలుకొద్దు
కరోనాకు మనమంతా
స్వాగతంబు పలుకొద్దు.

అందుకే..
మన సంస్కృతి చాటుదాం
స్వచ్ఛత పాటించుదాం
కరోనాను తరిమేయగ
ప్రతినిత్యము పోరుదాం.

ఆరోగ్యమును పొందుదాం
సంతోషముగ బతుకుదాం
సంస్కారమును తెల్పెడి
నమస్కారము పెట్టుదాం.

– వడిచర్ల సత్యం
సెల్: 7989511543

## కరోనా..! కుచ్..కరోనా.

ఇప్పుడు
భూగాళాన్ని వణికిస్తున్న వైరస్ కరోనా..
ఎక్కడ చూసినా కలవరమే..
కంటికి కనబడని.. చిన్నజీవి
కబళిస్తున్నది దేశాలకు దేశాలనే..!
అన్నట్టు..
నాయనలారా..ఒక్కమాట..
ఇప్పుడు కట్టించుకుందామా తాయత్తులు
తగ్గుతుందేమో చూద్దాం!
ఇప్పుడు వేయించుకుందామా మంత్రాలు..
వింటుందేమో చూద్దాం..
ఇప్పుడు చెప్పించు కుందామా జోస్యం
మిగులేదెవరో తేలిపోతుంది
ఇప్పుడు సేవిద్దామా గోమూత్రాలు
అరికడుతుందో లేదో తేలిపోతుంది
ఇప్పుడు కడదామా ముడుపులు
మహమ్మారి మాయమవుతుందో చూద్దాం!
మిత్రమా...కళ్ళు తెరవండి..
మంత్రాలకు చింతకాయలు రాలవు
యజ్ఞ యాగాలు..సాములూ సన్నాసులూ
విదేశీ వైరస్ కు..అర్థం కావు
నిన్ను నువ్వే..కాపాడుకో
కాకుంటే.. అష్టదిగ్భందనం చేసుకో..
అవును..
బల్లుబంద్..గుళ్లుబంద్..
పబ్బులు బంద్ ..క్లబ్బులు బంద్
కట్టడి చెయ్యాలి మరి!
కకావికలం చేసే దాని వేగానికి
కళ్లెం వెయ్యాలి తప్పదు
బతికుంటే..బలుసాకు తినొచ్చు..
ఇప్పుడైతే..
ఎక్కడివాళ్ళు అక్కడే గప్..చుప్
గదే మరి కోవిడ్19 కి విరుగుడు..

–నాంపల్లి సుజాత

## కోవిడ్ పందొమ్మిది(COVID-19)

జనాల్లో ఏదో కలవరం
ఎటు చూసినా ఒకటే కలకలం
ఇలాతలమంతా అతలాకుతలం.
మనుష్యులు ఎందుకో
ముక్కూ మూతులను కప్పుకుంటున్నారు.
ఎవరైనా దగ్గినా తుమ్మినా
చూపులతోనే కాల్చేస్తున్నారు.
మిత్రులు కూడా కరచాలనానికి
చాలా దూరముంటున్నారు.

వృద్ధి కోసం విపణి ద్వారాలు
బార్లా తెరిచిన దేశాలిపుడు
తమ దేశానికెవరూ రావొద్దని
ఆంక్షల గోడలు కడుతున్నాయి.
అత్యవసరమైతే తప్ప
ప్రయాణంచొద్దని
ప్రజలకు ఆదేశాలిస్తున్నాయి.
ప్రపంచానికేదో సుస్తీ చేసింది.
అందుకే దేశాలన్నీ గస్తీ కాస్తున్నై.

చైనాలో పుట్టిన
చూపుకు దొరకని కొత్త జీవి ఏదో
మనిషి నుండి మనిషికి
వారాలు చేసుకుంటూ
ప్రపంచయానం చేస్తుంది.
దేశాల ఎల్లలు మనుషులకే గానీ
ఇతర జీవులకు లేవని
ఋజువు చేస్తుంది.

పొందిన ఆతిథ్యానికి కృతజ్ఞతగా
అతిథి వ్యాధి నిరోధకశక్తికి
పరీక్ష పెట్టి పోతుంది.
వైద్య కోవిదులనే సవాలు చేసి
తొడగొడుతోందీ కోవిడ్ పందొమ్మిది.

మంచో చెడో ఈ కరోనా!
ఏమైతేనేం సంస్కారానికి మళ్ళీ
మంచి రోజుల్ని తెచ్చింది
స్వచ్ఛత సభ్యత
వ్యక్తిగత శుభ్రతను పాటిద్దాం!
సమాజ భద్రతకు చేయి చేయి
కలపకుండానే చేయూతనిద్దాం!!

–సింగారపు రాజయ్య (సిరా)
9945744332

## స్వాగతం

కోయిల యెక్కడో కూసిందట
చైత్రం వస్తుంది కాబోలు
యెండలు మండటానికి సిద్ధమౌతుంటే
ఏదో మార్పు కనిపిస్తుందనుకున్నా
చలి పెట్టే చక్కిలిగింతలు
రగ్గుల చాటున వెచ్చని కౌగిళ్ళు
ఒంటి విరుపులో విడిపోయి
గడుస్తున్న కాలం వెంబడే
పరుగిడినట్టనిపిస్తోంది!
పక్షుల కిలకిలా రావాలు
ఒకవైపు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నా
లేత మావిడి చివుళ్లు నోరూరిస్తూన్నా
ఉగాది నాటికి ఉసిరి గాయంత
మామిడి రుచులు గ్రోలబోతున్నామన్న
ఆనందం కన్నా
గతం, వర్తమానం పెట్టే భయాలనుండి
కోలుకోవడం యెలాగో తెలియకున్నది
మాన్యత మరిచి మహిళల భద్రతలో
కల్లోలాన్నింకా మరిచి పోనేలేదు
రాజకీయుల,యుక్తులూ, కుయుక్తులూ
ఇంకా వార్తల్లో రాణిస్తూనే ఉన్నయ్!
సామాన్యుల చెవుల్లో గింగిరాలు పెడుతూనే ఉన్నయ్!
అసంతృప్తుల అవకాశవాదుల
వాదనలో నలుగుతూనే ఉన్నరు!
పోరాట యోధులుగా మిగులుతూనే ఉన్నరు!
ఇవేవీ పట్టని మిగులు జనులు
మింగుడు పడని కుటుంబ వ్యవస్థలో
నిర్వికార నిర్వేదంతో తమ జీవన సమరాన్ని
సాగిస్తూనే ఉన్నరు!
అసలు జీవితమే ఒక పోరాటమాయె
యేనాడూ మనసు నిండిన
షడ్రసోపేత జీవితం దొరుకుతుందా!
అలా దొరికితే ఇంకేముంది?
పోరాటం ఆగిపోదూ!
కాలచక్ర గమనం మారిపోదా!
అందుకే నేమో! ఏడాది కోసారైనా!
షడ్రుచుల సమ్మేళనాన్ని ఆహ్వానిస్తాం!
ఆ రుచుల నాస్వాదిస్తాం!
ఆనందానుభూతుల్ని కల్పించుకొని
అదే అమరసుఖమని అనుభవాల
నెమరువేసుకుంటాం ప్రతియేటా!
అయినా కరోనా వైరస్ కర్కశంగా
భయపెడుతున్న వేళ
జనం గగ్గోలు పెడుతుంటే
ప్రభుత్వ యంత్రాంగం కదలివచ్చి
అప్రమత్త చర్యల కనుగుణంగా
నడిచి పండుగ చేసుకోవాలేమో!
శ్రీ వికారి చివరి వికృత చేష్ట యిది కాబోలు!
శార్వరీ! నీవైనా శాంత చిత్తంతో రా!
భయాల తొలగించి భద్రత నింపి
జనాలమధ్యలో నడిచొస్తే
నీకిదే మా హార్దిక స్వాగతం! సుస్వాగతం

–యెనిశెట్టి గంగాప్రసాద్
సెల్: 9866447234!

## స్వాగతం-సుస్వాగతం

శార్వరి నామ సంవత్సరం శరవేగంతో వస్తోంది
వికృతినామ సంవత్సరంలోని
వికృత చేష్టలను రూపుమాపుతుంది
శరత్కాల మేఘలా క్రమ్మిన 'కరోనా' వైరస్ ను
సమూలంగా నాశనం చేసెందుకు వస్తోంది
ఉగ్రవాదాన్ని పచ్చడి చేసెందుకు వస్తోంది
రాజధానుల రగడనూ, స్థానిక సంస్థల ఎన్నికలనూ
శరా ఘాతంలా వేధించే అర్థిక సమస్యలనూ
చాక చక్యంగా పరిష్కరించగలనని తలుస్తోంది
షడ్రుచుల్లా సర్వమతాలను సమ్మేళన మొనర్చి
శాంతిని చేకూర్చి శాంతి కపోతాన్ని ఎగురవేయడానికి
ఆఘమేఘాల మీద పరుగెత్తుకొస్తోంది
శార్వరి నామ సుమబాలకు
స్వాగతం!సుస్వాగతం!

– యం. బాల గంగాధరయ్య,
9849546762

## శార్వరికి స్వాగతం

తిథి వార నక్షత్ర యోగ కరణాల సమాహారం పంచాంగం
మానవ జీవిత సంప్రదాయ సూచిక సోపాన పటము
వర్జ్య, దుర్ముహూర్త యమగండ విషనాగుల బుసబుసలు
అమృతకాల సుముహూర్త ఆనంద శుభయోగాల నిచ్చెనల ఆశలు
దిన, వార, మాస, సంవత్సర ఫలితాల ఊహాలోకం
ఆశనిరాశల ఊయల ఊగిసలాట! ఈ పంచాంగ శ్రవణం !!
ఉగాది నాటి ఈ శ్రవణం మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణం
విపత్తుల ఎదురొడ్డి జీవన నావను నిలిపే ఊతం
అనుకూల పవనాల అదునుచూసి ఒడిసిపట్టే ఒక గేలం !
తిరోగమన గ్రహాల పురోగమన తుషార జల్లుల తృప్తి నిలిపి
తీరిక లేని జీవితాలు తీరానికి చేరువని, తీపి కబురుల పంచి
తుష్టిని పరిపుష్టి చేసి, కష్టాల నష్టపరచి, రేపటి జీవితానికి బాటలు వేసిన
ఈ పంచాంగ శ్రవణం కర్ణపేయం కావాలని ఆశిద్దాం !!
విళంబి వత్సర గాయాలపై లేపనం అదిమి అదిమి
కొత్త రోజులకై తీపి కబుర్లు కొసరి కొసరి
పాత రోజుల చేదు కబుర్లు మరచి మరచి
అతుకుల జీవనగతుల గతించి గతించి
మేటి జీవన గతులు పరించి వరించి
వసంత శోభల తొలకరి పలుకులు పలికి పలికి
కోయి రవముల మధురసుధలు చిలికి చిలికి
అరవిరిసిన ప్రకృతి అందచందాల కవ్వించి, కవ్వించి
బీడువారిన నదుల జల తరగలు పొరలి పొరలి
పాడిపంటల పసిడికాంతుల మెరసి మెరసి
అన్నదాత మోమున ఆనంద కాంతులు విరిసి విరిసి
మురిపాల తేనెపలుకులు
గిలిగింతల కవ్వింతలు నింపి నింపి
కామపిశాచ మధాంధుల మదము అణగి అణగి
వనితల వ్యక్తిత్వం అతిశయించి అతిశయించి
వికారి వత్సరంబున విజయ దరహాసంబు ఎగసి ఎగసి
శుభకర నవతర ఉగాది రావాలి రావాలి !!
పరమాత్మ కరుణకై ప్రార్థిద్దాం మళ్ళీ మళ్ళీ
అందరికి నూతన ఉగాది వత్సర శుభాకాంక్షలు !!

–డా. దేవులపల్లి పద్మజ
9849692414

## శ్రీ శార్వరి!

శ్రీ వికారీ వీడుకోలు
ఆకారమంత వికారంగాదని
భాష్యాలెన్నో చెప్పేసుకొని
లెక్కకు చిక్కని మిక్కిలి తిక్కలు
బుద్ధికి అందని నూతన తిప్పలు
మేధకు లొంగని వైరస్సు దెత్తులు
ధరిత్రి చుట్టూరా కమ్మటం కన్నాం!
శ్రీ శార్వరి సుస్వాగతం
కృష్ణపక్షపు రాత్రిలో
తుహినకరుడు తరిగినటు
క్రమంగా బుద్ధిని హరించక
శుక్లపక్షపు శర్వరిలో
వెన్నెల అతిశయించినటు
మనోవికాసం విస్తరిస్తూ
మధుమాసపు తరులతీరు
విరబూసే విరులతీరు
శ్రావ్యపు కూతల కోకిలలతీరు
ప్రాభాత మయూఖాల వెల్గులతీరు
ప్రాణకోటి మనుగడుండేనని
చైత్రపు విరుల నెత్తావులల్లే
మలయమారుతపు మంచిగంధమల్లే
శుభఘడియల్ని చుట్టూ చుట్టుకుని
జగత్తుకు వరప్రదాతవయ్యేవని
వినమ్రంగా నమస్కరించి ప్రార్థిస్తూ
ఆహ్వానమమ్మా ఆహ్వానం
శ్రీ శార్వరి !! శ్రీ శార్వరి!!

– రవి కిషోర్ పెంట్రాల,
లాంగ్లీ, లండన్!

## ఉగాదిని స్వాగతిద్దాం!

కాలం జీవనదిలా ప్రవహిస్తూనే ఉంటుంది
విళంబో,వికారో,శార్వరో,ప్లవో...
ఏదైతేనేం ఒక కాలపు నదీపాయ
దారిలో మనల్ని పలకరిస్తుంది
ఇష్టంతోనో అయిష్టంతోనో
ఎదురెళ్లి ఉగాదిని స్వాగతించాలి
చేదో తీపో
ఏదో ఒకటి దోసిల్లనిండా నింపుకొస్తుంది
నవ్వుతూ స్వీకరించాలి
వైవిధ్యంలేక ఎండిపోయిన జ్ఞాపకాల బావిలో
ఏ ఉగాదికో
రెప్పపాటు మెరిసే నక్షత్రకాంతిని
మూటగట్టుకోవాలి
దివారాత్రుల గుర్రంమీద
కాలం గమిస్తూనే ఉంటుంది
విజయోత్సాహమో వేదనోద్వేగమో
దినచర్య పేజీల్లో కొన్ని అనుభవాల్ని రాసుకోవాలి
యుద్ధమో సంధో
జీవితానికి దక్షిణగా సమర్పించుకోవాలి
సారథిగానో సాహసికుడిగానో
మొత్తమ్మీద ప్రపంచానికి
ఒక సైనికుడిగా గుర్తుండిపోవాలి
ఉగాదే నాంది కావాలి!

– సాంబమూర్తి లండ.
9642732008

## మెరుపులు

ద్వయ సంయుతము
యుగమునకు ఆది
నూతన సంవత్సరము
తెలుగు వారి ఉగాది

వసంత ఆగమనమునకు
నాంది
కొత్త కోరికలకు
సిసలైన పునాది

సృష్టి ఆరంభము
జరిగిన రోజు
నవ సంరంభము
తెచ్చిన రోజు

వేదాలను హరించిన
సోమకుని వధించినరోజు
చక్రవర్తి శాలివాహన
పట్టాభిషిక్తుడైన రోజు

జడ ప్రాయమైన జగతిలో
చైతన్యాన్ని రగిలించిన రోజు
నూతన అకాంక్షలలో
తేలియాడు రోజు

జీవితము సుఖదుఃఖాల
సంగమని తెలిపేది
ఆరు రుచులు అనుభవాల
ప్రతీకని తెలిపేది

వేపపూల చేదును
తీయగా చేయునది
చింతపండు పులుపును
ఆస్వాదించమనేది

పచ్చిమిరపకాయల కారమును
గ్రహించుమనేది
తీయదనాన్ని ,వగరును
సమానంగా చూడమనేది

–సునీత బండారు
9440671530

## పాడవే...!"

పాడవే కోయిలా పాడు
పాడవే తియ్యగా పాడు

వసంతం నీ ఊపిరి కదా
నిజాన్ని నిర్భయంగా గొంతెత్తి పాడు
న్యాయాన్ని జండాపై కెత్తి
అన్యాయాన్ని దునుమాడు
పాడవే కోయిలా పాడు

గ్రీష్మం వేసవితో తరుముకొచ్చినా
శిశిరం ఆకులను రాల్చివేసినా
హేమంతం చలితో స్మర్శించినా
శరత్తు చల్లని వెన్నెలను వెదజల్లినా
వర్షఋతువు చినుకులతో నాట్యమాడినా
నీ కాలం నీదే కోయిలా
పాడవే కోయిలా పాడు

కాలమెప్పుడూ ఒకటి కాదు
దానికి వేల కళ్ళు
నిరంతరం పహరా కాస్తూనే ఉంటది
కాగడై కాలాన్ని పట్టి చూపుతది
పాడవే కోయిలా పాడు

నువ్వు ఏ రాగాన్నెత్తుకున్నా
వసంతంలా ఎదలోతుల్లో
సప్తస్వరాలను పలికిస్తది
కొత్తకొత్త రాగాలను
మనసులను రంజింపజేస్తది
పాడవే కోయిలా పాడు

వసంతం నీ శ్వాస కదా
ఆకులు రాలినప్పుడే కదా
చిగురులను తొడుగుతూ వస్తావు
శిశిరాన్ని వెంటాడుతూనే
హేమంతాన్ని మోసుకువస్తావు
ఆగామి జీవితానికి ఆశలు కల్పిస్తూ
మాలో కొత్త ఆశలను చిగురింపజేస్తావు

– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

## శార్వరికి స్వాగతం

శార్వరి రాగదే ప్రజల శ్రేయము గూర్చగ నందనంబుగన్
పర్వము లొప్పగన్ జగతి పాలన జేయగ నీతి ధర్మమున్
సర్వము శాంతి సౌఖ్యముల సంస్కృతి బెంచగ నైకమత్యమున్
సార్వజ నీకమౌ సిరుల సామ్యత గూర్చగ దివ్య కాంతులన్

సన్నుత కీర్తులందు ఘన సంస్కృతి వెల్గగ ఈ యుగాదికిన్
మిన్నగ కాంతులీను మన మేలిమి జీవన సౌరభంబులన్
మన్నత భావ పర్వముల నొప్పగ హైందవ దేశ వైభవం
కన్నుల విందుగా జనుల కందగ నిత్యము కీర్తనీయమై

నూతన శార్వరీ శకము నొప్పగ వైభవ భాగ్యరేఖలన్
దాతగ నీయవచ్చెనిదె తేజము నందగ నీతి ధర్మమున్
జాతికి వైజయం తికలు జైయ్యన నిత్యము మానవాళికిన్
ఖ్యాతిగ ఈ యుగాది ఘన కీర్తులు నింపగ వత్సరాంతమున్

రాగదె శార్వరీ జగతి రంజిల భాసుర సుప్రకాశమున్
తేగదె కోర్కెదీర సిరి తేజము లొల్కగ మానవాళికిన్
రాగము లొల్కగా మదిని రాజిత శోభిత సౌఖ్యశాంతులన్
సాగగ విశ్వశాంతి ఘన సఖ్యత సంబర మొప్ప నూత్నమై

శార్వరి భాగ్యరేఖలతొ సంస్కృతి సంపద బంచవచ్చెనో
పర్వము లొప్పగా జనుల ఆటల పాటల దేల్చ వచ్చెనో
మర్వక శ్రీల పొంగులతో మాన్యత గూర్చగ రానె వచ్చెనో
కుర్వగ వర్షముల్ జనుల కోర్కెలు దీర్చగ పాడి పంటలన్.

– డా॥కే. బాలస్వామి
సెల్: 9959653115

## ఉగాది

ప్రకృతికాంత
మంచు ముసుగు తెరలను తెంచుకుని

మధుర మంజుల ఆనందంతో
వసంత ప్రవేశం

ఉదయ భాస్కరుని
లేలేత కిరణాలు
వాయుదేవుని
గాలి కెరటాలు

పూల పరిమళాలు
భ్రమరాల ఝంకార నాదాలు.

లేలేత చిగుర్లు
చవి చూచి

మత్తెక్కిన
కోయిలల
కుహు కుహు
మధుర రాగాలు

యుగానికి
ఆది ఉగాది
బ్రహ్మదేవుని
సృష్టి ఆరంభం

మందిర దర్శనం
పంచాంగశ్రవణం
ఆరు రుచుల
ఆరోగ్య పచ్చడి
సేవనం

మధురం మధురం
బ్రహ్మానందం

తెలుగువారి
తొలి పండుగ
శార్వరీ నామ ఉగాది

నూతన
సంవత్సరం కు
స్వాగతం సుస్వాగతం



– యెల్లి సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

# వైవిధ్యమైన కవితా వస్తువులతో వెలువడిన "కవన మంజరి"...

కవి, రచయిత డా॥ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో "కవన మంజరి" పేరుతో ఓ కవితా సంకలనాన్ని వెలువరించారు. భవానీ ప్రచురణలు కరీంనగర్‌గారి ఆధ్వర్యంలో ప్రచురింపబడిన ఈ పుస్తకంలో.. సంపాదకులు డా॥ వైరాగ్యం ప్రభాకర్ అర్ధశతాధిక కవి సమ్మేళనంను నిర్వహించి.. సమ్మేళనంలో కవులు, కవయిత్రులు గానం చేసిన కవితల్ని ఏర్చి కూర్చి.. "కవన మంజరి"ని వెలువరించారు. ఈ పుస్తకంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని కవులు, కవయిత్రుల కవితలున్నాయి. ఆయా కవులు, కవయిత్రులు వైవిధ్యమైన కవితా వస్తువులను ఎంపిక చేసుకున్నారు. అభివ్యక్తిలో అనుకున్నంత గాఢత చాలా కవితల్లో లేక పోయినప్పటికీ.. సామాజిక చైతన్యం కోసం వారు చూపిన చొరవను అభినందించి తీరుతాం.

**సి. శశిబాల** తమ కవితను "చితికిన చిన్నారుల చిగురాకు బ్రతుకులు.. కాలే కడుపు వాకిళ్లు" అంటూ ప్రారంభించారు. చితికిన చిన్నారుల వ్యథలకు అద్దం పడుతూ రాశారు.

యువశక్తి కెరటం.. ఆశయ సాధన కిరీటంగా అభివర్ణిస్తూ **కందుకూరి సుజాత** రాస్తే.. రాలుతున్న ఆకును చూసి చెట్టుకున్న ఆకు నవ్వుతే.. ఎప్పటికైనా అది కూడా రాలిపోక తప్పునా? అంటూ **నాగమళ్ల పున్నంచందర్** తమ కవితను తీర్చిదిద్దారు.

నిర్భయ ఉదంతం నేపథ్యంలో.. ముడుంబై **శేషఫణి** తమ కవితను రాస్తూ.. చట్టాల్లో మార్పు తెచ్చి.. కఠిన శిక్షలు అమలు పరచాలని పిలుపునిచ్చారు.

'డిగ్నిటీ ఆఫ్ లేబర్' విలువను గుర్తెరిగిన ఆరే సాధిస్తారు స్వయం సమృద్ధిని అంటూ **పాణ్యం దత్తశర్మ** రాస్తే మానవత్వం పొందితే తప్ప.. అనురాగాల పొదరిల్లు వెలువదంటూ **దుప్పటి మొగిలి** తమ కవితను తీర్చిదిద్దారు.

మహిళా సమస్యలను ఏకరువు పెడుతూ **మల్లెల విజయలక్ష్మి** రాస్తే.. సెల్లుకు బానిసలం కాకూడదంటూ **కటుం కవిత** తమ కవితను రాశారు.

గౌర్రె శ్యామల నీకు లేదా సత్తువ/ నీలో లేదా నీ వీర వనిత.. కదలిరా.. కదలిరా.. నీ హక్కుల కోసం కదలిరా.. నువ్వేంటో లోకానికి తెలియజేయడానికి కదలిరా అంటూ పిలుపునిచ్చారు.

దళసరి పొరల్లో దాగిన మొలక/ మొగ్గ తొడిగిన ఆశకు సాక్షిగా ఎదగాలనిపిస్తుందంటూ **సముద్రాల శ్రీదేవి** రాస్తే.. సాధికార శిఖరాన్ని అధిరోహించే విశ్వ విజేత రేపటి మగువ అంటూ **రామా రత్నమాల** తమ కవితకు మంచి ముగింపునిచ్చారు.

**నూకెట్టి రవీంద్రనాథ్** తుంపరపూలు శీర్షికతో రాసిన కవిత, మనందరినీ బాల్యంలోకి లాక్కొని వెళ్లేలా ఉంది. అమ్మ నాన్నలు దేవుడిచ్చిన వరాలని.. కనిపించే దైవాలని.. తప్పక సేవించాలని **జక్కు కృష్ణమూర్తిగౌడ్** పిలుపునిచ్చారు. రైతన్నల నుద్దేశించి **మెరుగు మల్లేశం** రాస్తే.. సుమధుర కవితల బలగంతో మనసున్న మధురకవిగా తళుక్కున మెరుస్తుంటానంటూ **దుప్పటి రమేశ్ బాబు** సవినయంగా ప్రకటించుకున్నారు. వివిధ రకాలైన చూపులను **దుద్యాల విద్యాసాగర్** అక్షరాల్లో బంధించారు. ఆటవెలది పద్యాల్లో **అయ్యవారు మురళి** పల్లెవాసులను చిత్రించారు. అలాగే **ఏరుకొండ శ్రీనివాస్** ఓ నా పల్లె వస్తున్నా అంటూ తమ కవితను తీర్చిదిద్దారు. కష్టాలు నష్టాలు కన్నీరు సహజమే.. ఆశతో అడుగేస్తే ఆనందం మన సొంతం అంటూ **బి. సుధాకర్** రాస్తే తమ కవితలో **కళ్యాణం శ్రీనివాస్** నీటి చుక్కను చక్కగా ఆవిష్కరిం చారు. బ్రతుకుదారిలో ప్రయాణం నిశ్శబ్దమంత ప్రశాంతం కాదని కె. దేవికా రత్నాకర్‌గారు తేల్చి చెప్పారు.

ఏవీ నాగరిక ఆనవాళ్లు? అంటూ **కూచన మల్లయ్య మహర్షి** ప్రశ్నిస్తే.. **శాద వీరారెడ్డి** ఆనందనిలయాన్ని అక్షరాల్లో ఆవిష్కరించారు.

పురుష అహంకారంపై ధ్వజమెత్తుతూ **డా॥ మహ్మద్ హసీన** రాస్తే.. రోజులు మారాయి అంటూ **గౌర్రె రాజేందర్** తమ కవితను కొనసాగించారు.

మట్టిగొప్పతనాన్ని గురించి **గందె శ్రీనివాస్** రాస్తే **అలూరి విల్సన్** అందరు బాగుండాలని ఆకాంక్షించారు.




అపర ధన్వంతరి శీర్షికతో తాడి **గడప సుబ్బారావు** రాస్తే బలైపోతున్న బాల్యాన్ని **మహ్మద్ మస్తఖీమ్** తమ కవిత ద్వారా తెలియజెప్పారు.

నేటి బాలలూ రేపటి రేపిస్టులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మానవీయ విలువలతో పిల్లల్ని పెంచాలని సంస్కరించాలని **డా॥నన్నపురాజు విజయశ్రీ** సూచిస్తే.. యువత చిత్తుగా త్రాగి మునిగి తేలడం పట్ల **జనశ్రీ జనార్ధన్ కుడికాల** తమ వేదనను ప్రకటించారు. అక్షరంతోనే ఏ లక్ష్యమైనా చేరుతుంది నీదరి అంటూ **బత్తులూరి నాగబ్రహ్మ చారి** రాస్తే.. మనోగమనం శీర్షికతో **క్యాతం హేమంత్** రాశారు. ఓ విద్యార్థి మేలుకో అంటూ విజయలక్ష్మి **దొంతరాజు** పిలుపునిచ్చారు. **అనుముల తేజస్విని** ప్రాణం విలువ తెలుసుకొమ్మని హితవు పలికారు. అవధులు దాటిన కన్నప్రేమను.. వెర్రి వ్యామోహాన్ని ప్రస్తావిస్తూ ల్యాదాల **గాయత్రి** రాశారు. యువతను చైతన్యపరుస్తూ **కుడికాల వంశీధర్** రాస్తే.. **డా॥ దీపక్‌న్యాతి** కళాకారుకులకు జేజేలు పలికారు. మృగాళ్లుగా మారుతున్న మగాళ్లను ఎండగడుతూ **ప్రసాద్ తుమ్మా** రాశారు. అచేతనాలు అలుముకున్న తనువుకు మేధో మథనం వెలుగు చూపించాలని తద్వారా దివ్యాంగులను ఆశావాదులుగా మార్చాలని **ఉదయశ్రీ ప్రభాకర్** హితవు పలికారు. హరితహారంతో పుడమితల్లి ఒడిలో పున్నమి వెలుగులు నింపుదామని **జంతుల సుచరిత** పిలుపునిచ్చారు. రైతన్న కష్టాలు కడదేరేదెప్పుడంటూ **డా॥ కమలాదేవి** రాస్తే.. జలం ప్రాశస్త్యాన్ని తెలుపుతూ **జి. నాగమోహన్ కుమార్ శర్మ** తమ భావాలను మనతో పంచుకున్నారు.

జీవిత నాటకాన, సమాజ రంగస్థలంపై నీ పాత్రను నీవు నిర్వహించాలని **ఆకొండి వెంకట లక్ష్మి** పేర్కొంటే.. జీవితంలో గెలిపించిన చోటు.. మధురానుభూతుల సమాహారమే మా బడి అంటూ **మాధవీలత** బడితో తమకున్న బంధాన్ని అక్షరబద్ధం చేశారు. కలుషిత చూపులు సోకి.. పొత్తిళ్ళ మొగ్గలు రాలిపోతుంటే.. దహించివేసే దుఃఖాగ్ని నుండి.. మూడో నేత్రం పుట్టనందుకు సిగ్గు పడుతున్నానంటూ **నల్లు రమేశ్** రాస్తే.. ఓటుతోనే ప్రగతికి గీటు రాయి పడుతుందని **దంతర బోయిన దైవాధీనంటు** పేర్కొన్నారు.

ఉవ్వెత్తున లేచే కెరటం.. చెప్పకనే చెప్పింది.. జీవితమంటే సుఖదుఃఖాల నిలయమని పేర్కొంటూ జయంతి సుధాకర్‌గారు రాశారు.

నేటి కౌమారం తీరు తెన్నులను డాక్టర్ అడిగొప్పుల సదయ్య వివరిస్తే.. కులమతాలకతీతం స్నేహం అంటూ **సింహాద్రి శ్రీనివాసరావు** రాశారు. అతి గారాబంతో గడిపే బాల్యాన్ని సంధ్య ఐండ్లగారు తమ కవితలో ప్రస్తావించారు. కాళేశ్వరం తెలంగాణకు అద్భుత వరం అంటూ **ఎం. ధరణి** రాస్తే.. "కర్మజీవులు" శీర్షికతో **పాతూరి సుబ్రహ్మణ్యం** కంద పద్యాలను మనకు అందించారు.

తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని **బొమ్మ విమల** ఆవిష్కరిస్తే.. **నెరువటి అంకూస్** అడుక్కునే గిన్నె ఆగమైందని వాపోయారు. నేను-నువ్వు శీర్షికతో గంతుల **శ్రీకర్** రాసిన కవిత ఆలోచనాత్మకంగా ఉంది. ప్రజల మనిషి అంబేద్కర్ అంటూ **బి. నారాయణ** రాస్తే.. అక్షర వైద్యం చేసి సమాజరుగ్మత బారి నుండి కాపాడాలని **డా॥చీదెళ్ళ సీతాలక్ష్మి** పిలుపునిచ్చారు.

అంతర్జాలం- ఒక మాయాజాలమని **పరిమి వెంకట సత్యమూర్తి**గారంటే.. పచ్చని మెట్టు శీర్షికతో పచ్చని చెట్టును వేముల **తిరుపతిరెడ్డి** రాస్తే.. **డా॥రవీంద్ర** పేదరికంపై తమ భావాలకు అక్షరాకృతినిచ్చారు.పల్లె బతుకులకు అద్దం పడుతూ **ఐరేణి కృష్ణవేణి** రాస్తే సిగ్గులేని రాజకీయాల నిగ్గు తేల్చే ప్రయత్నం చేసి **బేతు సునీల్‌కుమార్** మెప్పించారు.మహిళలను చైతన్యపరుస్తూ **సయేదా సమీనా పర్విన్** యువతకు మార్గదర్శనం చేస్తూ **వసంత లక్ష్మణ్** రాశారు.

అమ్మ యొక్క అంతరంగాన్ని **సుకన్యవేదం** ఆవిష్కరిస్తే.. బెహర **ఉమామహేశ్వరరావు** జవాబుదారీ ఎవరు? అంటూ ప్రశ్నిస్తూ బాలల పుస్తకాల బరువును ఎండగట్టారు. నూతన ఆలోచనలకు మార్గం చూపేది అక్షరాలని **యం.డి. ఖాలిద్** రాశారు. అక్షరాయుధాలంటూ **ఎస్. జవేరియా** రాస్తే.. **బి.ఎల్. హరిరమణ** తోటివారి ఎడ మానవత్వంతో మసలుకోవాలని సూచించారు. **మేరెడ్డి రేఖ** అన్నదాతల ఆక్రందనలను వినిపిస్తే.. **యాద తిరుపతి** రాజన్న సిరిసిల్ల జిల్లా విశేషాలను తెలియజేశారు.

నవభారత్ గగన వీధిలో ప్రతిధ్వనించే జయజయ గానం అంటూ **వెల్ముల జయపాల్‌రెడ్డి** నినదించారు. నీరులాంటి మనసును నిగ్రహిస్తే నిత్యసంతోషినిగా భాసిల్లవచ్చునని **మద్దెల సరోజన**గారంటే.. మనసున్న మనిషినై పుడమి మీద బ్రతుకుతున్నానంటూ **దూడపాక శ్రీధర్** రాశారు. యం. అశ్వినిగారు రైతుశోకాన్ని తమ కవితలో ఆవిష్కరిస్తే.. తరం మారినా.. తీరని కథలూ.. వ్యథలూ అంటూ **తడిగొప్పుల కుమారస్వామి** రాశారు. అమ్మ అనే పిలుపు అమృతమయం అంటూ **సి.హెచ్. అరుంధతీ వివేక్** రాస్తే.. నా అక్షరాలు జగతి సిగలో వెలిగే వెన్నెలలు అంటూ **పురుషోత్తం సతీష్** రాశారు. ఎన్నికలవేళ నాయకుల గోల పట్ల జర జాగ్రత్త అంటూ **పత్తెం వసంత** రాస్తే.. ఏమైంది మనిషికి అంటూ గంగుల **రాజేందర్ యాదవ్** ఓ గేయాన్ని రాశారు. కల్మషం తెలియని మనసుల విషంనింపే కపట మనస్కుల పట్ల అప్రమత్తంగా ఉండాలని **డా॥ వైరాగ్యం ప్రభాకర్** పిలుపు నిచ్చారు.

ఇలా ఈ సంకలనంలో ఎనభై రెండు (82) కవితలు కొలువుదీరాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని కవులు, కవయిత్రులు కవి సమ్మేళనంలో పాల్గొని తమ తమ కవితల్ని గానం చేసి.. అందించి ఈ పుస్తకానికి శోభను కూర్చారు. అందమైన ముఖ చిత్రాన్ని వేసిన కళ్యాణం శ్రీనివాస్‌గారికి అభినందనలు.అలాగే ప్రతి కవితతో పాటు ఆయా కవులు, కవయిత్రులు ఫోటోలు.. వారి సంక్షిప్త పరిచయం వేసి మరింత నిండుదనాన్ని సమకూర్చారు.

ఎంతో శ్రమకోర్చి.. కవితల్ని సేరించి.. తమ సంపాత్వంలో 'కవన మంజరి'ని వెలువరించిన డా॥ వైరాగ్యం ప్రభాకర్‌గారికి శుభాకాంక్షలు తెలుపుదాం. ఈ పుస్తంలోనే తొలిసారిగా కవితల్ని రాసిన వారు తమ కవితా యానాన్ని కొనసాగించాలని కోరుకుందాం.

ప్రతులకు: డా॥వైరాగ్యం ప్రభాకర్
ఇ.నెం. 2-102, సీతారాంపూర్
కరీంనగర్-505 002.
సెల్: 9014559059

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## తెలంగాణ దావత్

పుట్టినా, గిట్టినా,
లగ్గమెట్టినా, బోనమెత్తినా... దావత్
పిల్లబుట్టినా, కుల్ల గుట్టినా,
తొట్టెలేసినా, సారెవోసినా... దావత్
పండగొచ్చినా, పబ్బమొచ్చినా,
లాభమొచ్చినా, నష్టమొచ్చినా.. దావత్
జీతమొచ్చినా, గీతమొచ్చినా,
ఇంక్రిమెంటు, ప్రమోషను... ఏది వచ్చినా దావత్
అందుకే దోస్తులందరినీ పిలిచి దావతిచ్చినా
మామిడి కాయ తొక్కు.. ఎర్రెర్ర లుక్కు
గరం గరం పొయ్యి.. వేడి వేడి నెయ్యి
బీరకాయ పొట్టు.. ఖతర్ నాక్ టేస్టు
వంకాయ కర్రీ.. ఆలుగడ్డ ఫ్రయ్యి
ముద్ద పప్పు.. పచ్చి పులుసు
గడ్డల పెరుగు.. నోట్లోనే కరుగు
డబల్ కా మీఠా.. ఆపై స్వీటు పాను
సక్కనైన దావత్.. తెలంగాణ దావత్
సల్లగుండమని దీవించిరి యావత్
మర్చిపోకుండ్రి..
గిదే గిదే తెలంగాణ దావత్

- పి.ఎల్.మూర్తి,
9581992026

## నడిచి వస్తాను!

నేను నడిచి వస్తాను
నడిచే వస్తాను నేను
నా పాదాలకు
దుమ్ముకొట్టుకుపోయేలాగ
నడిచొస్తాను నేను

హఠాత్తుగా చెప్పు తెగిపోయి
కనుచూపు మేరలో
మరమ్మత్తు చేసే
దేవుడెవరూ కనిపించక
నడుము చుట్టూ మొలతాడుకు
మా అమ్మ కట్టిన పిన్నీసేమయినా
వుందేమోనని
తడుముకోవాలి నేను

చిన్నప్పుడు
నా కాలి బొటనవేలుకు తగిలిన
తాకుర్రాయి
మళ్లీ తాకి రక్తమోడాలని
బలంగా కోరుకుంటాను నేను

వాడీ వాడీ లూజయిన చెప్పులను
కాళ్లతో అదిమిపట్టుకుంటూ
నడిచే వస్తాను నేను
నడవలేక నడవలేక
కాళ్లీడ్చుకుంటూ
రాళ్లల్లోంచి తుప్పల్లోంచి
మా ఊరి పొలిమేరల్లోంచి
ఊళ్లోకి నడిచొచ్చినట్లు
నడిచే వస్తాను నేను

నా కాళ్ల మీద నేను
నిలబడే వస్తాను నేను
కాలిలో గుచ్చుకున్న ముల్లును
ఉమ్మి రాసి తీసిన మా అమ్మతనాన్ని
గుర్తు చేసుకుంటూ
తన మోకాలి మీద నా అరికాలునుంచి
అరగంట సేపు ముల్లు తీయటానికి
ప్రేమగా శ్రమపడిన మా నాయినను
తల్చుకుంటూ
నడిచి రావటమే చేస్తాను నేను

నేలకు చాలా దగ్గరగా వుండటం
మట్టి పరిమళాన్ని
మట్టి మీది చెట్ల పచ్చదనాన్ని
తనివితీరా పీల్చుకుంటూ
నడిచే వస్తాను నేను

కాళ్లకు చెప్పులు కూడా లేకుండా
నడిచొస్తున్న ఎంతో మంది
నిరుపేదల అడుగుల చప్పుడుకు
చాలా దగ్గరగానే నా అడుగులను
తాటిస్తూ
నడిచే వస్తాను నేను



- చిత్తలూరి
9133832246

# ఊహలకు అక్షర రెక్కలు తొడిగిన గొర్రెపాటి శ్రీను

పుస్తక సమీక్షలు

## ప్రభాతవేళ.. వీచినగాలి చల్లని హాయిని కలిగిస్తుంటే

కురుస్తున్న మంచు బిందువుల్లో తడుస్తూ కదివెళుతుంటే.. కలిగే నులివెచ్చని అనుభూతిని.. యువకవి జి. నాగమోహన్ శర్మగారు (గొర్రెపాటి శ్రీను) తన ఊహలకు అక్షర రెక్కలు తొడిగి 'వెన్నెల కిరణాలు" గ్రంథాన్ని వెలువరించారు. సరళత్వానికి పెద్దపీటవేస్తూ గొర్రెపాటి శ్రీను తెస్తున్న ఈ కవితా సంపుటిలో.. ఆయన ప్రకటించిన భావాలు వెన్నెల కిరణాల్లాంటి హాయిని పంచుతాయి.

అమ్మంటే ఇలలో వెలసిన దేవత అంటూ ఆమె మాటలు నా జీవిత పథానికి దిక్సూచిలా పని చేయగలవంటూ అమ్మను ఉన్నతంగా ఆవిష్కరిస్తూ మొదటి కవితను తీర్చిదిద్దారు. 'జపం' శీర్షికతో రాసిన కవితలో.. కవి చక్కని భావుతకను ప్రదర్శించారు. ప్రత్యూష సమయాన గడ్డిపూలపై నిలిచిన మంచు బిందువులలో నీ రూపే చూస్తున్నానని చెప్పడం బాగుంది.

విరబూసి గలగలా నవ్వుతూ.. పరిమళాన్ని వెద జల్లే చేమంతులు అంటూ 'జాడ' కవితను రాశారు.

'ఆశయం' కవిత ద్వారా.. ఆశయ సాధనలో ఓటమిని చూసి ఒరిగిపోకు.. కల చెదిరిపోయిందే అని కలవరపడి కృంగిపోకు అని హితవు పలికారు.




అపజయం ఎదురైతే నిరాశ నిస్పృహకులోను కావద్దంటూ "విజేత" కవితను రాశారు. అలాగే "లక్ష్యం" కవితలోనూ ఆత్మ విశ్వాసాన్ని నూరిపోశారు.

రమణీయ భావాలతో.. 'నిరీక్షణ" కవితకు అక్షరాకృతినిచ్చారు. ప్రేయసి కళ్ళలో కదిలే మధుర భావనలు.. వెన్నెల కిరణాల్లా చల్లదనాన్ని పంచుతాయ నడం బాగుంది. "శుభవేళ" కవితలోనూ "చిరునవ్వుల వరమిస్తావా" కవితలోనూ చక్కని భావాలను ప్రకటిం చారు. "ఆమె నయనాలు" కవితలో సైతం ఆరాధనా భావాలను మనతో పంచుకున్నారు.

వెన్నెలేమో.. వసంతాల సందడులను వెంటేసుకుని వస్తూంటే.. చిరునవ్వుల సరాగాల పల్లవులను మురళీనాదంలా వినిపిస్తానంటూ 'యువరాణి' కవితను తీర్చిదిద్దారు.

చీరంటే.. భారతీయతకు ప్రతీక! స్త్రీ ఔన్నత్యానికి సూచిక! అంటూ.. రాసిన కవితలో మన సంస్కృతిలో చీరకున్న ప్రాశస్త్యాన్ని చాటి చెప్పారు. భారతావని రత్నగర్భ అంటూ మరో కవితలో రాశారు.

ఆధునిక నాగరికత గొడుగు నీడలో. నవీన సాంకేతిక పడగనీడలో అనుబంధాలు దూరమవుతు న్నాయని తమ ఆవేదనను వ్యక్తపరిచారు.

'ప్రేమ స్వరూపిణి' కవితలో భార్యగా అమ్మగా, గృహిణిగా, కోడలిగా, తదితర రూపాల్లో 'స్త్రీ' పంచే మమకారాన్ని, ప్రేమను, ఆత్మీయతను, అనురాగాన్ని అక్షరాల్లో బంధించారు.

దేశప్రగతికి పట్టుకొమ్మలుగా నిలిచే పల్లె టూరులను ఓ కవితలో చక్కగా ఆవిష్కరించారు. సినారె తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మర ణీయుడు అంటూ 'సినారె' కవితను రాశారు. 'జై జవాన్.. జై కిసాన్" అంటూ రాసిన కవితలో.. కవి తమ భావాలను అక్షరబద్ధం చేసిన తీరు బాగుంది.

ఇలా సాదాసీదాగా కవి గొర్రెపాటి శ్రీను తమ అంతరంగంలో కదలాడే భావాలకు అక్షర రూపమిచ్చారు.

ఆయన ఎంపిక చేసుకున్న కవితా వస్తువులు బాగున్నాయి. అభివ్యక్తి బాగుంది.

పదం వెంట పదం రాస్తుంటే కవిత్వమవదు మదిలోని భావాలను పొందికగా పదాల కూర్పుతో.. మధురమై అనుభూతులను ఆలోచనల సంఘర్షణలను మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాల చిత్రీకరణలు చక్కని భావుకతతో కవిత్వంలో నిక్షిప్తం చేయాలన్న అవగాహన ఉన్న గొర్రెపాటి శ్రీను మున్ముందు మరింత గాఢమైన కవిత్వం అందించాలని ఆశిద్దాం.

అందంగా కొలువుదీరిన ముఖచిత్రం పుస్తకానికి నిండు శోభను కూర్చింది. ఒకే పేజీలో రెండు, మూడు కవితల్ని పొందుపరచకుండా ఒక్కో కవితకు ఒక్కో పేజి కేటాయిస్తే మరీ బాగుండేది.

ప్రతులకు: గొర్రెపాటి శ్రీను
ఇ.నెం.49-258/2, ఫ్లాట్ నెం. 188
పద్మనగర్, ఫేస్-1,
బాలానగర్, హైదరాబాద్-500 037
సెల్: 9652832290

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## నీరే ప్రాణాధారం

బుక్కెడు బువ్వ లేకున్నా తట్టుకున్న కాయం
గుక్కెడు నీళ్లు లేకుంటే తల్లడిల్లుతుంది
భువిపై నాల్గింట మూడొంతుల నీళ్లున్నా
మనకు నీటి గోస తీరదు
బిందెడు నీళ్ల కోసం కోసులకు కోసులు
బారెడు క్యూలు కట్టి అవస్థలు పడుతున్నం
అడవులలోనూ దూప తీరక
మూగ జీవుల ఆవేదన
వేసిన పంట ఎండిపోయి
దిక్కు తోచని రైతన్న ఆక్రందన
చేసిన కష్టం భూమి పాలయ్యి
పంట పెట్టుబడి నెత్తినపడి
ఎటూ పాలు పోని రైతన్నలు
ప్రాణాలను పణంగా పెడుతున్నరు
చెలిమె తవ్వి నీళ్లు తాగినం ఆనాడు
పాతాళానికి బోరు వేసినా
చుక్క నీరు కానరాదు ఈనాడు
అందుకే చెరువు కుంటలను కాపాడుకుందాం
చుక్క చుక్క నీటిని అదిమి పట్టుకుని
భూమిలోనే దాచుకుందాం
ఇంకుడు గుంతలు తవ్వుకుందాం
చెక్ డ్యాములు కట్టుకుందాం
నీటిని పొదుపుగా వాడుకుందాం
నీటి దుబారాను అరికట్టుదాం
జలమే జగతికి ఆధారం
జీవ కోటికి ప్రాణాధారం
నీటిని పొదుపు చేస్తూ
చెట్లను నాటుకుంటూ
జగతిని కాపాడుకుంటూ
ప్రగతికి బాటలు వేద్దాం.

- గుండం మోహన్ రెడ్డి
9440161636

# సమున్నత భావాల నవలా మాలిక శ్రీమతి దేవకిరెడ్డి రచన 'నందిని'




'నందిని' నవలా రచయిత్రి శ్రీమతి గంగపట్నం దేవకిరెడ్డి, తొలి ప్రయత్నమైన ఈ కథా కథనంలో మన కళ్ళముందు సమాజంలో, కుటుంబంలోని వ్యక్తుల జీవితాలలోని సంఘటనలు, వ్యక్తిత్వాలు సందేశాత్మకం గా రూపుదిద్దుకొంటాయి. రచయిత్రి, ఈ నవలా రచనలో సంపన్న కుటుంబానికి చెందిన ఒక గృహిణి తల్లి అయినా కూడా పతన దిశలో, ప్రియుడి వంచనకు గురి కావటం మరొక బిడ్డకు తల్లికావటం, కుష్ఠు వ్యాధితో మరణించటం ఆసక్తికరంగా చదివింప చేస్తారు. రచయిత్రి నవలను నడిపించిన తీరు తెన్నులలో జీవితంలో తెలిసి చేసిన పాపాలకు శిక్ష కూడా జీవితంలోనే అనుభవించవలసి రావటం స్పష్టమవుతుంది. అదే విధంగా కథానాయిక నందిని మొదటి భర్తకు పుట్టిన బిందు, రెండవ భర్తకు పుట్టిన బాబి పిల్లల జీవితాలు ఆదర్శవంతంగా సుఖాంతం చేసారు. చదువు, అందచందాలకు తోడు సత్శీలం అవసరమని ఐశ్వర్యవంతులైన సద్గుణవంతులు సామాజికంగా సేవలందించాలని రచయిత్రి సూచిస్తారు. నందిని జీవన గమ్యంలో తప్పటడుగులు వేసినా మిగిలిన పాత్రలు ఆమెపట్ల సానుభూతి, ప్రేమ చూపిస్తాయి. నందిని చుట్టూ కథ చివరి వరకు అన్ని పాత్రలు తిరుగుతాయి. నందిని భర్తలు, యిద్దరిలో తొలిభర్త మహేష్, ఆమె స్మృతి చిహ్నంగా లెప్రసీ హోమ్ కట్టించడం సన్మార్గంలో సేవలందించటం, వంచకుడైన మరొక భర్త రాహుల్ పశ్చాత్తాపంతో సంస్కారవంతుడు కావటం కుటుంబ సంతోషాల కథనంగా నడుస్తుంది. నందిని తొలి పుటలలో మహేష్ జీవితంలోకి అడుగు పెట్టిన 18 సంవత్సరాల తరువాత కుష్ఠువ్యాధితో రావటం ఫ్లాష్‌బ్యాక్‌గా నవల సాగుతుంది. నవల పూర్తి అయిన తరువాత అనుబంధంలో వార్తా పత్రికల సౌజన్యంతో, నవలలో ప్రస్తావించిబడిన కుష్ఠు పిల్లలు, మాదక ద్రవ్యాలు, ఎయిడ్స్, వైద్య విద్య అంశాలు ప్రచురిం పచేయటం నవలపై అభిప్రాయాలు, కుటుంబ సభ్యుల ఫోటోలు నవలకు నిండు చేకూర్చాయి. రచయిత్రి శ్రీమతి గంగపట్నం దేవకిరెడ్డి 30 సంవత్సరాల క్రితమే తన మదిలో మెదిలిన భావాలకు, సామాజిక స్పృహతో ఒక నవలగా రూపకల్పన చేయటం అభినందనీయం.

ప్రతులకు: శ్రీమతి గంగపట్నం దేవకి రెడ్డి
ఇ.నెం. 1052, రోడ్ నెం. 52
జూబ్లీహిల్స్,
హైదరాబాద్-500 033

-జయసూర్య
సెల్: 9440664610

## భయం

ఈ రాత్రి గడిస్తే చాలు
తెల్లకోటు మాటలు
లీలగా వినబడ్తున్నాయి
గది నిండా చక్కటి నిశ్శబ్దం
చీకటిని చీలుస్తు
నిట్టూర్పుల కన్నీళ్ళు
మెల్లగా నిష్క్రమిస్తున్న
బంధువుల పాదాలు
నిశ్శబ్దాన్ని తూట్లు పొడుస్తున్నాయి
నాకు ఒంటరితనం కావాలి
మృత్యువుతో సంభాషించి
అందరూ కదిలారు
ఆమె తప్ప!
నిజానికి నాకే జబ్బులేదు
మృత్యువంటేనే భయం
మృత్యు కుహరంలోకి లాక్కెళ్ళే
వృద్ధాప్యమంటేనే మరీ భయం
ఏ అర్ధరాత్రి కబళిస్తుందో
నిశ్శబ్దంగా వెళ్ళిపోతానని
ఒకటే భయం
ఆమే స్పర్శ నాకు తెలుస్తోంది
చేతి వేళ్ళు
నా నుదురును రాస్తు
బుగ్గలను సున్నితంగా నిమురుతు
బట్టతలను సుతారంగా తడుముతు
గుండె మీద
బుగ్గలను ఆనించి
హాయిని నాలోకి ఒంపుతోంది
ఆమే అధరాల పరిమళం
ముక్కుపుటల్లోకి
ప్రాణ వాయువు తొడిపోస్తోంది
అలా.. అలా
నిద్రాదేవి ఒడిలోకి నేను
నిద్ర కూడా చావులాంటిదే
దీనికి కలలు పూయవు
అంతే తేడా!
ఒళ్ళు విరుచుకున్న సూర్యుడు
ఛెళ్ళున చెంప చరిచాడు
'రాత్రి గడిచిందోయ్"
అరుస్తున్న నన్ను
గట్టిగా అదుముకుని
కలవచ్చిందా! అంటూ
గోముగా చుట్టేసుకుంది ఆమె!!

- రమణ వెలమకన్ని
సెల్: 9704158488

## మారని మనిషి తలరాత

అర్థము లేని అర్థము కాని
పిచ్చిరాతలు కాదు కవిత్వం
జాతిని చైతన్యం చేయాలి
సంఘటిత శక్తి కావాలి
జాతి పోరాటంగా నిలవాలి
ఆకలి మంటలు
దారిద్రపు రేఖలు
సమ్మెట దెబ్బలు
అబద్ధాల శ్వాస
అనర్థపు ఘోష
మనుగడ కోసం ఆరాటం
తరాలు మారినా మారని
మనిషి తలరాత
కవిత్వము కావాలి
మనిషి జీవితమే
ఒక ముగింపులేని కావ్యం!

- పసుమర్తి లలితా
నరశింగరావు
సెల్: 9849165152

## నవ్వుల నలుగు

నవ్వించడం ఒక కళ
నవ్వగల్గడం ఒక వరం.
నవ్వడం నేర్చుకుంటే
జీవితమంతా హాయి.
సంపూర్ణ ఆరోగ్యానికి నవ్వే
ఒక మహత్తర మాత్ర.
ఎన్నో బాధలకు ఉపశమనం
ఏ డెఫినెట్ పెయిన్ రిలీవర్!
భూగ్రహజీవులం
కష్టసుఖాల కడలిలో
తేలియాడే తరంగాలం
ఆటు పోటులకు వారసులం
వానకు తడుస్తాం
ఎండకు ఎండుతాం.
'నవ్వులపాలు' కాకుండా
జీవితమంతా
'నవ్వుల పాలు' పెంచుదాం!
నరకంలో నలుగుతున్న మనిషికి
నవ్వుల నలుగే శరణ్యం.

-ఆచార్య కడారు
వీరారెడ్డి
9392447007

## గాలిపటాలు

కడుపునింపే పాడికుండ మీద
ఇనుపచట్రాలు బిగుసుకున్నాయి
మెత్తని అమ్మ గర్భంలోకి కాంక్రీటు చువ్వలు
కత్తులలా దూసుకువెళ్ళాయి
విత్తు గుచ్చుకునే మెత్తని పరుపులు
బండరాళ్ళను కౌగిలించుకున్నాయి
మబ్బు నీటిని నమ్మి ముంతను దొర్లించి
భంగపడ్డ ధరణిసుతుడు బావురుమన్నాడు
రాజకీయ ఊబకాయ శరీరం మీద
కులపు రాచపుండు వ్రణం చిట్లి రసిక చిమ్మింది
మూర్ఖత్వపు వాహకం మనిషిని చంపింది
చరిత్రకోసం చేసిన దానం బ్రతుకునే
ప్రశ్నార్థకం చేసి వికటాట్టహాసం చేసింది
బంగరుభూములు బండరాళ్ళ గుట్టలై
పిచ్చుక పరిహారంతో పంచకు చేరాయి
పిడికెడు మెతుకులు పెట్టే పెద్దమనసు
రాజకీయ చదరంగంలో పావులా మారింది
మూడుకార్లు పండించే నేలబిడ్డడు
మూడుముక్కలాటలో ధర్మజుడయ్యాడు
అక్కునచేర్చుకోక అమ్మావని అమ్మే అలిగిందో
విసరికొట్టారని విత్తు ఉసురే తగిలిందో
పచ్చని బ్రతుకులు బుగ్గి పాలయ్యాయి
మట్టిని నమ్మిన మనుషుల జీవితాలు
తెగిన సంక్రాంతి గాలిపటాలైనాయి
నాయకుల భీష్మ ప్రతిజ్ఞల మధ్య
కృషీవలుడు నలిగిపోతున్నాడు
నమ్మకద్రోహంతో చితికి
చితిని పేర్చుకుంటున్నాడు.

**–శింగరాజు శ్రీనివాసరావు**
9052048706

## మెరుపులు

రేపగలు శ్రమిస్తే
రేపటికి పురోగతి
ఓపిక విశ్రమిస్తే
మాపటితో తిరోగతి

నిన్నటి గాయాలు
రేపటి పాఠాలు
రేపటి గేయాలు
నిన్నటి పాఠాలు

ఆశలకు కళ్లెంవేస్తే
అశాంతిని జయిస్తావు
ఆశయాలు ఫలిస్తే
శాశ్వతమై నిలుస్తావు

ఆడంబరాలతో కొలిస్తే
అందడు లొంగడు
ఆర్తితో పిలిస్తే
అందరి వశమవుతాడు

విజ్ఞాన యుగమిది
మేధస్సు వికసిస్తుంది
ఆధునిక యుగమిది
హృదయం సంకుచితమవుతున్నది

మనసు పొరలుగా
నకారాన్ని నింపుకుంది.
మాట తెరలుగా
సకారాన్ని ఒంపుతుంది.

ఆదర్శాల యందు
అమితమైన యావ
ఆచరణ యందు
శూన్యమైన చేవ

కరములు కలిపితే
చప్పట్ల వర్షం
కలములు కదిపితే
దుప్పట్ల వర్షం

చినుకులు కురిస్తే
పుడమి పరిమళభరితం
చెణుకులు విసిరితే
మనసు ఉత్సాహభరితం

రేయికి చోటివ్వాలని
పొద్దు వాలుతుంది
చిగురుకు చోటివ్వాలని
ఆకు రాలుతుంది

**–లలితాకృష్ణ**
సిద్దిపేట

## వీడని ఆశ

ఊపిరి ఉన్నంత వరకే
ఊహల వేగం
శక్తి ఉడిగే వరకే
సంపాదన పర్వం
ఆగితే శ్వాస
అంతమయ్యేను ఆశ
మట్టిలో కరిగిపోవును దేహం
గాలిలో కలిసిపోవును ప్రాణం
కాలే కడుపుకు
పచ్చడి మెతుకులె
పరమాన్నం
కమ్ముకు వచ్చే నిద్రకు
కటిక నేలే మెత్తని పానుపు
పొంచి ఉన్న మృత్యువు
తెలుపదు తన ఆగమనం
చిరకాలం మిగిలేను
మనిషిలోని మంచి గుణం

**– చలనం అరుణాశర్మ**
సెల్: 8374084741

## మధురవాణి

ఏ కులమని అడిగే జనులకు
ఏ కులమని చెప్పుద్దు లోకులకన్న
పలు కాకులకన్నఈ లోకాన
కులము కులమని పాకులాడే జనులకన్న

పేదల దొక్కలు ఎండి పోతున్నాయి
పేదల బతుకులు ఎండి పోతున్నాయి
ప్రభుత్వ పథకాలు అన్ని పెద్దోళ్ల
ఇండ్లకు చేరి బొజ్జలు నింపుతున్నాయి

అడవిలో అడవి పందుల బెడద
పట్టణంలో ఊర పందుల బెడద
ఇంటిలో పంది కొక్కుల బెడద
దేశంలోని ప్రజలకు ఊపిరాడని బెడద

ఎడ్లను మరచి యంత్రాలకు చేరి
ఎడ్లను దూరం చేయుట తగదన్న
ఎడ్లే మన వ్యవసాయానికి మూలమని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

యంత్రాలను మరచి ఎడ్లను చేరి
యంత్రాలకు దూరం అగుట తగదన్న
యంత్ర వ్యవసాయమే అధిక లాభదయకమని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

నవ్వుట మర్చి దుఃఖించుట నేర్చి
నవ్వుకు దూరం అగుట తగదన్న
నవ్వు ఆరోగ్యానికి పరమ ఔషదమని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

అయిన దానికి కాని దానికి
మనుషులు నవ్వుట మంచిది కాదన్న
నవ్వు నాలుగు విధాల చేటని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

**–జాధవ్ పుండలిక్ రావు**
9441333315

## రాజు!

వాడు–
చీకటిలోనే నడుస్తాడు
చీకటి పనులే చేస్తాడు ?
చీకటిలా వ్యాపిస్తాడు
చీకటి అంటే వాడే !
వాణ్ణి సంహరించే సూర్యుడు
వచ్చిపోతుంటాడు ?
అప్పుడు
ఆ కాస్సేపూ దాక్కుని
మళ్ళీ వాడే ఆక్రమిస్తాడు !
సమస్తాన్నీ సంపాదిస్తాడు
వాడి రహస్యాలు
ఎవ్వరికీ
తెలియవనుకుంటాడు
వాణ్ణి శాశ్వతంగా మట్టుబెట్టేవాడు
ఎక్కడా లేడనుకుంటాడు–
వాణ్ణి పుట్టకుండా చేసే శక్తి
లోకంలో నిజంగానే
ఎవ్వరికీ లేదు !
వాణ్ణిచూసి
అందరూ పారిపోతారు ?
వెలుగును వెతుక్కుంటూ పోతారు
కానీ
వాడి అంశలన్నీ
అన్నిలోకాల్లోనూ
వ్యాపించి
అప్రతిహతంగా
పురోగమిస్తున్నాయి–
కనుక ఎప్పటికీ లోకానికి వాడే రాజు !!

**– డా॥ చింతలనాటి మురళీకృష్ణ**
+61 431 368 156

## కట్లపాము

కనిపించని నిప్పు కణిక
కాల్చేసే అగ్నిశిఖ
దావానంలా వ్యాపించి,
దహియించే మాయలమారి
దొరకనంత వరకు దొరలా
డాబుకొడుతుంది..ఆపై
జీవితాన్ని "బలి" తీసుకొంటుంది
అవినీతి అది–జాతికి అంటుకున్న రోగమది
ఒకరి నుంచి మరొకరికి వ్యాపించి
మొత్తాన్ని మ్రింగే కలియుగ భూతమది
తర,తమ బేధాలు లేనిది
హద్దులు,సరిహద్దులులేని నిశాచరమది
నీతిని పాతరేసి గెల్వాలను కుంటుంది

ఎన్నిచట్టాలు చేసినా,ఎన్ని శాసనాలు చేసినా,
ప్రభుత్వాలెన్ని మారుతున్నా
అవినీతిపరుల ఆగడాలకు అంతంలేదు
నోట్లకట్లకు నోట్ ఫైల్సు,నోటిమాటలు మారిపోతుంటే
అవినీతిలేని రాజ్యం సాధ్యమేనా?
నీతిగా బ్రతకడము అసాధ్యమేనా?
అవినీతి లేని ప్రభుత్వము కావాలని కోరుకుందాం
కట్లపాము అవినీతి లేని నాయకులు
రావాలని ఆశిద్దాము

**–విశ్వనాథ నరసింహం**
9490971589

## నేటి దిశదశ

చూశారుగా....
దిశదశ!
ఇది సరియైందేనా?
పసిప్రాయం నుంచి
పండు ముదుసలి వరకు
రక్తం కలుషితమౌతోంది
ఎందుకిలా జరుగుతోంది?
చూస్తున్నారుగా...
దిశలదశలు...!
ఆరు బయట విహరించాల్సిన చోట
అ ఆ లు దిద్దాల్సిన చోట
జ్ఞానం ప్రవహించే చోట
అమ్మ గోరు ముద్దలు
తినిపించాల్సిన చోట
ఈ ఆర్త నాదాలెందుకు?
ఈ ఆర్తి ఖేదాలెందుకు?
అమ్మ కడుపులోంచి
అవనిమీద పడ్డ
పసిగుడ్డు ఏడుపుకు
అర్థం మారిపోయింది!
వద్దు మిత్రమా.. వద్దు
వద్దు తమ్ముడూ ...వద్దు
వద్దు పెద్దాయనా...వద్దు
మనం మనసున్న మనుష్యులం
చావున్న దేవుళ్ళం!
పవిత్ర భారతావని ...పుత్రులం
గాంధీ, పటేల్,
భగత్,సుభాష్,ఆజాద్ వంటి
మహనీయుల వారసులం...
వివేకానంద సోదరులం, శిష్యులం..
ఆదర్శఋషి అంబేద్కర్ అనుయాయులం..
అన్నా! ఆలోచించు
తమ్ముడూ మేల్కొను...
ప్రతిచోట మానవత్వం
ప్రభాతమై పరిమళించే పరిధవిల్లే
పవిత్రతను ఆశిద్దాం!
అదే అదే శ్వాసిద్దాం!
అదే భావితరాలకు అందిద్దాం!
అదుగో....
సూర్యుని కిరణాలు
మీ వాకిట్లోకి వాలాయి...
ఇకపై–
ముప్పన్నెల దైవత్వాన్ని
ఆస్వాదిద్దాం! పదండి!

**–డా.పింగళి గంగాధర్ రావు**
సెల్:9014101975.

## రెక్కలు

ఏసి గూళ్ళు
మన విమానాలు
ప్రకృతిబరిలో
పుష్పక విమానాలు
స్వేచ్ఛలో
స్థాయీబేధం

మైలు రాళ్ళకూ
మార్కులుంటాయి
అవి అంకెల్లో
గోచరిస్తాయి
నడకకవే
కొలమానాలు

బాటసారులు
మర్చిపోకుండా
అంకెలు నేర్పుతూ

మైలురాళ్ళు
నడకల
కొలమానాలు
తూములో
ప్రవాహంలా
ఊపిరి ఉనికి
బ్రతుకులో
ఆలోచన
నిత్యచేతన
తనువు
ముక్కలయినా
మెరుపులే
దాని నైజం
వజ్రానిది
చమ్మీవంశం



**– రఘుశ్రీ**
సెల్: 9247108893

## నన్నెందుకిలా?

నన్నెందుకిలా
మోసం చేస్తున్నారు మీరు?
ప్రాణ దీపాలు వెలిగించటం మాత్రమే
తెలుసు నాకు
నా పేరు చెప్పి
నిండు దీపాలార్పేస్తున్నారెందుకు?
నన్నింతగా బద్నాం చేస్తున్నారెందుచేత?

ఎంతటి ఘన చరిత్ర నాది
ఎంత సుకుమారమైన
ఎంత సంపద్వంతమైన
సున్నితత్వ గాయం నాది
నిత్యం కాలం బుగ్గ మీద
చెమ్మగిల్లే ఎన్ని తరాల గేయం నాది
నన్నెందుకలా వంచనకు గురిచేయటం

త్యాగపత్రాల మీద
చెరగని ప్రేమ సంతకం కదా నాది
పూలరెక్కల మీద ఎందుకలా
రక్త సంతకాలు చేస్తున్నారు

రెండు హృదయాల నూలు దారాల
పెనవేతను కదా నేను
రెండు ఊపిరి పోగుల
రంగుల కలనేతను కదా

నాకెందుకలా అపవాదు తెస్తున్నారు
నా ఉనికికిలా నెత్తుటి మరకలంటిస్తున్నారు

నేనేం ద్రోహం చేశాననీ
నేనేం పాపం చేసాననీ
నా పేరు మీద
ఇన్ని గొంతులు కోయబడటమా
ఇన్ని మొగ్గలు నేల రాలటమా
ఇన్ని యవ్వనపు సమాధులు
మొలవటమా

మెరుపుల చర్మపు లోతులు దాటి
ఎప్పుడయినా
నా హృదయం లోకి తేరిపార చూసారా?

ఎగిరే పక్షులకూ
విరిసే పువ్వులకూ
ఒక ఆశయముంటుందనీ
ఒక స్వేచ్ఛా రుతువుంటుందనీ
కనిపించే దేహం లోపల
ఒక ఆత్మగౌరవపు
ఆలోచనవుంటుందని
ఎప్పటికయినా
నాలోతుల్లో హృదయం పెట్టి
అవలోకించగలరా?

అతి సుకుమారమైన
అతి సుందరమయిన
అత్యంత ప్రేమాస్పదమయిన
ఒక గొప్ప ఉనికి నాది

నన్నేమిటిలా చిత్రవధ చేస్తున్నారు
అభాసుపాలు చేస్తున్నారు

రెండు చర్మాల రాపిడిలోంచి పుట్టే
నిప్పు రవ్వను కాదు
రెండు హృదయాల సంగమంలోంచి
విరబూసే అమృత వనాన్ని నేను
నాకు బతికించటమే చేతనవుతుంది
నన్ను నమ్మినవారిని కనుపాపలా
కంట్లో దాచుకోవటమే నాకు తెలుసు

ఎందుకిలా మోసం చేస్తున్నారు
నన్ను మీరు
నా పేరునెందుకిలా బద్నాం చేస్తున్నారు

చెట్లను నరికినట్లు
అందమైన కలల్ని నరకటం కాదు
చేతనయితే
మనుషులు మాయమవుతున్న
ఈ నేలను సారవంతం చేసి
మూల మూలలా
నన్నో మొక్కలా నాటండి

మానవులంతా పూలవనాల్లా
అల్లుకుపోయే చోట
నేను తప్పక కనిపిస్తాను
నా ఉనికి మనుషులకు
ప్రాణం పోయటమే కావాలి
నన్నర్థం చేసుకునే క్రమం మారాలి
నా పేరును దుర్వినియోగ పరిచే
తరం మారాలి
కానీనన్నెందుకిలా మోసం చేస్తున్నారు
మలినపరుస్తున్నారు మీరు?!

**– చిత్తలూరి**
8247432521

## పేపర్ బాయ్

తొలి కోడి కూయకముందే!
తొలి పొద్దు పొడవక ముందే!!
తెల తెల వారక ముందే
బాలభానుని నులివెచ్చని!!
లేత కిరణాలకు నిద్ర మేల్కొని!
నునూగుమీసాల పిల్లవాడు!!
పిల్లవాడిని సంరక్షించే
విధానము! బహుజాగ్రత్తగా
విశ్వవార్తలను! మోదుముతో మోసుకొని!
ఎండనకా వాననకా చలియనకా
వీధివీధిసైకిల్ పై! సంచారం చేస్తూ
గ్రామ సింహాల దాడిని ఎదుర్కొని
ఆత్మీయ అతిథిగా శుభోదయమే
పత్రికతో పలకరిస్తాడు!!
బాదరబంధీ లెన్నియున్నా!
బతుకు పోరాటం కోసము
తిమిరసంహారచేస్తూ!
జగతికి వెలుగులు వెలిగిస్తాడు!!
అతను పేపర్ బాయ్ కాదుసుమా
నలుదిశలా పరిమళసమాచార!!
విరులు పూయించే వార్తలవూదోట!!

**– మిట్టపల్లి పరశురాములు**

## ప్రేమించు

నేటి సమాజంలో జీవనయానం
నువ్వనుకున్నంత సంబరం
కానే కాదు,
ముళ్ళూ, రాళ్ళూ, ఎత్తుపల్లాల
కూటమే సమాజం నిండా
ముళ్లను గుచ్చుకొనక, రాళ్ళను తన్నుకొనక
ఎత్తుపల్లాలకు దొర్లుకొనక
సాగించు నీ పయనం.
ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడకు
దేహంలోని ముళ్ళు తీయవచ్చుగానీ
నీ మనసులోని ముల్లును తీయుట సాధ్యమా?
ఎవరికి వారే తొలగించుకోవాలి
సద్గుణాలు.. మనిషి వ్యక్తిత్వానికి ఆభరణాలు
దుర్గుణాలు.. మనిషి వ్యక్తిత్వానికి
దోషం ఆపాదించేవి
పెక్కుమందిలో అలరారే అసూయా
ద్వేషాలు అనే ముల్లు రెండు రకాలు
స్వశక్తితో అభివృద్ధి బాటలో నడిచినా
చూడలేని వారు కొందరు
అసూయ ద్వేషాలతో రగిలిపోతూ
విషయాన్ని కక్కుతారు మరికొందరు
పాముకు కోరల్లో ఉండే విషం
అసూయపరుల్లో అణువణువునా నింపి
విష వృక్షంలా కానవస్తారు.
అందుకే మనిషి నడవడానికే కాదు
జీవనయానంలో కూడా మంచి బాట
కావాలి
విషయానికి విరుగుడు సంజీవిని ఉన్నట్లే
అసూయాద్వేషాలకు విరుగుడు
ప్రేమ నాశ్రయించక తప్పదు.
ప్రేమను ప్రేమించు ప్రేమకై॥

**– రాయవరపు సరస్వతి**
సెల్: 7989665525

## విజేత

ఆత్మ స్థయిర్యం
బలంగా ఉండాలి
సంకల్పం
దృఢంగా ఉండాలి
బ్రతుకుపై
ఆశ ఉండాలి
కష్టం
ఇష్టమై ఉండాలి

విజేత కాగలడు
చరిత్ర సృష్టించగలడు
నిరంతర
సాధకుడై ఉండాలి
జీవితం
ఆదర్శం కావాలి
అలాంటి వ్యక్తే
మార్గదర్శి కాగలడు
అలాంటి మనిషే

**–కయ్యూరు బాలసుబ్రమణ్యం**
9441791239

## నిజదేశోభన...

(జనం కోసం, సమాజహితంకోసం, శ్రమైక జీవనపథాన సాగుతున్న శ్రామికదైవాలకు అంజలిఘటిస్తున్న శీర్షిక..)

### ఫలవిక్రేతలకు నతులు

**–దోరవేటి**
సెల్:9866251679

కం॥ ఇలలో నారోగ్యమ్ముల
నిలుపగ గలుగును ఫలములు నిశ్చయమిది ! ఆ
ఫలముల మనకందించెడి
ఫలవిక్రేతలకు నతులు పలుకగ వలయున్.

ఉ॥ తోటలకేగి రైతులు యథోచిత ద్రవ్యము నిచ్చి, పండ్లన
చ్చోటలనుండి పైలముగ జోకము గాకను దెచ్చి, ఉన్న యే
ర్పాటును బట్టి పైత్తినకో, బండ్లనో, సైకిలపైనకో చెట్టుకన్
పోటిగ దిర్చుచుందురిల పొట్టను నింపుకొనంగ విధులన్.

ఉ॥ తట్టనిండ పండ్లు తలకెత్తుకొని పోరి
వీధి వీధి తిరిగి పేరి పేరి
దినము మొత్త మిన్న కొనరించు శ్రమకును
కూలి దొరకెనో ప్రజ్ఞాళి నుండి ?

ఉ॥ రైతులు గట్టి చాటుధర రాక యు, మీకు సుఖమ్ము లేక, మ
చేతకు తన్నకూలియును చాక్కక, మధ్యనయున్న ఆ దళా
లీ తెగలాభమెందునట! రేయి బవళ్ళు శ్రమించు వారికం
టే తగులితి మంచన నటించెడి వాడికె లాభ మిద్దరన్.

కం॥ చేరము లాడెడి వారల
మీరల బడు శ్రమను నోటమెచ్చరు నిజమే!
ఏరోజైన పదార్థము
కొరని వరుందురిలను కొంచెపు నరులున్.

సు॥ రడదారి దురులదు యెండ నతి భారంబుగా నుల్లినో
నడనంబే ఒక రూపమెత్తిన విధిన్, సారించి మీ దృక్కులన్
ఉడుమత్తన్ గడపేరు పెత్తురును నీరై స్వేదమౌదాక చూ
రుడమున్ మించిన లీతి యాత్రికుల కోర్కుల్ దీర్చు పండ్లేయగా.

కం॥ పైత్తిన పండ్లను చెట్టక
నైత్తిమ బచ్చాండ్లయందు నేర్పు లెసగ గాం
డెత్తియు పేడుదురే ! రూ
పెత్తిన శ్రమజీవులార ! వత్తెద జూతన్ !

కం॥ తోపుడు బండ్లలా పండ్లను
మాపును పగలైన కష్టమనక దిరుగుచున్
చి పూట కూలి కమ్మెడు
మీ పొరటమది లెస్స మేదిని లోనన్ !

ఉ॥ వందలపేట పాటులలయందున చాయుచు కొత్త రోగముల్
అందుకొనంగనైన వెనుకాడరుగాని, యొకింత డబ్బు పం
డ్లందు వ్యయంబు సేయగ దలంచరు, తల్చిన గాని మిమ్ము బం
ట్లందు నుదార బుద్ధులను అగ్రట జూపరు ఈ జనంబులన్.

తే॥ అనువయిన రీతిగా రసాయనము లెక్కి
పక్వమొందించి, కాయల పండ్లు జేసి
వర్తకము సేయుదు రనెడి వార్త దెలుసె
సఫల క్రేతలార ! పాపఫలమేల ?

ఉ॥ వచ్చిన వారు మీదరికి వారల పేదల, నొప్పులైనయున్,
మెచ్చెడి వారలైనయును, మేలొనరించెడి వారలైనయున్,
ముచ్చటలైన నేమి మరి మూర్ఖులనైనను న్యాయబుద్ధితో
యిచ్చిన మంచి పండ్లు నవి యిచ్చును వారికి మీకు శ్రేయమున్.

తే॥ పాడయిన పండ్లనైనను, పక్వమింత
లేని పండ్లైన శుద్ధత లేనైన
అంటగట్టగ బూళుడో అక్రమమున
మచ్చయౌ మీకు శ్రమ చందమామలార !

-చం॥ నిలువని దేహమున్ పరిగ నిల్పుట యందు సహాయకారులై
నిలచెడి పండ్లు నమ్మికొను నిర్జర రూపులు మీరు ! దేశమున్
అలసటేక, లాభమున అల్పమటంచు దలంచబోక నీ
పరహితమైన కార్యమును చాయక దిర్చుటలాచు మ్రైక్కెదనే !

## సుగుణ సాహితి సమితి సిద్ధిపేట

### ఉగాది బాలల కథల పోటీ ఫలితాలు

బాలలలో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి సిద్దిపేట జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు కథల పోటీ నిర్వహించాలనే మా ప్రయత్నానికి మంచి స్పందన లభించింది. ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరికి అభినందనలు..., న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ప్రముఖ రచయిత్రి, బాలసాహితీవేత్త **డా॥ సిరి** గారికి ప్రత్యేక ధన్యవాదములు.

**బహుమతి పొందిన కథల వివరాలు :**

**ప్రథమ బహుమతి (1500/- నగదు) :**
వ్యసనాలు మానాలి - వై. అంజలి (జి.ప.ఉ.పా. కుకునూర్‌పల్లి)

**ద్వితీయ బహుమతి (1000/- నగదు) :**
రైతు కష్టాలు - బి. వినీత (జి.ప.ఉ.పా. ముస్త్యాల)

**తృతీయ బహుమతులు (500/- నగదు) :**
1) అన్నదమ్ముల జీవితం - బి. నవీన్ (జి.ప.ఉ.పా. ఇందిరానగర్)
2) చెట్లు చేసే మేలు - టి. భాను (జి.ప.ఉ.పా. నర్సాయపల్లి)

**ప్రోత్సాహక బహుమతులు (300/- నగదు) :**
1) చదువును మించిన సంపద లేదు - బి. మాధవి (జి.ప.ఉ.పా. కొండపాక.బాలికలు)
2) తల్లి ఋణం - యం. హారిక (జి.ప.ఉ.పా. నర్సాయపల్లి)
3) కష్టంలోనే సుఖం - యం. ప్రణయ్ (జి.ప.ఉ.పా. నర్సాయపల్లి)
4) నాన్న ప్రేరణ - ఎల్. భవాని (జి.ప.ఉ.పా. వర్గల్)
5) అమ్మ ప్రేమ - పి. నవ్య (జి.ప.ఉ.పా. వర్గల్)
6) నాన్నకు ప్రేమతో - జి. త్రిష (జి.ప.ఉ.పా. ఇందిరానగర్)
7) మనిషి విలువ - యం. ప్రసన్న (జి.ప.ఉ.పా. జక్కాపూర్)
8) తల్లిదండ్రుల బాధ్యత - ఎస్. స్రవంతి (జి.ప.ఉ.పా. కుకునూర్‌పల్లి)
9) పక్షులు చేసే మేలు - టి. అశ్విని (జి.ప.ఉ.పా. కొండపాక.బాలికలు)

బహుమతి పొందిన కథలు అక్షరసేద్యం బాలసాహిత్య త్రైమాసిక పత్రికలో వరుసగా ప్రచురించబడును.

బహుమతి ప్రదాత : **ఆచార్య మర్పడగ చెన్నకృష్ణారెడ్డి**
ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు

అధ్యక్షులు : **మొసర్ల మాధవరెడ్డి**
సుగుణ సాహితి సమితి

కన్వీనర్ : **బైతి దుర్గయ్య**
సుగుణ సాహితి సమితి 9959007914




పుస్తకం: గండికోట రహస్యం
రచయిత: అలపర్తి పిచ్చయ్యచౌదరి
ప్రతులకు: 42/169, జయనగర్‌కాలనీ
కడప-516 002.
వై.యస్.ఆర్. జిల్లా
సెల్: 9177013845




పుస్తకం: విశ్వ విహారం (యాత్రా కవితలు)
రచయిత: దేవీప్రసాద్ జువ్వాడి
ప్రతులకు:నవోదయ బుక్ హౌస్
కాచిగూడ, హైదరాబాద్ మరియు
అన్ని పుస్తక విక్రేయాలలో.




పుస్తకం: విజయరాఘవ (శతకం)
రచయిత: గోవర్ధనం రాఘవాచార్యులు
ప్రతులకు:వనస్థలిపురం
హైదరాబాద్.
సెల్: 9490043096




పుస్తకం: మాతృభాష మహాత్ముడి బాట
రచయిత: డా॥జి.వి. పూర్ణచందు
ప్రతులకు:ప్రపంచ తెలుగు రచయితల
సంఘం, సత్నాం టవర్స్, 1వ అంతస్తు
రాజగోపాలాచారి వీధి, గవర్నర్‌పేట
విజయవాడ-520 002




పుస్తకం: నీతి సుధాలహరి
రచయిత: కోట శ్రీరామమూర్తి
ప్రతులకు:సరస్వతి నగర్
నెల్లూరు-524 002. ఆంధ్ర.
సెల్: 9397878247




పుస్తకం:బాల భావన
రచయిత: చింతా రామకృష్ణారావు
ప్రతులకు:అనంతక్రిష్ణ. ప్లాట్ నెం.80
శ్రీసాయి నగర్, రోడ్.నెం.4,
సాయిబాబా టెంపుల్, నాగోల్ పో॥
హైదరాబాద్-500 068.
సెల్: 9246531895

పుస్తకం:ప్రసన్న రాఘవ శతకం
రచయిత: డా॥నలవోలు నరసింహారెడ్డి
ప్రతులకు:తెలుగు సాహితీ పీఠము
ఇ.నెం.9-9-144, ప్లాట్‌నెం. 39
రెడ్డికాలని, చంపాపేట్,
మం॥ సరూర్‌నగర్, రంగారెడ్డి జి॥
హైద్రాబాద్-500 059
సెల్: 9848898515




పుస్తకం:అరుణోదయము
రచయిత: డా॥ నలవోలు నరసింహారెడ్డి
ప్రతులకు:తెలుగు సాహితీ పీఠము
ఇ.నెం.9-9-144, ప్లాట్‌నెం. 39
రెడ్డికాలని, చంపాపేట్,
మం॥ సరూర్‌నగర్, రంగారెడ్డి జి॥
హైద్రాబాద్-500 059
సెల్: 9848898515

# సామాజిక చైతన్యంతో కవుల పాత్ర కీలకం-డాక్టర్ నాళేశ్వరం శంకరం.

సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకమని ప్రముఖ కవి,తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు.ఆదివారం నాడు స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఉదయ సాహితీ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ అడిగొప్పుల సదయ్య రచించిన "ఇష్టపది-2",నాగమల్ల పున్నం చందర్ రచించిన "పున్నం మాట" దోమల జనార్ధన్ రచించిన"ఇష్ట పదులు" గ్రంథాల ఆవిష్కరణ సభకు హాజరై మాట్లాడుతూ "ప్రక్రియ ఏదైనా అందులో కవిత్వాన్ని పండించినట్లయితే పాఠకులు ఆదరిస్తారని, అది ప్రక్రియగా నిలువ గలుగుతుందని అన్నారు.సమాజ హితం కోరుతూ ముగ్గురు కవులు వెలువరించిన మూడు గ్రంథాలు మంచి సందేశాలను అందించాయని పేర్కొన్నారు. హృదయాలను కదిలించే విధంగా ప్రస్తుత అవసరాలను గుర్తించి కవులు తమ కవితా వస్తువులను ఎంపిక చేసుకోవాలని కోరారు.ముగ్గురు కవులు సమాజహితం కోరుతూ రచనలను చేశారన్నారు".ఉదయసాహితి అధ్యక్షులు డా.వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇష్టపది-2 పుస్తకాన్ని శ్రీమతి నామని సుజనాదేవి, పున్నంమాట పుస్తకాన్ని జి.వి.కృష్ణమూర్తి,ఇష్టపదులు పుస్తకాన్ని శ్రీమతి తోట నిర్మలారాణి పరిచయం చేశారు.విశిష్ట అతిథులుగా పాల్గొన్నప్రముఖ కవి విమర్శకులు దాస్యం సేనాధిపతి, గౌరవ అతిథులుగా డా.కలువకుంట రామకృష్ణ,నంది శ్రీనివాస్ లు గ్రంధకర్తలను అభినందించారు.

ఈ కార్యక్రమంలో అనుముల దయాకర్, బొమ్మకంటి కిషన్,వెల్ముల జయపాల్ రెడ్డి, గుండు రమణయ్య,అక్కిరెడ్డి బాల్ రెడ్డి,పుల్లూరి చంద్రశేఖర్,దొమ్మటి శంకర్ ప్రసాద్,చతొడువునూరి లక్ష్మీనారాయణ, పెనుగొండ బసవేశ్వర్,విజయలక్ష్మి,విజయశ్రీ, శ్యాంసుందర్,జయప్రదగౌతమి,టి.వెంకటరమణ,బి.కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్చి 9న శ్రీ త్యాగరాయ గానసభలో జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని నవరత్న మహిళాపురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా డా॥పాలకుర్తి మధుసూదనరావు పురస్కార ప్రదానం కావించారు. బాబిలహరి, అల్పనాచౌదరి, పి.అపర్ణ, డా॥ఈడుపుగంటి తాన్యాచౌదరి, రేణుకాప్రభాకర్, రూపకల్పన, పి.హైమాజ్ఞానేశ్వరి, మాధవీ శ్రీనివాస్ నందిమళ్ళ పురస్కారాలు స్వీకరించారు. చిత్రంలో వి.వి. రాఘవరెడ్డి, గుదిబండి వెంకటరెడ్డి, డా॥అరుణ, లక్ష్మీశ్రీనివాస్, వీరభోగవసం తరాయలు, డా॥చిల్లా రాజశేఖర్‌రెడ్డి, యన్.అరుణజ్యోతి, భారతి, నిడవర్తి నిర్మల తదితరులు.

# స్వీయ నిర్బంధమే ప్రథమ చికిత్స

హైదరాబాద్, మార్చి 18ఫ్రపంచవ్యాప్తంగా కరోనా కలకలం కొనసాగుతూనే ఉంది. దాని విజృంభణ ఇప్పట్లో సాధ్యమవుతుందా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కరోనాకు ఇప్పటి వరకు మందులు లేదా టీకాలు కనుక్కోలేదు. ఈ దశలో వ్యాధి నిరోధకం ద్వారా దాన్ని ఆదుపు చేస్తూ..మహమ్మారి బారిన పడ్డవారిని రక్షించేందుకు వైద్యులు కృషి చేస్తున్నారు. భారత్‌లో కరోనా మృతులు ముగ్గురే అయినా వ్యాధి బారిన పడ్డవారిని రక్షించడంలో వైద్యుల కృషి ఫలిస్తోంది. అయితే ఇటలీలో విచ్చలవిడితనం.. తమకేంటి అన్న పెడధోరణి కారణంగా అక్కడ భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. భారత్ అలా ఆకుండా ఇతర దేశాలకన్నా వేగంగా స్పందించి కఠిన చర్యల కు ఉపక్రమించడంతో దాని తీవ్రత అంతగా లేదు. ఇకపోతే సోషల్ మీడియా ప్రజలను మరీ భయపెడుతోంది.ఎవరికి వారు తమకు తోచిన వైద్య సలహాలు ఇస్తూ ..ప్రజలను గందరగోళంలో పడేస్తున్నారు. ఇది ఎంతమాత్రం మంచిది కాదు. కరోనా సోకకముందే మందులు వాడడం మరీ మంచిది కాదు. ఎవరికి వారు హోమియో పేరుతో మందులు పంపిణీ చేస్తున్నారు. అలాగే అల్లం, వెల్లులు, పసుపు అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ ఆరోగ్యం కోసమే తప్ప కరోనా నివారణ మందులు కావని గుర్తుంచుకోవాలి. కొందరు తాగుబోతులు ఏకంగా మందు తాగితే మంచిదంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఇది కూడా మంచిది కాదు. అలాగేసోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు..మతిలేని వైద్య సలహాలపై నిఘా పెట్టాల్సి ఉంది. వాటిని ప్రజలు కూడా తిరస్కరించాలి. లేకుంటే అనవసర బాధలకు గురికాక తప్పదు. ఇకపోతే ప్రస్తుతం ప్రపంచాన్ని కుదిపేస్తున్న కరోనా వైరస్ సంక్షోభం ఎంతకాలం వరకూ కొనసాగే అవకాశం వుందన్నది ఇప్పుడే చెప్పలేం అని వైద్యులే అంటున్నారు. ఈ వైరస్ మహమ్మారి ప్రభావాన్ని తప్పించుకునేందుకు ప్రజలు తమను తాము గృహనిర్బంధం చేసుకునేందుకు సిద్ధమవుతున్న తీరు అభినందనీయం. అంటే ప్రజలు ఎక్కడికి పోకుండా ..బహిరంగ ప్రదేశాలతో సంబంధం లేకుండా గడపాలని అనుకుంటున్నారు. వైద్యులు కూడా ఇదే సూచిస్తున్నారు. స్వయం నిర్బంధం కారణంగా వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉంటుంది. విదేశాల నుంచి వచ్చే వారితో సన్నిహితంగా ఉండకుండా ఉండడమే మంచిది. ఇలా చేసే క్రమంలో భారత ప్రభుత్వం ఇప్పటికే కఠిన చర్యలు తీసుకుంటోంది. జనసంచారంపై ఆంక్షలు విధిస్తే వ్యాధి వ్యాప్తి జరగదు. తద్వారా త్వరగా దానిని అదుపు చేసే అవకావం ఉంటుంది. ఇటలీలో కరోనా వైరస్ తొలి దశలో ప్రజలు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అక్కడ తీవ్రంగా ప్రబలి మరణాల సంఖ్య పెరుగుతోంది. కొత్తగా రోజూ వందల కేసులు నమోదు అవుతున్నాయి. ఇటలీ,ఫ్రాన్స్, జర్మనీ, ఇరాన్‌లలో వ్యాధి తీవ్రంగా ఉంది. అక్కడ కంట్రోల్ చేసేందుకు వైద్యులు కూడా సరిపోవడం లేదు. పాక్‌లోని మొత్తం విద్యాసంస్థలన్నింటినీ మూసివేశారు .సిబ్బందిని విధులకు హాజరు కావద్దని చెప్పారు. కరోనా వ్యాప్తిని కట్టడి చేసేందుకు ఫ్రాన్స్‌లో ప్రభుత్వం స్వీయ నిర్బంధం ప్రకటించింది. తదుపరి ఉత్తర్వులుజారీ చేసే వరకూ ప్రజలెవరూ ఇళ్ల నుండి బయటకు రావద్దని, అత్యవసర ప్రయాణాలను మాత్రమే అనుమతిస్తామని, ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిని శిక్షిస్తామని అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఆదేశాలు జారీ చేసారు. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న మహమ్మారి కోవిడ్-19 చైనాలో తగ్గుముఖం పట్టగా ఇటలీ, ఇరాన్‌లలో మృత్యు ఘంటిక మోగిస్తోంది. ఒక్కరోజే ఇటలీలో రికార్డు స్థాయిలో 250 మంది కరోనా మరణాలు సంభవించాయని అధికారులు తెలిపారు. ఇరాన్‌లోనూ శుక్రవారం ఒక్కరోజే సుమారు 97 మంది బలయ్యారు. దీంతో ఇప్పటివరకూ ఈ వ్యాధి కారణంగా మరణించిన వారి సంఖ్య 611కు చేరుకుందని, 12,729 మంది వ్యాధి బారిన పడ్డారని ఇరాన్ అధికార టెలివిజన్ ఛానెల్ ప్రకటించింది. కాగా, చైనాలో మరణాలు గణనీయంగా తగ్గిపోయాయి. అందుకే ఈ వైరస్ నానాటికీ వేగంగా విస్తరిస్తుండటంతో దీనిని అడ్డుకునేందుకు ప్రభుత్వం పర్యాటక ఆంక్షలు, స్కూళ్లు, రెస్టారెంట్లు, బార్‌ల మూసివేత, వినోద కార్యక్రమాల రద్దు వంటి చర్యలు చేపట్టింది. ఈపని కూడా చేయలేక పోతే మనం కరోనా వైరస్ మరణాలను తక్కువ స్థాయికి తేలేం.. కానీ ఇతర దేశాల అనుభవాలను గమనిస్తే కరోనా కేసుల సంఖ్య రానున్న వారాల్లో గణనీయంగా పెరిగే అవకాశం వుందని అంటున్నారు. త్వరగా నివారణ జరగాలంటే ప్రజలు ఒకరికొకరు దూరంగా వుండాలని, సామాజిక కార్యక్రమాలు నివారించు కోవాలని, పెళ్లిళ్లు, ఫంక్షన్లు తదితర కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనరా దని,పదిమంది కన్నా ఎక్కువ ఒక చోట చేరవద్దని వైద్య విభాగం సూచించింది. ఈ సూచనలు ప్రతి ఒక్కరూ పాటిస్తే మనం ఈ వైరస్‌ను తప్పకుండా అదుపులో ఉంచగలమని చెప్పారు. వైరస్ బెడద తొలగిన తరువాత కావాలంటే కలిసి పండగ చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే లక్షల మందికి పైగా ప్రజలను ఇళ్లలోనేవుండాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా హోటళ్లు, బార్‌లు, సినిమాహాళ్లు మూతపడ్డాయి. కరోనా వైరస్ బెడదను అడ్డుకునేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలన్నింటికీ మద్దతుగా నిలిచేందుకు తాము సిద్ధంగా వున్నామని వివిధ ప్రభుత్వ శాఖలు,ప్రైవేట్ సంస్థలు ప్రకటించాయి. మొత్తంగా స్వీయ నిర్బంధం మాత్రమే ఇప్పుడు ప్రథమ చికిత్సగా గుర్తించాలి. ఎవరికి వారు ముఖ్యంగా దగ్గు,జలుబు ఉన్నటువంటి వారు స్వీయ నిర్బంధంలో ఉండడం మంచిది. గాలికి తిరుగుతూ మాకే కాదులే అన్న ధోరణి వీడాలి. అప్పుడే మనం వ్యాధికి దూరంగా ఉండగలం.


రంజని,
తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్ 500004

ఆంధ్ర ప్రభ సౌజన్యంతో
రంజని- నందివాడ భీమారావు కథానికల పోటీ 2019
ఫలితాల ప్రకటన

మంచికథ, నచ్చిన కథ, కథారంజని, వంటి సంకలనాలతో కథాసాహిత్యాన్ని పరిపుష్టం చేసిన 'రంజని' తెలుగు సాహితి సమితి చాల కాలంగా రంజని- **నందివాడ భీమారావు** కథానికల పోటీలను నిర్వహిస్తోంది. పూర్వ అకౌంటెంట్ జనరల్ , సాహితీవేత్త శ్రీ **నందివాడ భీమారావు** IA & AS గారి సౌజన్యంతో ఈపోటీలు నిర్వహించడం జరుగుతోంది

ఈ కథానిక పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న రచయితలందరికి రంజని పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నది. . ఈ పోటీకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ప్రముఖ రచయిత శ్రీ పి ఎస్ నారాయణ గారికి రంజని కృతజ్ఞతలు తెలుపుకుంటున్నది.

పోటీ ఫలితాలు ఈ రకంగా ఉన్నాయి.

మొదటి బహుమతి (4,000) : "పసివాడి చదువు " - శ్రీ దుర్గం చైతు, సిద్దిపేట
రెండవ బహుమతి (3,000) : "ఉత్తరం" - డా.లక్ష్మీ రాఘవ ,చిత్తూరు జిల్లా
మూడవ బహుమతి (2,000) : "అమ్మచెప్పింది" - పి వి శేషు రత్నం , విశాఖపట్నం
నాల్గవ బహుమతి (1,000) : "స్థిరాస్తి" - బులుసు సరోజినీదేవి, విశాఖపట్నం

ఏ జి ఆఫీస్ లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ విజేతలకు బహుమతులు అందచేయబడతాయి. ఆ వివరాలు త్వరలో అందచేస్తాము.

మట్టిగుంట వెంకట రమణ
ప్రధాన కార్యదర్శి
8374822255


# ప్రపంచ వ్యాప్తంగా ఆగని కరోనా విజృంభణ

**ఇప్పటివరకూ 1,83,579 పాజిటివ్ కేసులు నమోదు**

**7,400 మందికి పైగా మరణించినట్లు ప్రకటన**

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): వేగంగా విస్తరిస్తున్న కరోనా వైరస్ పలు దేశాలను వణికిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకూ 1,83,579 పాజిటివ్ కేసులు నమోదవగా 7,400 మందికి పైగా మరణించారు. పాకిస్తాన్‌లో 212 కేసులు నమోదు కాగా బుధవారం తొలి మరణం నమోదైంది. వైరస్ వేగంగా విస్తరిస్తున్న ఇరాన్‌లో కరోనా కేసుల సంఖ్య 988కి పెరగ్గా 135 మంది మరణించారు. స్పెయిన్‌లో తాజాగా 2000 కొత్త కేసులు నమోదవగా మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య ఏకంగా 11,000కు ఎగబాకింది. మరోవైపు కరోనా వైరస్ వ్యాప్తిని పర్యవేక్షిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓలో ఇద్దరు ఉద్యోగులకు కరోనా పాజిటివ్ రిపోర్ట్స్ వచ్చాయని అధికారులు ధ్రువీకరించారు. ఇక వైరస్‌కు కేంద్రమైన చైనాలో 80,881 కేసులు నమోదవగా మిగిలిన దేశాల్లో 94,000 కేసులు నమోదయ్యాయి. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే క్రమంలో ఫిజర్, బయోఎన్‌టీ సంస్థలు సంయుక్తంగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయనున్నాయి. డెడ్లీ వైరస్ వ్యాప్తితో ముందుజాగ్రత్త చర్యగా యూరో 2020 సాకర్ టోర్నమెంట్‌ను ఏడాది పాటు వాయిదా వేయగా, టీ-20 వరల్డ్‌కప్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది. పాకిస్తాన్‌లో తాజాగా మరికొన్ని కరోనా కేసులు నమోదు కావటంతో ఇప్పటి వరకూ ఈ ఇన్ఫెక్షన్ బారిన పడిన వారి సంఖ్య 212కు చేరినట్లు అధికారులు చెప్పారు. ఇందులో అత్యధికంగా సింధ్ ప్రావిన్స్‌లో 155 కేసులు, ఖైబర్ ఫక్తూన్వాలో 15, బెలూచిస్తాన్‌లో 10, గిల్గిట్-బాల్టిస్తాన్‌లో 5, ఇస్లామాబాద్‌లో 2 పంజాబ్‌లో 1 నమోదయినట్లు అధికారులు వివరించారు. కరోనా వైరస్ వ్యాప్తి ప్రభావంతో అక్కడ విద్యాసంస్థలను మూసేశారు. గడచిన 24 గంటల వ్యవధిలో కరోనా ఇన్ఫెక్షన్‌కు సంబంధించి 21 మరణాలు, 1,210 తాజా కేసులు నమోదు కావటంతో ఫ్రాన్స్ ప్రభుత్వం జాతీయ ఆరోగ్య ఎమర్జెన్సీ ప్రకటించింది. తాజా మరణాలతో ఫ్రాన్స్‌లో కరోనా మృతుల సంఖ్య 148కి చేరింది. ఈ నేపథ్యంలో ప్రజల కదలికలకుసంబంధించి జారీచేసిన తాజా ఆదేశాలు కనీసం రెండు వారాల పాటు అమలులో వుంటాయని అధ్యక్షుడు స్పష్టం చేశారు. ఈ వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ఐరోపా దేశాల కూటమి సభ్యదేశాలు తమ సరిహద్దులను మంగళవారం నుండి నెలరోజుల పాటు మూసివేస్తున్నాయని, స్వదేశానికి తిరిగి వచ్చేందుకు మాత్రమే అనుమతులుంటాయని మాక్రాన్ చెప్పారు. ప్రస్తుతం ప్రపంచాన్ని కుదిపేస్తున్న కరోనా వైరస్ సంక్షోభం వచ్చే ఆగస్టు వరకూ కొనసాగే అవకాశం వుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంచనా వేశారు. ఈ వైరస్ మహమ్మారి ప్రభావాన్ని తప్పించుకునేందుకు అమెరికా ప్రజలు తమను తాము గృహనిర్బంధం చేసుకునేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం నాటికి అమెరికా దేశవ్యాప్తంగా కరోనా ఇన్ఫెక్షన్ కేసులు 4,500కు పైగా నమోదు కాగా, 85 మంది మృత్యువాత పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ వైరస్ నానాటికీ వేగంగా విస్తరిస్తుండటంతో దీనిని అడ్డుకునేందుకు ప్రభుత్వం పర్యాటక ఆంక్షలు, స్కూళ్లు, రెస్టారెంట్లు, బార్‌ల మూసివేత, వినోద కార్యక్రమాల రద్దు వంటి చర్యలు చేపట్టింది. మంగళవారం ఆయన వైట్‌హౌస్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 'ఈ మంచి పని కూడా చేయలేకపోతే మనం కరోనా వైరస్ మరణాలను తక్కువ స్థాయికి తేలేం.. కానీ ప్రజలు మాత్రం జులై, ఆగస్టు గురించి మాట్లాడుతున్నారు. ఆ సమయానికి కరోనా బెడద తొలగిపోతుందని భావిస్తున్నాన'ని అన్నారు. ఇతర దేశాల అనుభవాలను గమనిస్తే కరోనా కేసుల సంఖ్య రానున్న వారాల్లో గణనీయంగా పెరిగే అవకాశం వుందని ఆయన చెప్పారు. ఇదిలా వుండగా కరోనా వైరస్ బెడద నుండి తప్పించు కునేందుకు వైట్‌హౌస్ అమెరికన్ ప్రజలకు సోమవారం నాడు తాజా మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజలు ఒకరికొకరు దూరంగా వుండాలని, సామాజిక కార్యక్రమాలు నివారించు కోవాలని, పది మంది కన్నా ఎక్కువ ఒక చోట చేరవద్దని సూచించింది. ఈ సూచనలు ప్రతి ఒక్కరూ పాటిస్తే మనం ఈ వైరస్‌ను తప్పకుండా ఓడించగలమని ట్రంప్ చెప్పారు. వైరస్ బెడద తొలగిన తరువాత మనందరం కలిసి విజయోత్సవాలు జరుపుకోవచ్చన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియాలోని సిలికాన్ వాలీ ప్రాంతాలలో వుంటున్న అరవై లక్షల మందికి పైగా ప్రజలను ఇళ్లలోనేవుండాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా హోటళ్లు, బార్‌లు, సినిమాహాళ్లు మూతపడ్డాయి. కరోనా వైరస్ బెడదను అడ్డుకునేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలన్నింటికీ మద్దతుగా నిలిచేందుకు తాము సిద్ధంగా వున్నామని అమెరికా రక్షణశాఖ పెంటగాన్ ప్రకటించింది.

# సమ సమాజ స్వాప్నికుడు రెంటాల

**రెంటాల గోపాలకృష్ణ శత జయంతి సభలో డా. రెంటాల జయదేవ్**

సమ సమాజ స్వాప్నికుడు, అభ్యుదయ కవి రెంటాల గోపాలకృష్ణ అని రెంటాల గోపాలకృష్ణ కుమారుడు, ప్రముఖ సాహితీవేత్త, ప్రముఖ పాత్రికేయులు డా. రెంటాల జయదేవ్ (హైదరాబాద్) తెలియజేశారు. "అమరావతి సాహితీమిత్రులు" ఆదివారం ఉదయం నిర్వహించిన "రెంటాల గోపాలకృష్ణ శత జయంతి సభ"లో అయన విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కవిత, కథ, నాటిక, నాటకం, నవల, అనువాదం, బాల సాహిత్యం, చిత్ర రచన మొదలైన అనేక రంగాలలో రెంటాల కృషి మరువలేనిది అని ప్రసంసించారు.

అభ్యుదయ కవిగా శ్రీశ్రీ దారిలో పయనించిన కవిగా పేర్కొన్నారు. శబ్ద సౌందర్యంతో భావ సౌందర్యంతో రెంటాల కవిత్వం జన రంజకం, చైతన్య ప్రబోధకం, విప్లవ మార్గ దర్శనం అని వివరించారు. సంస్థ సంస్థాపకులు డా. రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ సర్పయాగం, సంఘర్షణ మొదలైన కవిత్వ సంపుటాలతో, అనేక నాటకాలతో అభ్యుదయ కవిత్వ ఉద్యమానికి విశేష రచనలు చేసారని కొనియాడారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డా. బీరం సుందరరావు మాట్లాడుతూ రెంటాల అక్షర తపస్విగా, అభ్యుదయ కవిత్వ నాయకుడిగా, ఉత్తమ పత్రికా సంపాదకుడిగా గణనీయ కృషి చేసారని సోదాహరణంగా తెలియజేసారు. సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న డా. రెంటాల జయదేవ్ ను సంస్థ పక్షాన డా. రావి రంగారావు, డా. టి. సేవకుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో అన్నాప్రగడ వెంకట నరసింహారావు, చివుకుల వెంకట చలపతి, చిటిప్రోలు వెంకట రత్నం, సయ్యద్ జానీ బాషా, డా. మైలవరపు లలితకుమారి, తాటికోల పద్మావతి, మన్నం వెంకట గురువు, ఇడపలపాటి చంద్రయ్య, శ్రీశర్మ, గోలి హనుమచ్ఛాస్త్రి, యతిరాజుల బాలాజీ, బందారు సురేష్ బాబు మొదలైన కవులు పాల్గొన్నారు.

# ప్రధాన ఆలయాల్లో అర్జిత సేవలు నిలిపివేత

**భక్తులు రావద్దంటూ అధికారుల ప్రచారం**

**తిరుమల శ్రీవారి పుష్కరిణి మూసివేత**

**భక్తులు లేక కళ తప్పిన అనేక ఆలయాలు**

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కరోనా విజృంభిస్తున్న వేళ ఆలయాలకు భక్తుల రాకతగ్గింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ ప్రభావం కనిపిస్తోంది. కలియుగ వెంకటేశ్వరుడు కొలువైన తిరుమలకు భక్తుల రాక తగ్గింది. కరోనా కట్టడిలో భాగంగా తాజాగా శ్రీవారి పుష్కరిణిని కూడా మూసి వేశారు. భక్తులు పుష్కరిణిలో స్నానాలు చేస్తే వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తిరుమల ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి ప్రకటించారు. భక్తులు రావద్దని దేవాలయ అధికారులే ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పూజలను కూడా తగ్గించారు. ఆలయాల్లో గ్రహణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజలు కూడా ఆలయాలకు వెళ్లేందుకు విముఖత చూపుతున్నారు. తిరుమలలో టైమ్‌స్లాట్ విధానం అమలు చేస్తున్నారు. భద్రాద్రిలో సీతారామ కళ్యాణం వేడుకలను కుదించారు. యాదాద్రికి భక్తుల రాక తగ్గింది. వేములవాడ తదితర ఆలయాల్లో స్క్రీనింగ్ చేసి భక్తులను అనుమతిస్తున్నారు. మొత్తంగా కరోనా వైరస్ విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో అన్ని దేవాలయాలకూ భక్తుల రద్దీ తగ్గింది. తిరుమల, యాదాద్రి, వేములవాడ, ఇంద్రకీలాద్రి, భద్రాద్రి,సింహాచలం, శ్రీశైలం, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలు భక్తుల రాక తగ్గడంతో వెలవెల బోతున్నాయి. ఇకపోతే ఇప్పటికే శిరిడీ ఆలయాన్ని మంగళవారం మధ్యాహ్నం నుంచి నిరవధికంగా మూసివేశారు. అలాగే ముంబైలోని ప్రఖ్యాత సిద్ధి వినాయక ఆలయం కూడా మూతపడింది. కరోనా విస్తరిస్తున్న క్రమంలో తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా టైంస్లాట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. సర్వదర్శనాన్ని పూర్తిగా రద్దు చేసి అన్ని కంపార్టుమెంట్లను మూసివేశారు. మరోవైపు రూ.300 టికెట్లు కలిగిన భక్తులు, కాలినడక భక్తులు తమకు కేటాయించిన సమయాల్లో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. కరోనా భయంతో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గడంతో మూడు గంటల్లోనే శ్రీవారి దర్శనం పూర్తవుతోంది. కరోనా నేపథ్యంలో శ్రీశైలం మల్లికార్జున స్వామికి నిర్వహించే అర్జిత సేవలను ఈ నెల 31 వరకు తాత్కాలికంగా రద్దు చేశారు. కంపార్ట్‌మెంట్లలో ఎక్కువ సేపు వేచి ఉండకుండా స్పర్శ దర్శనాన్ని ఈ నెల 31వరకు పూర్తిగా రద్దు చేశారు. దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి క్షేత్రం కూడా భక్తులు లేక కళావిహీనంగా మారింది.

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి కూడా భక్తుల రాక తగ్గింది. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సుమ పరిమళాలను వెదజల్లే అమ్మవారి ప్రధాన ఆలయ పరిసరాలు, అమ్మవారి అంతరాలయం, ముఖమండపాలు కూడా దాదాపు ఖాళీగానే దర్శనమిచ్చాయి. కరోనా మహమ్మారి నుంచిప్రజలకు రక్షణ కల్పించాలని వరాహలక్ష్మీనృసింహస్వామిని ప్రార్థిస్తూ 'నారసింహ మూల మంత్ర జపం' చేయనున్నట్టు సింహాచలం దేవస్థానం అర్చకులు తెలిపారు. 19న గురువారం నుంచి 32 రోజుల పాటు స్వామి సన్నిధిలో ఉదయం ప్రభాత ఆరాధనతో ప్రారంభించి మధ్యాహ్నం రాజభోగం మహానివేదన వరకు మూలమంత్ర జపం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. కరోనా ప్రభావం వలన భక్తులు అతితక్కువ సంఖ్యలో కనిపించారు. కరోనా దెబ్బకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సత్యదేవుడి ఆలయం భక్తులు లేక వెలవెలబోయింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని మంగళాద్రి క్షేత్రంలో పలు సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు.

## మొక్కల సంరక్షణకు కమిటీలు

నల్లగొండ,మార్చి18(ఆర్ఎన్ఎ): గతేడాది హరితహారంలో చేపట్టిన మొక్కలు ఎండిపోకుండా కాపాడాలని అధికారులు అన్నారు. స్థానిక అధికారులు వాటి రక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొక్కల సంరక్షణ కమిటీలు మండల, డివిజన్ స్థాయిలలో ఉంటాయన్నారు.జిల్లాలో 65వ నెంబరు జాతీయ రహదారి వెంట నాటిన మొక్కల సంరక్షణకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కమిటీలు వేయనున్నామని తెలిపారు.

# మారుతున్న తెలంగాణ రాజకీయ ముఖచిత్రం

**జాతీయ రాజకీయాల కోసం కెసిఆర్ పక్కా వ్యూహం**

**రాష్ట్ర రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించనున్న కవిత**

**ఎమ్మెల్సీగా గెలిచాక క్యాబినేట్‌లో చేరే అవకాశాలు**

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. కెసిఆర్ వ్యూహాలతో ఇప్పటికే తెలంగాణలో విపక్షాలు ఉక్కిరిబిక్కిరి కాగా.. ఇప్పుడాయన చూపు జాతీయ రాజకీయాలపై పడింది. గతంలో అనేకమార్లు తన రాజకీయ లక్ష్యాన్ని ప్రకటించిన కెసిఆర్ ..అందుకు అనుగుణంగా పునాదులు వేస్తున్నారు. అందులో భాగంగానే తనయ కవితకు ఎమ్మెల్సీ పదవి కల్పించేందుకు రంగం సిద్ధం చేశారు. అధికార మార్పిడికి రంగం సిద్ధం అయ్యిందన్న సంకేతాలు ఇస్తున్నారు. కెటిఆర్, కవితలకు అధికార పగ్గాలు అప్పగించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అలాగే పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరిపే పోరుతో కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో అడుగు వేయబోతున్నట్లు కూడా సంకేతాలు అందుతున్నాయి. అసెంబ్లీలో ఇటీవల తీర్మానం సందర్భంగా కెసిఆర్ ప్రసంగం చూసిన వారికి ఈ విషయం అర్థం కాగలదు. అలాగే వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను గమనిస్తే అన్నీ కేవలం కెటిఆర్ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. కెసిఆర్ ఏ ఒక్క అంతర్జాతీయ కార్యక్రమానికి హాజరు కావడం లేదు. జాతీయ రాజకీయాల్లో బిజెపికి వ్యతిరేకంగా చురుకైన పాత్ర పోషించడం ద్వారా, మోడీకి ధీటైన నేతగా నిలవాలని కెసిఆరు కోరుకుంటున్నట్లు ఆయన చేస్తున్న వ్యాఖ్యలు..ప్రసం గాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే కవితకు నిజామాబాద్ నుంచే ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంలోనూ మతలబు ఉంది. నిజామాబాద్‌లో పాగా వేయడం ద్వారా ఎంపి ఎన్నికల్లో పోయిన పరువును అక్కడే మళ్లీ నిలబెట్టాన్న ప్రయత్నం కూడా ఉంది. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున మ

ఆహ్వానం

సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ
కవిసంధ్య - యానాం
సంయుక్త నిర్వహణలో

ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా
యానాం కవితోత్సవం - 2020

కవిత్వంలో ఇటీవలి ధోరణులు
సాహిత్య సదస్సు

తేది : 21 మార్చి 2020, శనివారం, ఉదయం 10 గం॥ల నుండి సా॥ 5 గం॥ వరకు

వేదిక : శ్రీ యర్రా వెంకటరత్నం గీతాభవనం కామిశెట్టివారి వీధి, యానాం

ప్రారంభ సదస్సు : 10 గం॥లకు

సభా ప్రారంభకులు : డా॥ కృత్తివెంటి శ్రీనివాసరావు, కార్యదర్శి, సాహిత్య అకాడెమీ
ముఖ్య అతిథి : మాన్యశ్రీ మల్లాడి కృష్ణారావు, ఆరోగ్యశాఖామాత్యులు, పుదుచ్చేరి ప్రభుత్వం
కీలక ప్రసంగం : శ్రీ కె. శివారెడ్డి, సరస్వతీ సమ్మాన్ గ్రహీత, కన్వీనర్, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడెమీ
గౌరవ అతిథులు : డా॥ డి. విజయ్‌భాస్కర్, కేంద్ర సంగీత నాటక అకాడెమీ పురస్కార గ్రహీత; శ్రీ భాదర్ మొహియుద్దీన్
అధ్యక్షులు : కళారత్న డా॥ శిఖామణి, సంపాదకులు: కవిసంధ్య - సభ్యులు: తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడెమీ
సదస్సు ప్రస్తావన : కళైమామణి శ్రీ దాట్ల దేవదానంరాజు ఉపాధ్యక్షులు, కవిసంధ్య
ఆత్మీయ అతిథులు : శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి, సంచాలకులు ఆంధ్రీకుటీరం, పల్లిపాలెం; శ్రీ గనారా, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సాహితీ స్రవంతి, కాకినాడ; డా॥ వరుగు భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, డా. ఎస్. ఆర్. కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యానాం
ఆహ్వానం : శ్రీ ముమ్మిడి శ్రీవీరనాగ ప్రసాద్ (చిన్నారి) కవి, చిత్రకారులు

మొదటి సదస్సు - 12.00
అధ్యక్షులు : డా॥ పాపినేని శివశంకర్, కవిత్వం - సంఘటన
వక్తలు : శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య, కవిత్వం - వస్తు శిల్పాలు; శ్రీ ప్రసేన్, కవిత్వం - వాక్య నిర్మాణం; డా. చల్లపల్లి స్వరూపరాణి, స్త్రీల కవిత్వం - కులం: మతం

భోజన విరామం

రెండవ సదస్సు 2.00
అధ్యక్షులు : శ్రీ భాదర్ మొహియుద్దీన్
వక్తలు : శ్రీ నామాడి శ్రీధర్ కవిత్వం - భాష అభివ్యక్తి; డా. యాకూబ్ కవిత్వ విమర్శ - యువ స్వరాలు; శ్రీ ఎం. నారాయణశర్మ ఇటీవలి పద్య కావ్యాలు

మూడవ సదస్సు 3.00
అధ్యక్షులు : శ్రీ జి. లక్ష్మీనరసయ్య, కవిత్వంలో కొత్త గొంతులు
వక్తలు : డా. ప్రసాదమూర్తి, కవిత్వం - నిరసన స్వరం; డా. కాత్యకూరి శైలజ, కవిత్వం - స్థానీయత; శ్రీ బొల్లోజు బాబా, కవిత్వం - అనువాదం
వందన సమర్పణ : శ్రీ చెల్లి రవి, కవి, యానాం

...

సాహిత్య అకాడెమి కవిసంధ్య

కవిసంధ్య, యానాం - ఆంధ్రీకుటీరం, పల్లిపాలెం సంయుక్త నిర్వహణలో
కళా ప్రపూర్ణ మధునాపంతుల శతజయంతి మహోత్సవం, యువకవి సమ్మేళనం
ఆంధ్రీకుటీరం - కవిసంధ్య కవితల పోటీల
బహుమతుల ప్రదానం : సాయంత్రం 5 గం॥లకు
ముఖ్యఅతిథి : శ్రీ కె.శివారెడ్డి
గౌరవ అతిథులు : డా॥ డి.విజయభాస్కర్, డా॥ శిఖామణి
అవార్డు ప్రదాత : శ్రీ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి
అధ్యక్షులు : శ్రీ దాట్ల దేవదానంరాజు
న్యాయనిర్ణేతల స్పందన : శ్రీ సన్నిధానం నరసింహశర్మ, శ్రీ అద్దేపల్లి ప్రభు

పద్యకవితల విజేతలు
శ్రీ కందిపాటి గోపాలరావు, (ప్రథమ)-శ్రీ శనారా (ద్వితీయ)
శ్రీ పూసల రజనీ గంగాధర (తృతీయ),
స్ఫూర్తాహక బహుమతులు :
డా. ఎస్.వి. రాఘవేంద్రరావు, శ్రీ ఏ. గోపీనాథరావు, డా. కె.వి.ఎల్.ఎన్. శర్మ,

వచన కవితల విజేతలు
సి.హెచ్.లక్ష్మీనాయుడు, (ప్రథమ), లండ సాంబమూర్తి, (ద్వితీయ),
శిఖా ఆకాష్, (తృతీయ)
స్ఫూర్తాహక బహుమతులు :
శ్రీ శిల్పా జగదీష్, శ్రీ కెౌలూరి ప్రసాదరావు, శ్రీమతి శారద ఆవాల

యువకవి సమ్మేళనం
అధ్యక్షులు : శ్రీ బొల్లోజు బాబా - సమన్వయం : సి.హెచ్.రాం
ప్రారంభకులు : పుప్పాల శ్రీరామ్
పాల్గొనువారు
సురేంద్రదేవ్ చెల్లి, సుంకర గోపాలయ్య, మెట్టా నాగేశ్వరరావు, ముమ్మిడి నాగప్రసాద్ (చిన్నారి), పొనుగుమట్ల అశోక్‌కుమార్, అపధానుల మణిబాబు, గూటం స్వామి, జజ్జూరి వేణుగోపాల్, కుంచే నాగసత్యనారాయణ, మార్ని జానికిరామ్‌చౌదరి, పొత్తూరి సీతారామరాజు, ర్యాలి శ్రీనివాస్, బడుగు భాస్కరజోగేష్, ఐ.ఎస్.గిరి, నృసింహదేవర శ్రీనివాసశర్మ తదితరులు...


# రేవంత్‌రెడ్డికి హైకోర్టులో బెయిల్

## పదివేల చొప్పున పూజీకత్తు సమర్పించాలని ఆదేశాలు
## పోలీసుల విచారణకు సహకరించాలని సూచన
## రాష్ట్ర ప్రభుత్వం సభాహక్కులను ఉల్లంఘిస్తోందన్న ఉత్తమ్

హైదరాబాద్/న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): డ్రోన్ కేసులో ఎంపీ రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రేవంత్ రెడ్డి తరుపున ఏఐసీసీ నుండి వచ్చిన సుప్రీం కోర్టు సీనియర్ లాయర్, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ వాదించారు. డ్రోన్ కేసులో అరెస్ట్ అయి గత 14 రోజులుగా రేవంత్ రెడ్డి చర్లపల్లి జైలులోనే ఉన్నారు. తొలుత బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను కూకట్‌పల్లి కోర్టు కొట్టివేసింది. దీంతో రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన అభియోగాలు, ఎఫ్ఐఆర్, కేసును పూర్తిగా కొట్టివేయాలనే పిటిషన్‌లతో పాటు బెయిల్ పిటిషన్లను దాఖలు చేయగా. బెయిల్ ఇస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. రూ.10 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. కేసు విచారణలో పోలీసులకు సహకరించాలని కూడా ఆదేశించారు. అయితే, తనపై నమోదైన ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలన్న మరో పిటిషన్‌ను మాత్రం కోర్టు 4 వారాలకు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు పోలీసులను ఆదేశించింది.కేటీఆర్ ఫాంహౌజ్‌పైన డ్రోన్ ఎగరేసి చిత్రీకరించిన ఆరోపణలపై ఎంపీ రేవంత్ రెడ్డి అరెస్టయ్యారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రోన్లు ఎగరేసి కెమెరాతో చిత్రీకరించడం నేరమని రేవంత్ రెడ్డిని నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. జీవో నెం. 111ను ఉల్లంఘించి మంత్రి కేటీఆర్ ఫాంహౌజ్ నిర్మించుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఆ విషయాన్ని నిరూపించేందుకు తాను డ్రోన్ ఎగరేసినట్లు చెప్పారు. అయితే, రేవంత్ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఇలా వ్యవహరిస్తున్నారని టీఆర్ఎస్ నేతలు ఆరోపింస్తున్నారు. గోపన్‌పల్లి వ్యవహారంలో రేవంత్ రెడ్డిని ఇరుక్కున్నందుకు, ప్రతిచర్యగా ఆయన జీవో 111 అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి నిర్బంధాన్ని ఖండిస్తున్నామని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సభాహక్కులను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే లోక్‌సభ స్పీకర్‌ను కలిశామని.. విచారణ జరపాలని కోరామన్నారు. హోంమంత్రిని కూడా కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే దీనిపై తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. పార్టీ సీనియర్ నేతలతో చర్చించి.. ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్తామని ఉత్తమ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేనిపోని తప్పుడు కేసులు బనాయించి రేవంత్‌రెడ్డిని వేధిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి తామంతా పూర్తి మద్దతుగా ఉన్నామని చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పై పోలీసులు ఏ మాత్రం ప్రాధాన్యం లేని, చిన్న చిన్న కేసులు పెట్టారన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మరోసారి కలిసి ఎంపీగా రేవంత్ రెడ్డి హక్కులను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తోందని వివరిస్తానని చెప్పారు. సభా హక్కుల కమిటీకి ఫిర్యాదు చేసి, మొత్తం వ్యవహారంపై విచారణ జరపమని కోరతామన్నారు. హోమ్ మంత్రి అమిత్ షాను కలిసి రేవంత్ రెడ్డి పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు

# కరోనాపై కేంద్రం సమాచార సేకరణ

## రాష్ట్రాల నుంచి నివేదికలు తెప్పించుకుని విశ్లేషణ

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. దేశంలో కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుంది. భారత్‌లో కరోనా కేసుల సంఖ్య 147కు చేరింది. ఇందులో 122 మంది భారతీయులు కాగా, 25 మంది విదేశీయులు ఉన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు ముగ్గురు మృతి చెందారు. ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్రలో ఒక్కొక్కరి చొప్పున ప్రాణాలు కోల్పోయారు.కేంద్ర వైద్యారోగ్య శాఖ ఎప్పటికప్పుడు రాష్ట్రాల్లో తీసుకుంటున్న చర్యలను తెలుసుకుంటున్నది. అలాగే అన్ని రాష్ట్రాల నుంచి నివేదికలు తెప్పించుకుంటోంది. విదేశాల నుంచి ప్రయాణికులపై నిఘా పెట్టింది. అన్ని ఎయిర్‌పోర్టుల్లో థర్మల్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. రైళ్లలోనూ ఈ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రయాణికులను పరీక్షిస్తున్నారు. దాదాపు అన్ని రాష్ట్రాలు ఈ నెల 31 వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాయి.రద్దీ ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సినిమా హాల్స్, మాల్స్, పబ్బులు, క్లబ్బులను మూసివేశారు. కరోనా కేసులను రాష్ట్రాల వారిగా పరిశీలిస్తే..అత్యధికంగా మహారాష్ట్రలో 41 కేసులు నమోదు అయ్యాయి. ఇందుల్లో ముగ్గురు విదేశీయులు ఉన్నారు. రెండో స్థానంలో కేరళ నిలిచింది. కేరళలో 27 కేసులు నమోదు కాగా, ఇద్దరు విదేశీయులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ లో 16, కర్ణాటకలో 11, ఢిల్లీలో 9, లఢక్ లో 8, తెలంగాణలో 3, జమ్మూకశ్మీర్ లో 3, రాజస్తాన్ లో 2 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఉత్తరాఖండ్, బెంగాల్, తమిళనాడు, పంజాబ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరికి మాత్రమే కరోనా పాజిటివ్ వచ్చింది.

చైనాలో విజృంభించిన కరోనా వైరస్ ప్రపంచ దేశాలకు వ్యాపించింది. ఇప్పటి వరకు 165 దేశాలకు కరోనా వైరస్ విస్తరించింది. ప్రపంచ వ్యాప్తంగా లక్షా 98 వేల 426 మందికి కరోనా సోకగా, 7,987 మంది మృతి చెందారు. చైనాలో కరోనా మృతుల సంఖ్య 3,237కు చేరింది. ఇటలీలో 2,503 మంది, ఇరాన్‌లో 988, స్పెయిన్‌లో 533, ఫ్రాన్స్‌లో 175, అమెరికాలో 115, దక్షిణ కొరియాలో 84, యూకేలో 71, నెదర్లాండ్స్‌లో 43, జపాన్‌లో 29 మంది మృతి చెందారు. భారత్‌లో కరోనాతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

# రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యకు కరోనా చెకప్

## -రాజ్యసభలో మాస్క్‌లతో రావడంపై ఆక్షేపణ

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): రాజ్యసభలో స్క్రీన్ టెస్ట్ ద్వారా సభ్యులకు కరోనా చెకప్ చేశారు. సభకు వచ్చే సమయంలో ఛైర్మన్ వెంకయ్యనాయుడు.. తన టెంపరేచర్ చెక్ చేయించుకున్నారు. థర్మోమీటర్ గన్‌తో ఆయనకు వైద్య పరీక్షలు చేశారు. కరోనా వ్యాప్తిని అరికట్టే నేపథ్యంలో ఈ తరహా వైద్య పరీక్షలు చేపట్టారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కొందరు ఎంపీలు రాజ్యసభకు మాస్క్‌లతో వచ్చారు. అయితే దీనిపై ఛైర్మన్ వెంకయ్యనాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖానికి పెట్టుకున్న మాస్క్‌లను తీసివేయాలని సభ్యులను కోరారు. రాజీవ్ గౌడ, ఆనంద్ శర్మలు.. ఛైర్మన్ సూచనల పట్ల స్పందించారు. కరోనా సాకుతో పార్లమెంట్‌ను వాయిదా వేయరాదు అని కోరారు. కరోనా వైరస్‌కు తాము ఎంపీలమన్న విషయం తెలియదని గౌడ అన్నారు. సభ కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ కోరారు. ఆ సమయంలో మరోసారి ఛైర్మన్.. మాస్క్‌లు తీసివేయాలని సభ్యులను కోరారు. ఈ విషయం వ్యక్తిగతమైందని, దాన్ని ఎవరిది వాళ్లకే వదిలేయాలని కాంగ్రెస్ ఎంపీ చిదంబరం అన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన వారు మలేషియాలో చిక్కుకున్నట్లు మొహమ్మద్ అలీ ఖాన్ అన్నారు. తృణమూల్ ఎంపీ సదీముల్ హక్ మాస్క్‌తోనే మాట్లాడారు.

# విదేశాల్లో చిక్కుకున్న వారిని రప్పించండి

## కేంద్రమంత్రులకు కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో విదేశాల్లో చిక్కుకున్న భారీతీయులను తక్షణం రప్పించాలని రాష్ట్ర మంత్రి కేటీఆర్.. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, విమానయాన శాఖ మంత్రి హర్దీప్ ఎస్ పూరిలను కోరారు. ఈ మేరకు కెటిఆర్ ట్వీట్ చేశారు. మనీలా, కౌలాలంపూర్, రోమ్ విమానాశ్రయాల్లో దేశానికి చెందిన విద్యార్థులు చిక్కుకున్నట్లు సోషల్ మీడియా ద్వారా తనకు సమాచారం అందిందని, వారిని స్వదేశానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా స్పందించి, వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ కోరారు. కౌలాలంపూర్, మనీలా విమానాశ్రయంలో రెండు రోజులుగా తెలుగు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనా దృష్ట్యా పలు దేశాల నుంచి మన దేశానికి వచ్చే విమానాలను నిలిపివేశారు. అధికారులు స్పందించక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, అధికారులు స్పందించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.

# సాహితీకిరణం ఉగాది మహోత్సవ కార్యక్రమాలు వాయిదా

కరోనా వ్యాప్తిని నిలుపుదల చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల మార్చి 31 వరకు సభలు, సమావేశాలు రద్దు చేసినందున శ్రీత్యాగరాయ గానసభ 4 మినీహాళ్ళలోని కార్యక్రమాలు రద్దు చేసినట్లు అధ్యక్షులు కళాజనార్దనమూర్తి తెలిపారు. అందుచేత మార్చి 22వ తేదీన సాహితీకిరణం నిర్వహించే ఉగాది మహోత్సవ కార్యక్రమాలు వాయిదా వేయక తప్పలేదు. కార్యక్రమం ఎప్పుడు జరిగేది అనే విషయాన్ని తరువాత తెలియజేస్తాము. కవిసమ్మేళనంలో పాల్గొనే కవులు, కవయిత్రులు, పురస్కార గ్రహీతలు సహకరించవలసిందిగా కోరుతున్నాము.

పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు-సాహితీకిరణం

# పక్కాగా మిషన్ భగీరథ పనులు

## త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలు

సిద్దిపేట,మార్చి18(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథలో భాగంగా ఇంటింటికి మంచినీటిని అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లాస్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి నివేదికలను సిద్దం చేస్తున్నారు. అధికారులు ప్రతి గ్రామంలో ఉదయం ఇంటింటికి తిరిగి మిషన్ భగీరథ పనులు ఎలా జరుగుతున్నాయన్నది పరిశీలిస్తున్నారు. ఇందులో లోపాలు ఏమైనా ఉన్నాయా, ప్రజల అభిప్రాయం ఎలా ఉంది. ఇంకా ఏమైనా మార్పులు చేయాలా, గ్రామంలోని ఎగువ, దిగువ ప్రాంతాలకు మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా పనులు జరుగుతున్నాయన్నది సమగ్రంగా పరిశీలించనున్నారు. మిషన్ భగీరథ సమీక్ష సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు పైపులైను పనులను సంబంధిత ఏజెన్సీలు ఇష్టారీతిగా చేస్తున్నాయని, దీనివల్ల లీకేజీలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారు దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో అధికారుల బృందాలు గ్రామాల్లో పర్యటించాలని నిర్ణయించారు. రాబోయే 30 సంవత్సరాలకు తగ్గట్లుగా ఈ పథకాన్ని రూపొందించినందున లోపాలను గుర్తించి నిర్మాణ సమయంలోనే సరి చేయాలని చెప్పారు. ఇందుకోసం అధికారులు సమగ్ర నివేదికను ఇస్తే అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కో జిల్లా స్థాయి అధికారి ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందం ఒక్కో నివాస ప్రాంతంలో పర్యటించేలా ప్రణాళిక రూపొందించారు. మిషన్ భగీరథ పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించమని, పక్షం రోజుల్లో లోపాలను సవరిస్తూ పనులను నిర్వహించకపోతే సంబంధిత ఏజెన్సీలతోపాటు, అధికారులపై చర్యలు తప్పవని వెంకటరాంరెడ్డి అన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే సంబంధిత అధికారులు, గుత్తేదార్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పాలమూరుకు నిధులు కేటాయించాలి

మహబూబ్‌నగర్,మార్చి18(ఆర్ఎన్ఎ): పాలమూరు ఎత్తిపోతల పథకంకు కేటాయించిన నిధులు చూస్తే పదేళ్లు అయిన ప్రాజెక్టు పూర్తి కాదని బిజెపి కార్యదర్శి ఆచారి అన్నారు. కేసీఆర్ ఓటు బ్యాంకు రాజకీయలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చెక్ పెట్టాలని అన్నారు. బంగారు తెలంగాణ చేస్తామన్న సీఎం కేసీఆర్ నేడు కుటుంబ తెలంగాణ చేశారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలదే హవా నడుస్తోందని మిగిలిన వారు నామామాత్రంగా సభ్యులుగా ఉన్నారని ఆయన విమర్శించారు. మంత్రివర్గంలో మహిళలకు అవకాశం ఇవ్వకుండా మహిళా అభివృద్ధి గురించి మాట్లాడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వచ్చే లోక్‌సబ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలన్నారు.

# ప్రజల్లోకి అభివృద్ధి కార్యక్రమాలు

## బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలి

కొత్తగూడెం,మార్చి18(ఆర్ఎన్ఎ): రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు అన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగా రాష్ట్రాన్ని పారిశ్రామికంగానే కాకుండా మౌలిక సౌకర్యాల కల్పనలో, నిరుపేదలకు అండగా నిలిచేందుకు సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తరువాత అతి తక్కువ సమయంలో అతి పెద్ద ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఆసరా పథకం ద్వారా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు అండగా నిలిచారని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా ఇచ్చే కార్యక్రమం ఈ ఏడాది చివరి నాటికి కార్యరూపం దాలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మిషన్ భగీరథతో తాగునీటి సౌకర్యం కోసం వేల కోట్లు ఖర్చుచేస్తున్నారని అన్నారు. ప్రజలు పనిచేసే వారినే అడుగుతారని, చేయని వారిని అడగరని, ఈ వాస్తవాన్ని కార్యకర్తలు, నాయకులు గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానని తెలిపారు. ఖాళీగా ఉన్న

# గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో గర్భిణికి పురిటి నొప్పులు

## 108 రప్పించి పురుడు పోసిన వైద్యులు

మహబూబాబాద్,మార్చి18(ఆర్ఎన్ఎ): కొండపల్లి నుంచి మహబూబాబాద్‌కు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఓ గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో గార్ల రైల్వేస్టేషన్‌లో దిగిపోవాల్సి వచ్చింది. రైల్లోనే ఆమెకు పురిటినొప్పులు రావడంతో ఈ విషయాన్ని గమనించిన ప్రయాణికులు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. స్టేషన్ మాస్టర్ వెంటనే 108కి ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. డాక్టర్‌తో సహా వైద్య సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మహిళకు వైద్యం అందించారు. రైల్వే స్టేషన్‌లోనే గర్భిణికి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పురుడు పోశారు. శైలజ మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారు. 108 వాహనంలో మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఆంధ్రప్రదేశ్ భవన్‌లో కరోనా వైరస్ నిరోధకాలు

## యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్న అధికారులు

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా కట్టడిపై ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ భావన సక్సేన నడుం బిగించారు. ఆంధ్రప్రదేశ్ భవన్ ను సందర్శించే పర్యాటకులు, అతిథులు, అధికారికంగా నివాసం ఉంటున్న ఉద్యోగులు, స్వర్ణముఖి, గోదావరి, శబరి బ్లాకుల్లోని రూములలో తాత్కాలికంగా ఉండే అధికారులు, అతిథులు ఆందోళన చెందకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రెసిడెంట్ కమిషనర్ భావన సక్సేనా తెలిపారు. అందులో భాగంగా భవన్ లోని రిసెప్షన్ లో, రూములలో, శానిటైజర్స్ ను అందుబాటులో ఉంచినట్లు, భవన్ అధికారులు, సిబ్బందిని నిరంతరంగా అప్రమత్తంగా ఉండేటట్లు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఏపి భవన్ వైద్యుల సలహాలతో నివారణ చర్యలుచేపట్టారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కమిషనర్ భావన సక్సేన భవన్ అధికారులతో కలిసి సూచనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కరోనా వైరస్ ఎంత ప్రమాదకారమో, ఎలా వ్యాప్తి చెందుతుందో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మొదలైనవాటిమీద అవగాహన సదస్సును నిర్వహించడానికి భవన్ వైద్యులతో త్వరలో సమావేశం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఏపీ భవన్ పరిసరాల్లో ఎవరు కుడా వ్యాధి బారిన పడకుండా బహిరంగ ప్రదేశాల్లో శానిటేషన్, ఏపీ భవన్ కార్యాలయాలు, అతిథి రూములలో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఎపి భవన్ హౌస్ కీపింగ్ నుంచి ప్రత్యేక బృందాన్ని అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు లిఫ్టులు, రూములు, రైలింగ్స్ మొదలైనవాటిని ఎప్పటికప్పుడు శానిటైజర్స్‌తో శుభ్రపరుస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భవన్ లోని క్యాంటీన్ కాంట్రాక్టర్ కు అతిథుల కొరకు కరోనపై తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, వారి సిబ్బందిని తగుజాగ్రత్తలతో మసులుకోవాలని తెలిపినట్లు చెప్పారు. ఏపీ భవన్ పరిసరాల్లో కరోనా అవగాహన కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రదర్శన బోర్డులు ఉంచడం జరిగిందని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఏపీ భవన్ అధికారులు కరోనాపై వైద్య సదుపాయాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన అత్యవసర నెంబర్ల సమాచారం కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అంతే కాకుండా ఏపీ భవన్ అధికారులు, సిబ్బంది మాస్కులు ధరించి అప్రమత్తతతో కూడిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భవన్ లోని ఆడిటోరియం, సమావేశమందిరం మొదలైనవాటిని తదుపరి ఆదేశాలు అందుకోనేంతవరకు తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని ఎపి భవన్ రెసిడెంట్ కమిషనర్ భావన సక్సేనా తెలిపారు.

# నిర్భయ దోషులకు రేపు మృత్యుదండన

## తీహార్‌లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
## జైలులో పరిశీలన చేసిన ఉరితీసే తలారి

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ అత్యాచారం, హత్య కేసులో దోషులకు ఉరి నుంచి తప్పించుకునే మార్గాలు అన్నీ దాదాపుగా మూసుకుపోయాయి. ఉరిశిక్ష అమలుకు తీహార్ జైలులో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే తలారి అందుకు తగ్గ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 20న ఉదయం దోషులకు ఉరివేయనున్నారు. ఈ మేరకు జైలు అధికారులు తలమునకలయ్యారు.

నిర్భయ కేసులో నలుగురు దోషులకు మార్చి 20వ తేదీన ఉరిశిక్ష అమలు చేయాలని పాటియాలా హౌస్ కోర్టు డెత్ వారంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 2012లో వైద్య విద్యార్థినిపై ఆరుగురు వ్యక్తులు అత్యంత దారుణంగా అత్యాచారం చేయగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. ఆరుగురు దోషుల్లో ఒకరు మైనర్ కావడంతో శిక్ష అనుభవించి విడుదల అయ్యాడు. ప్రధాన దోషి రామ్ సింగ్ జైలులో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. నిర్భయ దోషుల్లో ఒకరైన ముఖేశ్ సింగ్ తల్లి ఉరిశిక్ష అమలుపై జోక్యం చేసుకోవాలని జాతీయ మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే ఈ పిటిషన్‌ను తోసిపుచ్చినట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధికారులు తెలిపారు. ఈ సమయంలో నిర్భయ దోషుల్లో ఒకరైన అక్షయ్ కుమార్ సింగ్ భార్య పున